# కథామంజరి

## పది కథల సమాహారం



మే 2022

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**మే 2022**

సంపుటి : 3 ♦ సంచిక : 5

# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**

**కృపాకర్ పోతుల**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**

**కొచ్చెర్ల వి.ఆర్.**

**సూరంపూడి చలపతిరావు**

# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

- శ్రీ వెంపటి కామేశ్వరరావు గారు
- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ అవసరాల రాఘవరావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీ అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి

శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | | i |
| విశిష్ట అతిథి | | ii |
| కథా మార్గదర్శి | | iv |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| డామిట్, కథ అడ్డం తిరిగింది | వసుంధర | 1 |
| గరీబీ(బ్) హటావో | ద్విభాష్యం రాజేశ్వరరావు | 6 |
| ఆచూకీ చెబుతారా? | బాడిశ హన్మంతరావు | 10 |
| ఇచ్చట ఓట్లు అమ్మబడును | బలభద్రపాత్రుని ఉదయ శంకర్ | 14 |
| కాదేది కల్తీకి అనర్హం | కోయిలాడ రామమోహనరావు | 18 |
| తమసోమా జ్యోతిర్గమయా | డా. జడా సుబ్బారావు | 22 |
| విద్యాధరి కుక్కపిల్ల | చాగంటి ప్రసాద్ | 26 |
| అత్తయ్య చీర | గొర్తి వాణి శ్రీనివాస్ | 31 |
| ప్రేరణ | గేరపాటి భానువర్ధన్ | 35 |
| భోగ భూపాలం | పి.వి.ఆర్. శివకుమార్ | 41 |
| గోరింట పూచింది | డా. ఆర్. అనంత పద్మనాభరావు | 47 |
| వినదగునెవ్వరు చెప్పిన .. | రాంబో | 55 |


Cover Page Credits : Mr Alex Azabache, Miami

ఈ నెల కథామంజరి సంచికకి

దాతయైన కథాభిమాని

కీ.శే. వేపా తిమ్మయ్య స్మారకార్థం

శ్రీమతి వేపా ఉమామణి

(విశ్రాంత స్టేట్‌బ్యాంక్ అధికారిణి)

వారికి మా హృదయపూర్వక

కృతజ్ఞతలు



# కథాకీయం

వందేళ్ళ తెలుగు కథ నిత్యనూతనంగా ఎప్పుడూ వెలుగులు పంచుతునే ఉంది. యథాతథ కథలు, ఊహాత్మక కథలు రచయిత మనోఫలకం మీద పురుడు పోసుకుని, వారి ఆలోచన, దృక్పథం, నమ్మిన సిద్ధాంతాలకు ప్రతిరూపంగా తీర్చిదిద్దబడి, పాఠకలోకాన్ని చేరుతూనేఉన్నాయి. ఎప్పుడూ కథలకి ఆలంబన పత్రికలనే చెప్పాలి. కొండకచో.. రచయితలు కథలను స్వయంగా గాని, ప్రచురణకర్తల ద్వారా గాని నేరుగా కథాసంకలనాల రూపంలో పాఠకులకు చేరవేస్తారు. ఈ కథలలో కూడా చాలా వరకు ముందు ఏదో ఒక పత్రికలో ప్రచురించబడినవే. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే... నిన్న మొన్నటి వరకు రచనలు చేయడంలో రచయితలకు నిండుగా స్వేచ్ఛ ఉండేది. మరి ఇప్పుడు .. మారుతున్న సామాజిక, సాంకేతిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని మార్పులు జరిగాయి, జరుగుతున్నాయి.


కథ మౌలికంగా సమాజ పరిస్థితులకు దర్పణం. మన సమాజంలో ఈ శతాబ్దంలో జరిగిన పెనుమార్పుల ఫలితంగా కొత్త కోణాల్లో, కొత్త ఆలోచనలతో, ఈనాటి సాంకేతిక యుగానికి అనుగుణంగా తెలుగు కథ నూతనరూపాలు దిద్దుకుంటోంది. ముద్రణలో వచ్చే పత్రికల సంఖ్య తగ్గడం, అంతర్జాలం, సాంఘికమాధ్యమాలు కథల వితరణకి చేయూతనివ్వడంతో పుంఖానుపుంఖంగా కథలు పాఠకులకు చేరుతూనే ఉన్నాయి. ఈ మార్పులవల్ల వచ్చిన పరిస్థితులలో కథకులకు కొన్ని నిబంధనలు విధించాల్సివస్తోంది. ఉదాహరణకు కథాంశం, నిడివి, భాష.. వంటి విషయాలలో నిబంధనలు, సూచనలు. ఈ మేరకు కథకుడి స్వేచ్ఛ తగ్గుతుంది. ఈ నిబంధనలు, సూచనల నడుమ రచనలు చెయ్యాలి.

ఈ పోకడలు కూడా మంచివే అనిపిస్తోంది. ఇవి ఎక్కువగా పోటీలలో కనిపిస్తున్నాయి. స్వేచ్ఛ తగ్గిన ఈ వాతావరణంలో ఓ మంచి కథ రాయడానికి రచయిత ఎక్కువ కృషి చేస్తాడు, తన ఆలోచన పరిధిని విశాలం చేస్తాడు. అన్ని దృక్కోణాలలో అలోచనలు చేస్తాడు. సమాజంలో కనబడే అన్ని విషయాలు, సమస్యలు, మంచి చెడు.. అన్నిటిని పరిశీలించి, అవగాహన చేసుకుని రచనలు చేయడానికి ఉపక్రమిస్తాడు. తన సిద్ధాంతాలని మరో కోణంలో ఆలోచించే అవసరం వస్తుంది. అంతే కాక, ఎన్నో కొత్త విషయాలను తెలుసుకోడానికి అవకాశాల్ని ఈ పరిస్థితులు కల్పిస్తున్నాయి. సమయపాలన అలవడుతుంది. ఈ పోటీలలో, పోటీ వాతావరణంలో నెగ్గుకురావాలనే తపన వస్తుంది. వీటన్నింటిని జయించి, పరీక్షల్లో నెగ్గకపోయినా సరే.. మంచి రచయితగా నిలబడ్డానికి అవకాశాలు వాటంతటఅవే వస్తాయనడంలో సందేహం లేదు! ఇన్ని కష్టాలని చూసిన రచయిత కలం మరింత పదునెక్కుతుంది. అది చిందించిన కథలు మరింత తేజోవంతమవుతాయి. ఈ మార్పుని అందరం హృదయపూర్వకంగా ఆహ్వానిద్దాం!

ఇప్పుడు నడుస్తున్న పోటీ ప్రపంచంలో రచనలు చేసేవారికి ఎదురవుతున్న ఈ మార్పులను చూస్తుంటే .. చిన్నప్పుడు విన్న రాజుగారి కథ జ్ఞాపకం వస్తోంది! ఆ కథ పేరు "అంతా మన మంచికే!"

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



## శ్రీ రేవూరి అనంత పద్మనాభరావు గారు

చిన్నప్పుడు పిల్లలకి పేరు పెట్టినప్పుడు, ఏ తల్లిదండ్రులైనా చాలా ఆలోచించి, తమ పూర్వీకులను తలుచుకుంటూ, సార్ధకనామధేయుడు కావాలని ఆకాంక్షిస్తూ పేరు పెడతారు. అందరూ అలా కాకపోవచ్చు గాని, అలా సార్ధకనామధేయుడుగా 'అనంతమైన' సాహితీసంపదతో, తెలుగులో అన్ని సాహితీ ప్రక్రియలలో ఆరితేరిన ఓ అరుదైన ఆణిముత్యం డా. రేవూరి అనంత పద్మనాభరావు గారు. అటు ఉద్యోగపరంగా ఉన్నత శిఖరాలను అధిష్టించి, ఇటు సాహితీ లోకంలో కథ, నవల, కవిత, పద్యం, ఆధ్యాత్మికం, జీవిత చరిత్ర, అనువాదం, విమర్శ, పరిజ్ఞానం... ఒకటేమిటి అన్ని ప్రక్రియలలో అనంతమైన పేరు ప్రఖ్యాతులను సాధించారు. పద్మనాభరావుగారిని ఒక్క రచయితగానే చూడ్డానికి లేదు. అసలు ఇలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలిలో మరో అరుదైన 'ప్రజ్ఞ' ని చూస్తాం. అదే 'అవధానం'. వక్తగా, ప్రయోక్తగా వీరు ఆ రంగాలలో కూడా పేరు ప్రఖ్యాతులు సాధించడమే కాకుండా 'అవధాని'గా తెలుగుసాహితీ ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు గడించారు. కేవలం తెలుగు భాషకే "సొంతం" అని గర్వంగా చెప్పుకునే అవధాన ప్రక్రియలో పేరు సంపాదించుకున్న తెలుగు కథా రచయిత బహుశః ఈయనేనేమో!

స్వతహాగా రాయాలనే ఆలోచన శ్రీ పద్మనాభరావుగారికి యుక్తవయసులోనే వచ్చింది. ఎమ్.ఎ. చదివిన తర్వాత, తెలుగు అధ్యాపకుడుగా పని చేస్తున్నప్పుడు ఎక్కువ పుస్తకాలు చదవడం, ఆ రోజుల్లో ఊర్లో జరిగే సాహితీ సమావేశాలు, రచనలకి, రచయితలకు ఉండే ఓ విధమైన గుర్తింపు.. వంటివి కొంతవరకు స్ఫూర్తినిచ్చాయి. "నిజానికి నేను ఎక్కువగా పుస్తకాలు చదువుతాను.. ఇప్పటికినూ! వాటిలో ప్రతీ అక్షరం పరిశీలనాత్మకంగా చదివే అలవాటుంది. అలా ఇతిహాసం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అన్నీ చదివాను. అవే నాకు స్ఫూర్తినిచ్చాయి. నా మొదటి నవల రాయడానికి, నేను డబ్భై నవలలు చదివాను. వాటి నడక, శైలి, శిల్పం, వాక్య నిర్మాణం....ఇత్యాదుల్ని అవగాహన చేసుకున్న తర్వాతే నేను నవల రాసాను. అందుకే అందరు రచయితలు నాకు స్ఫూర్తిదాతలే అని చెప్పాలి! అయితే కొంచెం ఎక్కువ ఇష్టం ఎవరంటే.. గొల్లపూడి మారుతీరావు గారే! వ్యక్తిగా, రచయితగా, ఓ సహోద్యోగిగా ఆయనంటే నాకు చాలా ఇష్టం! ఆయన రచనలంటే మరీ ఇష్టం!" అంటూ తన సాహితీ ప్రస్థానం గురించి సూక్ష్మంగా చెప్పుకొచ్చారు.

ఇప్పటికీ అంటే డెబ్బై ఐదో ఏట కూడా రోజుకి ఓ పది పేజీలు ఏదో ఒకటి రాయనదే ఆయన నిద్రపోరు. సరిగ్గా ఇరవై ఐదో ఏట, 1972లో, శ్రీ పద్మనాభరావు గారి మొదటి కథ "జమీన్ రైతు" ఉగాది సంచికలో (ఏ పత్రికలో) ప్రచురితమైంది. తర్వాత వందకు పైగా కథలు వివిధ వార, మాసపత్రికలలో ప్రచురితమయ్యాయి. *కథాకమామీషు, కథామందారం, గోరింట పూచింది, కథా*

దర్పణాలు.. వంటి కథాసంపుటాలు కూడా వెలువడ్డాయి. మారని నాణెం, కుంచె వెలుగు, వక్రించిన సరళరేఖ, స్వగతాలు.. వంటి వీరి నవలలు చాలా ప్రాచుర్యం పొందాయి. వేలల్లో వ్యాసాలు రాసిన, రాస్తున్న శ్రీ పద్మనాభరావు గారు, మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి, ప్రకాశం పంతులు, రాయలసీమ రత్నాలు పేరిట ఎంతోమంది ప్రముఖుల జీవితచరిత్ర గ్రంథాలు రాసారు. స్టోరీ మిర్రర్ అనే సంస్థ వారు రోజుకో అంశం ఇచ్చి, సాయంకాలంలోగా కథ రాసి పంపాలని కోరినప్పుడు, వీరు ముప్పయ్ రోజుల్లో ముప్పయ్ కథలు రాసారు. విశ్వనాథ సత్యనారాయణగారి "వేయిపడగలు" పుస్తకాన్ని మరో ఇద్దరు రచయితలతో కలసి ఆంగ్లంలోకి అనువదించారు. ఆంగ్ల సాహిత్యంలోని కొన్ని నవలను, కథలను తెలుగులోకి అనువాదం చేసారు. లెక్కలేనన్ని సాహితి వ్యాసాలు వీరి కలం నుండి జాలువారాయి .

ఇక.. ఉద్యోగపర్వం మాటకోస్తే అది కూడా అనంతమే! ముందు కొద్దికాలం తెలుగు అధ్యాపకుడుగా పనిచేసి, తర్వాత ఆకాశవాణిలో తెలుగు ప్రసంగశాఖ ప్రొడ్యూసర్‌గా చేరి, అంచెలంచెలుగా పదవోన్నతులు సాధించి ఆకాశవాణి పాలసీవిభాగ డైరెక్టర్‌గా దేశంలోని పలుప్రాంతాల్లో పనిచేసారు. తర్వాత దూరదర్శన్‌లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా 2005 సంవత్సరంలో రిటైరయ్యారు. ఆ సమయంలోనే ఐఏఎస్ అభ్యర్థులను ఎంపికచేసే ఇంటర్వ్యూ బోర్డు మెంబరుగా చాలా కాలం వ్యవహరించారు. పదవీ విరమణ అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానంవారి శ్రీ వెంకటేశ్వర రికార్డింగ్ ప్రాజెక్టు సమన్వయకర్తగా, దృశ్య శ్రవణ ప్రాజెక్టు కో-ఆర్డినేటరుగా, భక్తిచానల్ కోఆర్డినేటరుగా పనిచేశారు. సివిల్ సర్వీస్‌కి శిక్షణ ఇచ్చే పలుసంస్థలకే కాకుండా, పలు యూనివర్సిటీలకు కూడా అధ్యాపకుడుగా సేవలందించారు.. ఇప్పటికీ అందిస్తునే ఉన్నారు. అలాగే వీరి రచనల మీద పరిశోధనలు చేసిన పలువురికి డాక్టరేట్‌లు కూడా వచ్చాయి. పలు దేశాలలో సాహితీసదస్సుల్లో పాల్గొన్న శ్రీ పద్మనాభరావుగారికి వచ్చిన బహుమతులు, పురస్కారాలు గురించి చెప్పుకోవాలంటే.. కేంద్ర సాహిత్య అకాడమీవారి 'ఉత్తమ అనువాదక బహుమతి' నుంచి, తెలుగు యూనివర్శిటీ 'సాహితీ పురస్కారం' వరకు ఎన్నో ఆయన్ని వరించాయి. శ్రీ పద్మనాభరావుగారు ఎన్ని రచనలు చేసుంటారో ఊహించడం కష్టం .

ఇన్ని ప్రత్యేకతలున్న శ్రీ అనంత పద్మనాభరావుగారి సతీమణి శ్రీమతి శోభాదేవి కూడా రచయిత్రే. వీరి ఇద్దరు అబ్బాయిలు కూడా పాశ్చాత్యంశాల మీద పుస్తకాలు రాసారు. ఇలా యావత్తు కుటుంబం రచయితలుగా గుర్తింపు పొందడం కూడా మరో ప్రత్యేకత అనే చెప్పాలి.

అనంతమైన జ్ఞానసంపద ఉన్నా సరే, ఇప్పటికీ "నేను విద్యార్థినే" అని నిగర్వంగా విన్నవించుకునే శ్రీ రేవూరి అనంత పద్మనాభరావు గారికి ఇష్టమైన తన కథ "గోరింట పూచింది" అని చెప్పి, ఆ కథను ఈ సంచికలో ప్రత్యేక కథగా ప్రచురించడానికి అనుమతిని ఇచ్చినందులకు వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం!

అసలు సిసలైన సాహితీ సవ్యసాచి శ్రీ రేవూరి అనంత పద్మనాభరావుగారు ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, మరో ఇన్ని సాహితీకుసుమాలను తెలుగు కథాప్రియులకు అందించగలగాలని ఆశిస్తున్నాం.

*కథామంజరి బృందం*

# కథా మార్గదర్శి



## కీ. శే. గొల్లపూడి మారుతీరావు

"మనిషి చెడిపోవడానికి ఎన్నెన్ని అలవాట్లు అవసరమో అన్నీ సాధించాడు మార్కండేయులు.. తన ఇరవయ్యో సంవత్సరానికే! అయితే అతని అదృష్టం ఏమిటంటే.. అది చెడిపోవడమని అతను భావించలేదు, వాళ్ళ నాన్న భావించాడు!" అంటూ తన కథ ఎత్తుగడతోనే పాఠకుడ్ని చదివింప చేయగల సత్తా ఉన్న కథా రచయిత ఆయన!

"దిద్దుబాటు" కథ క్రిందట శతాబ్దం మొదల్లో 1910 లో వచ్చింది. ఇది సర్కారువారు నాటిన మైలురాయి వంటిది. న్యాయంగా చెప్పాలంటే తెలుగు కథ అంతకు ముందు పదేళ్ల క్రిందటే పుట్టింది. 1898–1904 మధ్య ఒక స్త్రీ మొదటి తెలుగు కథ రాసింది. ఆవిడ ఎవరో కాదు.. బండారు అచ్చమాంబ గారు. మొదటి కథ పేరు 'గుణవతగు స్త్రీ' అంటూ 'వందేళ్ల కథకు వందనాలు' అనే నూటపదహారు మంది తెలుగు కథా రచయితల కథల వైభవాన్ని చాటి చెప్పే గ్రంథాన్ని రచించడమే కాకుండా, ఆబాలగోపాలాన్ని ఆ కథలు ఆకట్టుకునేలా కార్యక్రమాన్ని కూడా నడిపి, తెలుగు కథకి 'ఋణం' తీర్చుకున్న మహోన్నతమైన కార్యసాధకుడు ఆయన!

ఆయనెవరో కాదు... ఏ తరం తెలుగువారికైనా పరిచయం చేయనక్కరలేని నటుడు, అనూహ్యమైన జ్ఞానసంపదతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేయగల గొప్ప వక్త, మాట, రాత..లతో తెలుగు, తమిళ, హిందీ, ఆంగ్ల భాషా పండిత పామరులను మెప్పించిన బహుముఖ ప్రతిభాశాలి కీ.శే. గొల్లపూడి మారుతీరావు గారు.

1939 ఏప్రిల్ 14 తేదిన విజయనగరంలో జన్మించిన మారుతీరావుగారి విద్యాభ్యాసం విశాఖపట్నంలో జరిగింది. తర్వాత ఆంధ్రప్రభ దినపత్రికలో ఉపసంపాదకుడిగా ఉద్యోగంలో చేరి, కొంతకాలం పనిచేసిన తర్వాత ఆకాశవాణిలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం వచ్చింది. సుమారుగా తెలుగునాట ఉన్న అన్ని కేంద్రాలలో ఇరవై సంవత్సరాల పైగా పని చేసి, తర్వాత సినిమా అవకాశాలు రావడంతో పదవీవిరమణ చేసి, పూర్తిగా తన సమయాన్ని సినిమా, సాహిత్య రంగాలకే పరిమితం చేసారు.

ఆయన రాసిన మొదటి కథ "ఆశాజీవి" 'రేనాడు' అనే దినపత్రిక లో పడింది. దానికితోడు కాలేజీ రోజుల్నుంచి నాటకాల్లో వేషాలు వేయడం, దర్శకత్వం వహించడం... వంటి అనుభవాలతో నాటక రచనలో కూడా అడుగుపెట్టారు. *పాలు విరిగిపోయాయి, కంచికి వెళ్లని కథ, పొగచెట్టు, అద్దె బతుకు, ఆద్యంతాలయ, కీర్తిశేషుడు, రోమన్ హాలిడే, ఇదం జగత్, జుజుమురా, మా పెద్దనాన్న కుక్క...* మొదలగు వందలాది కథలు, నాటికలు, నవలలు రాసారు. అందులో కళ్ళు నాటిక, *సత్యంగారి ఇల్లు, సాయంకాలమయింది, ఋణం* నవలలు ప్రజాదరణ పొందాయి. "మనం నిజం చెప్పి పది పైసలు సంపాదించాలి, అది నిలుస్తుంది. కాని, పది రూపాయలు వస్తాయని అబద్ధం చెపితే అది నిలవదు." అని ఎప్పుడూ ఆయన అంటుండేవారు. చిన్నయ్య సూరిగారి నీతిచంద్రికలా ఆ మాటలు చాలా మంది జీవితాల్లో చాలా ప్రభావం చూపెట్టాయి.

ఆయన ఆకాశవాణిలో పనిచేస్తున్నప్పుడే, సినిమారంగంలో ప్రవేశించారు. ఆయన ఉదయం ఏ ఐదు గంటలకో లేచి, ఆరు గంటల కల్లా కూర్చుని సినిమా కథలు, స్క్రీన్‌ప్లే లు తొమ్మిది గంటల వరకు రాసుకుని, తర్వాత గబగబా భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళేవారు. సాయంత్రం ఐదు గంటలకు ఆఫీసునుంచి వచ్చి, తిరిగి సినిమా వాళ్ళతో చర్చలకు వెళ్ళి, ఏ రాత్రికో ఇంటికి వచ్చేవారు. ఆయన నమ్ముకున్న ఆ రెండు వృత్తులకు పరిపూర్ణ న్యాయం చేసేవారు.

ఆయన సినిమాల్లోకి వచ్చి, బాగా స్థిరపడినా సరే, ఆయనకి ఆకాశవాణి అంటే వల్లమాలిన అభిమానం ఉండేది. ఆయన మాటల్లో ఎక్కువగా ఆయనక్కడ పని చేస్తున్నప్పటి సంగతులే దొర్లేవి. 'ఆ రోజుల్ని తలుచుకుంటుంటే, పుట్టింటికి వెళ్ళినట్టుంటుంది' అంటూ చాలా సంబరపడేవారు.

మారుతీరావుగారు సినిమారంగంలో బిజీగా ఉంటున్నా, పది నిమిషాలు తీరిక దొరికితే చేతిలో ఉన్న పుస్తకంలో కథలు చదివేవారు. ఒకటా.. రెండా... గడిచిన వందసంవత్సరాల కాలంలో వచ్చిన, వేలాది కథలను చదివారు. వందలాది రచయితలు రాసిన కథలను చదవడమే కాకుండా, ఆయా రచయితల జీవితాలను కూడా పరిశోధించి, ఆయా కథల వెనుక ఉన్న ప్రేరణను కూడా తెలుసుకున్నారు. కొంతమంది రచయితల జీవిత వివరాలు ఎక్కడా దొరకకపోతే, టి.వి.లో స్క్రోలింగులు ద్వారా ఆ రచయితల బంధుమిత్రుల ఆచూకి తెలుసుకుని, వారితో మాట్లాడి, విషయాలు గ్రహించి ఆయా కథలతో పాటు, ఆ వివరాలు అందించారు. విశిష్ట రచయితల కథలనే కాకుండా, అంతగా పేరుప్రఖ్యాతులు లేని రచయితల గొప్పకథలను వెలికి తీసి, తెలుగు కథా సాహిత్యానికి అమృతం అందించిన ఆయన మానసపుత్రికే "వందేళ్ల కథకు వందనాలు". ఆ పుస్తకం రూపుదిద్దడానికి ఆయన చేసిన కృషి.. నిజానికి ఓ ఉద్యమంలా సాగింది. నూట ఇరవై వారాలు ఓ టివి ఛానల్లో ధారావాహికంగా ఆ సాహితీ కార్యక్రమం ప్రసారమైంది. అందులో ఆయన చెప్పిన నూట పదహారు కథలతో అవతరించిన ఆ పుస్తకం, తరతరాలుగా తెలుగు లోగిళ్లలో నిలిచిపోతుంది. ఆ మూడు సంవత్సరాలు ఆయన పడిన శ్రమకి సాక్ష్యం ఆయన ఇల్లే. కాఫీ తాగుతూ, భోజనం చేస్తూ, ఫోను మాట్లాడుతూ, ఇంట్లోవాళ్లతో మాట్లాడుతూ.. మరో చేత్తో పుస్తకం పట్టుకుని ఆ కథలని చదువుతుండేవారు.

"ఆయన డెబ్బైయ్ సంవత్సరాల వయసులో కూడా 'ఋణం' నవల రాయడానికి పడ్డ కష్టం చూస్తే, ఆశ్చర్యం వేస్తుంది. ఆయన రోజూ ఏదో ఒక వ్యాసమో, కథో, సంగతో రాసుకునేందుకు, నేరుగా కంప్యూటర్‌ని నేర్చుకుని అందులోనే టైపు చేసుకునేవారు. ఆయన చుట్టూ పుస్తకాల దొంతరలు ఉండేవి. ఆయన విశాఖపట్నం నుంచి మద్రాసు తరుచు ప్రయాణాలు చేసేటప్పుడు, ఆయన లగేజీలో ఎక్కువగా పుస్తకాలే ఉండేవి. ఏది రాయలన్నా ముందు 'యజ్ఞం' చేసేవారు... అంటే ఓ కథ రాయడానికి వంద కథలు చదివేవారు. అలా ఆ వయసులో.. పది, పన్నెండు సంవత్సరాలు ఆయన వేదాలు, వైద్య శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు నిరంతరం చదువుతూ, కోనసీమ మారుమూల గ్రామాలకి వెళ్ళి, అక్కడ వేదపండితుల ఇళ్ళల్లో ఒకట్రెండు రోజులు బస చేసి, వాళ్లతో గంటలు గంటలు మాట్లాడేవారు. వైజాగ్‌లో ఆయన డాక్టరు మిత్రులతో వైద్య విషయాలు మాట్లాడుతూ, చివరికి ఏవేవో విషయాలు తెలుసుకోవడానికి, ఆ విషయం తెలిసిన మనుషుల ఇళ్లకి.. అంటే సందుగొందుల్లో ఉన్నాసరే, అక్కడికి వెళ్ళి వాళ్లతో మాట్లాడి, ఆయనకి కావలసిన విషయాలని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అంతలో సడన్‌గా ఆయన మిత్రుడు ఒకాయన కాలం చేసారు. "అమ్మో.. మనం ఈ నవల వెంటనే రాయాలి!" అని అనుకుని ఏకాఏకీ నెలరోజుల్లో సూర్యచంద్రులను చూడకుండా రాసిన నవల "ఋణం". దానికి కావలసిన విషయాలను ఆయన ఎలా దాచుకున్నారో, ఎక్కడ రాసుకున్నారో తెలియదు గాని, ఆ నవలకి ఆయన పడ్డ కష్టం, విషయ సంగ్రహణ, చివరికి నెలరోజులు ఇంట్లో కూడా మాటామంతీ లేకుండా ఓ ఋషిలా యజ్ఞం చేసి "ఋణం" సృష్టించారు. అలా ఆయన ఏ రచన చేయడానికైనా కష్టపడిన తీరు గమనిస్తే, రచయితలందరికి మార్గదర్శకమే అవుతుంది.

ఇక ఆయన ఇతర రచనలు, వ్యాసాంగాలు, ప్రసంగాలు, అవార్డులు, రివార్డుల గురించి రాస్తే అదో నవల అవుతుంది.

అలా నిరంతరం మంచి కథో, నవలో అందించాలనే తపనతో కృషిచేస్తూ, 2019 డిసెంబరు 12 తారీఖున కనుమూసారు.

తెలుగు సాహితీజగత్తులో ఓ వినూత్నమైన ధ్రువతారగా వెలిగిన కీర్తిశేషులు గొల్లపూడి మారుతీరావుగారికి నివాళులు అర్పించుకుంటూ.. 'ఋణం' తీర్చుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# డామిట్, కథ అడ్డం తిరిగింది!

వసుంధర

శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ ✱ శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022 ✱
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ




విద్యాలయాల్లోనూ, కార్యాలయాల్లోనూ సత్ప్రవర్తనకు సర్టిఫికెట్లు ఇస్తారు. అదో రొటీన్ కాబట్టి దానికి పెద్ద విలువుండదు. జనం కూడా దాన్ని అంతగా పట్టించుకోరు. అదే జైలుకెళ్లి సత్ప్రవర్తన సర్టిఫికెట్ తెచ్చుకుంటే– అదో పెద్ద న్యూస్. దానికెంత విలువంటే– నారాయుడు ఆ సర్టిఫికెట్ కోసం నేరమైనా చేసి జైలుకెళ్లాలని అనుకున్నాడు.

అలాగని నారాయుడికి నేరాలు కొత్త కాదు. ఇంకా చెప్పాలంటే– నేరం అతడి వృత్తీ, ప్రవృత్తీ కూడా. కొందరతణ్ణి నేరాయుడని కూడా అంటారు. నారాయుడో గూండా. అతడికి పెద్ద తలకాయలు అండ. పైకి అనడు కానీ నారాయుడు తనే వాళ్లకి అండ అనుకుంటాడు. ఆ అనుకోవడం, ఎన్నికల్లో పోటీ చెయ్యాలనుకునే దాకా వెళ్లింది.

అతడికి అండగా ఉన్న పెద్ద తలకాయల్లో వరదరాజు ఒకడు. ఆయన దగ్గర నారాయుడికి చనువెక్కువ. "నన్ను ఎమ్మెల్యేని చెయ్యండి. మీకు మరింత కలిసొస్తాను" అని అతడాయనకు చెప్పాడు.

"సరే, కొన్నాళ్లు కాస్త బుద్ధిగా ఉండి మంచి పన్లు చెయ్యి. ఎన్నికలొచ్చే సమయానికి నామినేషన్ చాన్సు వచ్చేలా చూస్తాను" అన్నాడు వరదరాజు.

ఇది పంతులుకి తెలిసింది. ఆయన మరో పెద్ద తలకాయ. ఆయనకీ వరదరాజుకీ ఒకరంటే ఒకరికి పడదు. రాజులు యుద్ధం చేస్తారు. వాళ్లకేం కాదు. చచ్చేది వాళ్ల సైనికులు. యుద్ధమయ్యేక రాజులు పరస్పరం బంధుత్వాలు కూడా కలుపుకుంటారు.

నారాయుడు వరదరాజు మనిషి కాబట్టి – అతడి రాజకీయావకాశాన్ని దెబ్బతియ్యాలని అనుకున్నాడు పంతులు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా – పంతులు అతణ్ణి ఓ కేసులో ఇరికించి జైలుకెళ్లేలా చేశాడు. వరదరాజు ఊరుకుంటాడా – జైల్లో నారాయుడికి ఫైవ్‌స్టార్ ఏర్పాట్లు చేయించాడు. "బయటెంత మంచిగా ఉన్నా జనాలు నీ గతాన్ని మర్చిపోరు. జైల్లో మహా బుద్ధిగా ఉండి, సత్ప్రవర్తన సర్టిఫికెట్టుతో శిక్ష తగ్గించుకుని తొందరగా బయటకు రా. ఎన్నికల టైముకి నీకు నామినేషను గ్యారంటీ" అని ఆయన నారాయుడికి ధైర్యం చెప్పాడు. పంతులు ఊరుకుంటాడా — నారాయుణ్ణి రెచ్చగొట్టమని జైల్లో ఖైదీల్లో తన మనుషులకి చెప్పాడు.

నారాయుడు రెచ్చిపోయాడు. కానీ కథ అడ్డం తిరిగింది.

ఆ కథ విమలతో మొదలైంది.

★★★

"అనాథవి. పుట్టుకే చరిత్రహీనం. ఇంకా నీకు చరిత్రేమిటి?" అన్నాడు శ్యామల్రావు.

ఎదురుగా విమల. శ్యామల్రావు ఆమె బాస్. వివాహితుడు. ఇద్దరు పిల్లలు. ఆడవాళ్లని వేధిస్తాడని పేరు. విమలకైతే స్వానుభవం. ఈరోజది పరాకాష్ఠ కొచ్చింది.

అతడి చరిత్ర ఆమెకి తెలుసు. కానీ తన చరిత్ర గురించి మాట్లాడితే కిమ్మనకుండా వినాలి. గత్యంతరం లేదు. ఆమె చెవుల్లోని బాధ కంటి దాకా వెళ్లింది. ఆమె కళ్లలో తడి. అతడికి కనుల భాష తెలియదు కానీ, మౌనాన్ని అర్థం చేసుకోగలడు. "మౌనం అర్ధాంగీకారమని తెలుసు. కానీ నేను మాటల్లో నీ పూర్తి అంగీకారాన్ని వినాలి. రెండ్రోజులు ఆఫీసుకి సెలవు. ఆలోచించుకో. నీ భవిష్యత్తు నీ నిర్ణయం మీదే ఆధారపడింది" అన్నాడతడు.

అసహాయులకు నిర్ణయాధికారం ఉంటుందా? .. ఐనా ఆమెలో ఏదో ఆశ, ఈ రెండ్రోజుల్లో అద్భుతమేదైనా జరగదా అని!

ఆమె ఆశ వృథా పోలేదు.

ఈ సమాజంలో నేరస్థులందరికీ– సాటి నేరస్థుల గురించీ, సమకాలీనంగా జరుగుతున్న నేరాల గురించీ పూర్తి అవగాహన ఉంటుంది. ఆ అవగాహనే నారాయుడికి విమల కథని తెలియజేసింది. విమల ఆఫీసునుంచి బయటికొస్తే, నారాయుడక్కడ ఆమెకోసం ఎదురు చూస్తున్నాడు. చూస్తూనే చిరునవ్వుతో, "నువ్వు విమల కదూ! నేను నారాయుడు. నీ జీవితాన్ని మార్చేసే అద్భుతమొకటి చెప్పాలి. టీ తాగుతూ మాట్లాడుకుందామా?" అన్నాడు.

అతడెవరో ఆమెకి తెలియదు. కానీ, అద్భుతం అన్న మాటకు వివశురాలైంది.

ఇద్దరూ హొటలుకెళ్లారు. ఓ క్యాబికిల్లో ఎదురెదురుగా కూర్చున్నారు.

నారాయుడు నెమ్మదిగా, "డొంక తిరుగుడెందుకూ, సూటిగా మేటరు కొస్తా. ఇప్పుడు మనిద్దరం నీ హాస్టలు కెడదాం. మీ వార్డెన్ రమాప్రభ నాకు తెలుసు. ఆమె అనుమతితో ఇద్దరం నీ రూం కెడదాం. కంగారుపడకు. చాలా మర్యాదస్థుణ్ణి. ఉన్నంతసేపూ కనీసం ఆరడుగుల దూరం పాటిస్తాను. రాత్రి తొమ్మిదికి నీ రూంమేట్ చంద్రవంక వచ్చే టైం కదా! నేనున్నట్లు తెలియక నిర్భయంగా లోపలకొస్తుంది. వెంటనే మత్తుమందిచ్చి, గుట్టుచప్పుడు కాకుండా అక్కణ్ణించి తీసుకుపోతాను. ఈ కిడ్నాపులో నీ పేరెక్కడా బయటకు రాదు. నీకు ఊహించనంత డబ్బిస్తాను" అన్నాడు నారాయుడు తాపీగా.

వణికిపోతూ వింది విమల. తేరుకున్నాక, "ఏంచేస్తావ్ చంద్రవంకని?" అంది.

"నేనేం చెయ్యను. ప్రకాష్ గెస్టుహౌసులో వదిలేస్తాను. ఆ తర్వాత ప్రకాష్ ఇష్టం!" అన్నాడు నారాయుడు.

ప్రకాష్ పేరు తెలుసామెకి. అసభ్యంగా ప్రవర్తించాడని చంద్రవంక అతణ్ణి నడిబజార్లో చెప్పుతో కొట్టింది. అప్పుడామెకి తెలియదు–

అతడిది పెద్దల ధనాధికారాలతో మదమెక్కిన మధాంధమని. తెలిసేసరికి చేతులు కాలిపోయాయి. ఏదో జరుగుతుందని భయపడుతోంది. ఇప్పుడు నారాయుడొచ్చాడు.

"చంద్రవంక రూంమేటే కాదు. స్నేహితురాలూనూ. ఈ విషయంలో నీకు సహకరించను. అయినా ఈరోజు తనకయింది, రేపు నాకు జరగొచ్చు!" అంది విమల.

"ఇప్పుడు నాకు సహకరిస్తే, ఇకనుంచి నా రక్షణలో ఉంటావు. రేపే కాదు, ఏ రోజూ నీ జోలికెవ్వరూ రారు, రాలేరు!"

ఉలిక్కిపడింది విమల. తనకి రెండ్రోజులు గడువిచ్చిన శ్యామ్రావు గుర్తుకొచ్చాడు. ఈ రోజుల్లో తనలాంటి ఆడపిల్లకి ఒక్క శ్యామ్రావేనా, అలాంటివారెందరో! తనకితడి రక్షణ అవసరమే మరి!

స్వార్థంకోసం దేశాన్నేలే నేతలే గూండాలతో జత కడ్తున్నారు. తను కడితే తప్పేంటి?

"కిడ్నాప్ ఓకే. చంద్రవంకకి అన్యాయం జరక్కూడదు!" అంది విమల.. అతడి దానవత్వానికి కాస్త మానవత్వాన్ని జోడించే ప్రయత్నంలో.

"నాది గరుత్మంతుడి రూటు. ఆయన పాములకి అమృతాన్ని ఇచ్చినట్లే ఇచ్చి, తిరిగి దేవతలకు అందేలా చేశాడు. చంద్రవంకని ప్రకాష్‌కి అప్పగించడమే నా వంతు. నువ్వు కావాలంటే పోలీసులకి ఫోన్ చేసి ఉప్పందించొచ్చు!"

అలాగే జరిగింది. చంద్రవంక కిడ్నాపయింది. సమయానికి పోలీసులామెని కాపాడేరు. ప్రకాష్ పేరు కానీ, నారాయుడి పేరు కానీ చంద్రవంక నోట రాలేదు. పోలీసు రిపోర్టులో లేదు.

సోమవారం ఆఫీసులో శ్యామ్రావు.. విమలను తన చాంబర్లోకి పిలిచి సారీ చెప్పాడు.

ఇంకేం, విమల నారాయుణ్ణి ప్రేమించేసింది.

ఆ ప్రేమ నారాయుడిలో పాపాలు కడిగేసుకోవాలన్న ఆలోచన తెచ్చింది.

★★★

"నారాయుడొచ్చాడండి!" అన్నాడు సెక్రటరీ.

"వచ్చేడా, తీసుకొచ్చేవా?" అడిగాడు కంట్రాక్టరు వరదరాజు. ఆయన ముత్యాలముగ్గు సినిమాలో రావు గోపాలరావుకి డైలాగుల్లో పెద్ద ఫాన్.

వచ్చేడంటే నారాయుడు తన పనిమీదొచ్చినట్లు. తీసుకురావడమంటే వదరాజు తన పనిమీద పిల్చినట్లు.

"తనే వచ్చాడండి, జైలుకెడతాట్ట. తమ చెవినో మాట పడేసి పోదామనొచ్చాడు!" అన్నాడు సెక్రటరీ.

"వీడొకడు, రిలాక్సవాలనుకున్నప్పుడల్లా జైలు జైలంటాడు!" అని గొణుక్కుని, "రమ్మను" అన్నాడు.

సెక్రటరీ కదిలేలోగానే, నారాయుడొచ్చేశాడు. "పెర్మిషనడగడం నాకూ, ఇవ్వడం మీకూ వాలాయితీ. ఎదురుచూడ్డం మన ఆనవాయితీ కాదు!" అని నవ్వేశాడు.

"అవున్లే, నా దగ్గర ఈ చనువు వనజారాణి క్కూడా లేదు కానీ, ఇంతకీ ఇప్పుడు జైలుకెందుకూ, అది చెప్పు!" అన్నాడు వరదరాజు. వనజారాణి ఆయనకి సెకండు సెటప్పన్న విషయాన్ని భార్య దగ్గర కూడా దాచడాయన. ఎటొచ్చీ ఆ మాట ఆయనే అనాలి. వనజారాణి కూడా అనకూడదు. అదీ నియమం.

“చంద్రవంక కిడ్నాప్ కేసులో నాకు వ్యతిరేకంగా ఒక్క ఆధారం దొరకలేదు పోలీసులకి. పంతులుగారి మనుషులు మాత్రం నన్ను దోషిగా నిర్ధారించి, మీడియాలో ప్రచారం మొదలెట్టారు. కొందరైనా నమ్ముతున్నట్లే ఉంది. దోషిని కానని నిరూపించుకుందుకు, నేనోసారి జైలుకెళ్లి రావాలండి!” అన్నాడు నారాయుడు.

వరదరాజు కోసం పంతులి పేరు ప్రస్తావించాడు కానీ, జైలుకెళ్లాలన్నది ఇప్పుడు నారాయుడి కోరిక కూడా. కారణం, విమల ప్రేమ!

చేసిన పాపం చెబితే పోతుందంటారు కదా అని నారాయుడు, తను చేసిన పాపాలన్నీ విమలకి చెప్పేశాడు. దానికామె, “ఇవి నీ నోటితో చెప్పాలా? జనాలకివి బహిరంగ రహస్యం. భయపెట్టే ఉద్దేశ్యముండాలి కానీ, చీమకి కూడా భయపడతారు మన జనం. పబ్లిగ్గా అనరంతే! నీ పాపాల్ని కడిగేది ఆ గంగమ్మే! నీవరకూ జైలే గంగమ్మ!” అంది.

విమల..నారాయుడు ప్రేమకథ వరదరాజుకి తెలియదు. అందుకే, “నీతో కొన్ని అర్జంటు పన్లున్నాయ్. ఇప్పుడెళ్లి జైల్లో కూర్చుంటానంటే ఎలా?” అని నసిగాడు.

“పన్లుంటే వేరే ఏర్పాటు చేస్తాకానీ, జైలుకిప్పుడే వెళ్లాలండి. రెండేళ్లలో ఎన్నికలొస్తున్నాయ్! ఈసారి నామినేషన్ వేద్దామనుకుంటున్నా. అప్పటికి జైలుకెళ్లడం, బయటికి రావడం.. రెండూ ఐపోవాలి!” అన్నాడు నారాయుడు.

“ఎన్నికల్లో నిలబడతావా? ఏ పార్టీ ఇస్తుందయ్యా నీకు టికెట్టు?” నవ్వేశాడు వరదరాజు.

“ప్రోబ్లెం టికెట్టు కానేకాదండి. క్యూలో నాలుగు పెద్ద పార్టీలున్నాయండి. ఎవరు మంచి పదవి ఆఫరిస్తే, ఆ పార్టీలో చేరతానండి!” అన్నాడు నారాయుడు.

“ఆర్నీ, నీ కన్ను పదవి మీద పడిందన్నమాట! మంచిదే.. నీకు పదవొస్తే, బయటుండి చక్రం తిప్పాలనుకునే నాలాంటోళ్లకి మరింత లాభం. అది సరేకానీ, పాయింటుకొచ్చేస్తా.. సిన్నోడు లేడూ, వాడీమధ్య మా పాపకి పెద్ద న్యూసెన్సుగా తయారయ్యాడు. ఏంచేస్తావో నీ ఇష్టం. వాణ్ణి సీన్లోంచి తప్పించాలి!” అన్నాడు వరదరాజు.

“సిన్నోడా, ఆ బచ్చాగాడా? వాడికి మనింటి మనిషి మీద కన్నేసేటంత ధైర్యమా? నమ్మలేను.....” అన్నాడు నారాయుడు ఆశ్చర్యంగా.

“అది వాడికి పుట్టిన బుద్ధి కాదులే! ఆ పంతుల్లేడూ.. ఆ మధ్య ఆయనకొచ్చే పెద్ద కంట్రాక్టొకటి నేను కొట్టేశాన్లే. అప్పట్నించీ నాకు చిరాకు తెచ్చే పన్లు మొదలెట్టాడు. వాటిలో ఇదొకటి! సిన్నోడు ఆయన మనిషి. నువ్వా సిన్నోణ్ణి ఏసేసావనుకో. మిగతావాళ్లకి తారెత్తిపోతుంది. అదీ సంగతి!”

నారాయుడు సాలోచనగా, “నామినేషనేద్దామనుకుంటున్నా. మర్డర్లెందుకులెండి. ఏదో ఒకటి చేస్తాగా, ఈలోగా మీరు నాకు జైలేర్పాట్లు చూడండి!” అన్నాడు.

ఆ ఏర్పాట్లు పంతులు చేస్తున్నాడని అప్పుడతడికి తెలియదు.

★★★

సిన్నోడి విషయంలోనూ రిస్కు లేకుండా గరుత్మంతుడి రూటే అనుసరించాడు నారాయుడు. ఆ ప్రకారం విమల సిన్నోణ్ణి ట్రాప్ చేసి ఓ చోటకి రప్పించింది. నారాయుడక్కడ సిన్నోణ్ణి చావబాదాడు. ఐతే ఆ సమయంలో అక్కడికి పంతులు మనిషొకడొచ్చి తనూ సిన్నోడి మీద దాడిచేసి బాగా గాయపరచి పారిపోయాడు. అంతలో ఊహించని విధంగా పోలీసులొచ్చారు. ఈ వ్యవహారంలో విమల ఇరుక్కోకూడదనుకుని నారాయుడామెను పారిపొమ్మని తను పోలీసులకి దొరికిపోయాడు.

పోలీసులు నారాయుణ్ణి అరెస్టు చేసి, సిన్నోణ్ణి హాస్పిటలుకి పంపారు.

హత్యాప్రయత్న నేరంమీద కోర్టులో నారాయుడికి ఏడాది జైలుశిక్ష పడింది. ఒకలా అనుకుంటే, మరొకలా జైలు కెళ్లాల్సొచ్చింది నారాయుడికి.

ఎప్పటిలాగే జైల్లో అతడికి వీఐపీ ట్రీట్మెంటు. స్వర్గంలో ఉన్నట్లే ఉంది. వరదరాజు చెప్పినట్లే సత్ప్రవర్తనతో జైలు అధికారుల్ని మెప్పిస్తున్నాడు. కానీ తోటి ఖైదీల్లో ఉన్న పంతులి మనుషులు అతణ్ణి రెచ్చగొడుతుంటే రెచ్చిపోయి, వాళ్లని చావగొడుతున్నాడు.

అతణ్ణదుపు చెయ్యలేక, మిగతా ఖైదీల్ని ఎలా రక్షించాలో తెలియక.. జైలు అధికార్లు తలలు బాదుకుంటున్నారు.

ఈలోగా వరదరాజు తన ప్రయత్నాలు చేస్తున్నాడు.

అలా విమల రంగంలోకి దిగింది.

నారాయుడు మంచిమనిషనీ, తనని అత్యాచారం నుంచి కాపాడ్డానికే సిన్నోణ్ణి ఎదుర్కున్నాడనీ, ఆడపిల్లగా అపవాదుకి భయపడి ఇన్నాళ్లూ అజ్ఞాతంగా ఉన్నాననీ పోలీసులకి వాఙ్మూలమిచ్చింది.

కేసు మళ్లీ కోర్టుకొచ్చింది. పంతులు నియమించిన లాయరు, విమల వాఙ్మూలం నమ్మతగింది కాదన్నాడు. నారాయుడి వ్యక్తిత్వం గురించి జైలు అధికారుల అభిప్రాయం కూడా సేకరించాలని నొక్కించాడు. న్యాయమూర్తి ఆ లాయరుతో ఏకీభవించి, ఆ మేరకు జైలుకి లేఖ వ్రాశాడు..

ఇక్కడే పంతులి లెక్కలు తప్పాయి.

ఎందుకంటే జైల్లో ఉన్న నారాయుడు వరగర్వితుడైన రాక్షసుడిలా, అక్కడి ఖైదీల్ని వేధిస్తున్నాడు.

ఆ ఖైదీలు దేవతలు కాకపోయినా, వాళ్లని రక్షించాల్సిన బాధ్యత జైలు అధికారులది. కానీ నారాయుణ్ణి అదుపు చేసే శక్తి వాళ్లకి లేదు. అతణ్ణి వదుల్చుకోవడమెలా అని ఎదురు చూస్తున్న సమయంలో, కోర్టు నుంచి అందిన లేఖ వారికి గొప్ప అవకాశాన్నిచ్చింది.

“నారాయుడిలాంటి ఉత్తముడు జైలుకెలా వచ్చాడా అని ఆశ్చర్యంగా ఉంది. అతడి తీరు సత్ప్రవర్తనకు నిర్వచనం. అతడికి శిక్ష రద్దు చేసి వెంటనే విడుదల చెయ్యాలని జైలు అధికారులూ, తోటి ఖైదీలూ కూడా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు!” అని జైలు అధికారులు న్యాయస్థానానికి బదులిచ్చారు.

సత్ప్రవర్తనకు తిరుగులేని కొత్త నిర్వచనమిస్తూ, నారాయుడి సత్ప్రవర్తనకి తిరుగులేని సర్టిఫికెట్టొచ్చింది.

నారాయుడు జైలునుంచి బయటికొచ్చాడు.

“డామిట్, కథ అడ్డం తిరిగింది” ఈ మాటనుకుంటున్నది మీరనుకుంటున్నవాళ్లెవ్వరూ కాదు.. తిప్పిందీ, తిప్పుతున్నదీ మనమే అని తెలిసి కూడా, ప్రతి ఎన్నికల తర్వాతా అలాగనుకునే .. మనమే!

# గరీబీ(బ్) హటావో

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ * శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

ద్విభాష్యం రాజేశ్వరరావు



'పేదరికం రూపుమాపటం ఎలా?' ఎలా అనే విషయం మీద మంత్రిగారు ఓ అరగంట సేపు ఉపన్యాసం ఇచ్చారు. ఆఖరుగా ఆయన 'పేదరికం నిర్మూలన నిమిత్తం ఒక ప్రణాళిక రచించి దాన్ని అమలు చేయడానికి ఒక కమిటీని వేస్తామని, అందులో కనీసం ఒక పేదవాణ్ణి కూడా సభ్యునిగా నియమిస్తే వాళ్ళ సమస్య లోతు తెలుస్తుందని, అపుడు ప్రణాళిక విజయవంతం అవుతుందని' సెలవిచ్చారు. చప్పట్లతో సభ ముగిసింది.

ఆయన మీటింగ్ విశేషాల గురించి వార్త రాస్తున్న నన్ను పిలిచి, "మీరు వెళ్ళి తెలివైన పేదవాడిని ఎవర్నో ఒకరిని చూసి తీసుకురండి, కమిటీలో మెంబర్‌గా వేద్దాం." అంటూ కమిటీ మెంబర్‌ని వెతికే పని నాకు అప్పజెప్పారు.

అయితే నాకు 'సరియైన పేదవాడిని ఎలా గుర్తించటం?' అనే అనుమానం పట్టుకుంది. 'ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ హస్తం ఉంటుంది.' అనే నానుడి ఉంది కనుక, పేదవాణ్ణి గుర్తించే విషయంలో విజయం కోసం మా ఆవిణ్ణి సలహా అడిగాను. "మన ఇంట్లో పనిచేసే రంగమ్మ నిత్యమూ వెయ్యిరూపాయల చీరలే, కట్టిన చీర కట్టకుండా కడుతుంది! కానీ ఎప్పుడు చూసినా 'మా పేదోళ్ల బతుకులు ఇంతేనమ్మా' అంటూ ఏడుపుమొహం పెడుతూనే ఉంటుంది! అందుకని మీరు మన రంగమ్మా వాళ్ళూ నివసించే ఊరి చివర మురికివాడకు వెళ్ళండి. అక్కడ మీకు పేదవాళ్ళు ఎవరైనా దొరికే అవకాశం ఉంటుంది!" అంటూ సలహా ఇచ్చింది. ఆ సలహా మేరకు ఊరి చివర ఉండే మురికివాడకు వెళ్ళి, ఇంటింటా సర్వే చేయడం ప్రారంభించాను.

"మాకు అందరికీ తెల్లకార్డులు ఉన్నాయి. వాటితో రేషన్‌షాపుల్లో నెలకోసారి పాతిక రూపాయిలకు పాతిక కేజీల బియ్యం ఇస్తారు. అందుకని మాకు తినడానికి తిండి ఉంది. మా పిల్లలకు స్కూల్లో కోడిగుడ్డుతో భోజనం పెడతారు. స్కూల్ ఫీజులు కట్టనక్కరలేదు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నారు....."

"ఆడపిల్లలకి స్కూల్‌కి వెళ్లడానికి సైకిళ్ళు ఇస్తున్నారు......"

"పెళ్లిచేసుకుంటే మంగళ సూత్రాలు ఇస్తున్నారు...."

"రోగాలు వస్తే ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందటానికి ఓ కార్డు ఇస్తున్నారు...."

"అయితే 'ఇవన్నీ ఉద్దరిగా వస్తూ వుంటే ఇంక మేము ఎందుకు పని చెయ్యాల?' అంటూ మా మొగుళ్ళు తెగతాగేసి, కాళ్ళు నిగడదన్నేసి, ఇంట్లోనే తొంగుండిపోతున్నారు! అలా తెగ తాగేసిన కొంత మంది ఆ మత్తులోనే గుడ్లు తేలేస్తున్నారు!!... అలాంటి వోళ్ళ పెళ్ళాలకు వితంతు పెన్షన్ ఇస్తున్నారు..."

"ఇంకా అనేక పథకాల ద్వారా ప్రభుత్వం నుండి బోలెడంత సహాయం మాకు అందుతోంది. అందువలన మేం ఎవరం పేదవాళ్ల కింద లెక్కకి రాం" అన్నారు, వాళ్ళందరూ ముక్తకంఠంతో. నేను వాళ్ళని పేదవాళ్ళుగా జమకట్టి, వాళ్ళతో ఆ ధోరణి లో మాట్లాడినందులకు కొంతమందికి కోపం కూడా వచ్చినట్టుంది, నావంక చిరాగ్గా కూడా చూశారు!

నాకేం చెయ్యాలో పాలు పోలేదు! అక్కడ నుండి తిన్నగా రైల్వేస్టేషన్ వైపుకి నడిచాను. దారిలో ఓవర్‌బ్రిడ్జి కింద చాలా మంది ముష్టివాళ్ళు కూర్చుని ఉన్నారు. వాళ్ళని చూడగానే 'ఇంతకంటే పేదలు ఇంకెక్కడ దొరుకుతారు!' అనుకుంటూ వారి వైపు హుషారుగా నడిచాను.

వెడల్పాటి 'ఓవర్ బ్రిడ్జి' స్తంభానికి నడుం ఆన్చి విలాసంగా కూర్చొని, తాపీగా బీడీ కాలుస్తున్న ఒక ముసలి గడ్డపాయన్ని పలకరించి, "మీకు రెండు పూటలా తిండి దొరుకుతుందా?" అని అడిగాను.

"అలా గేరెంటీ లేదు. ఎవరైనా ధర్మం చేస్తే ఆడబ్బుతో తింటాను. లేదా పస్తుంటాను. కొంచెం డబ్బులు మిగిల్తే బీడీకట్ట కొంటాను. ఇంకా కొంచెం ఎక్కువ డబ్బు మిగిలితే ఓ క్వార్టర్ మందు కొడతాను." అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు.

ఎందుకైనా మంచిదని, "పెద్దాయనా.. మీరు పేదల కిందే లెక్క వస్తారా?" అంటూ అడిగాను. అది ఎంత తెలివి తక్కువ ప్రశ్నో నాకు తెలిసినా, అడగక తప్పలేదు! ఎందుకంటే మురికివాడల వాళ్ళు నామీద కోపం ప్రదర్శించడం గుర్తుకొచ్చింది!

"మాలాంటివాళ్ళు పేదల్లోకి లెక్క రాకపోతే, మరెవరు వస్తారు?....కార్పొరేషన్ ఛైర్మన్‌లు, కార్పొరేట్ యజమానులు వస్తారా?... వాట్ డు యు థింక్..." అంటూ కాస్త గట్టిగానే ఆగ్రహం ప్రదర్శించాడు ఆయన నామీద!!

'అమ్మయ్య! ఈ ముసలాడికి ఇంగ్లీషు వచ్చినట్లు కనిపిస్తోంది! దానికి తోడు కొంచెం ప్రపంచ జ్ఞానం కూడా ఉంది. ఇలాంటి పేదవాణ్ణి కమిటీలో వేసుకుంటే మంచిది' అనుకుంటూ సంతోషంగా అతనితో మాటలు కలిపాను.

"మీ పేరేమిటీ?"

"కుబేరమూర్తి."

"మూర్తి గారూ! నేనో పత్రికా విలేకరిని. మన మంత్రిగారు ఎలాగైనా రాష్ట్రం నుంచి పేదరికాన్ని పారద్రోలాలని నిశ్చయించుకున్నారు! పేదరికం గురించి విస్తృతంగా అధ్యయనం చేసి దాన్ని నిర్మూలించడానికి తగిన సలహాలు ఇవ్వడానికి ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నారు. ఆ కమిటీలో మీరు మెంబర్‌గా ఉండగలరా?" అంటూ అడిగాను.

ఫక్కుమంటూ నవ్వేశాడు ఆ గెడ్డపాయన! "మన చుట్టూ సమాజంలో ఉండే ఈ పరిస్థితులు మారనంత సేపూ, ఈ రాష్ట్రం నుండి కానీ, ఈ దేశం నుండి కానీ పేదరికం ఎక్కడికీ పోదు! అదే అంత సులువయితే ఈపాటికి నేను నా పేదరికాన్ని హాయిగా వదిలించేసుకుని, బోలెడు డబ్బు సంపాదించేసి, ఆనందంగా మందు కొడుతూ 'డిక్కీ డిక్కీ బార్' లోనే కాలు మీద కాలేసుకుని కూర్చుని ఉందును!.... ఇలా ఈ ఓవర్ బ్రిడ్జి కింద పడి ఎందుకు ఏడుస్తాను?" అన్నాడు గెడ్డం సుతారంగా నిమురుకుంటూ.

"మీరు చెప్పేది సమంజసంగానే ఉంది కానీ ఏ పరిస్థితినైనా మెరుగు పరచాలంటే లేదా మార్చాలంటే, ప్రయత్నం అంటూ మొదలు పెట్టాలి కదా! అందుకని, మీరు ఒప్పుకుంటే ఆ కమిటీలో మిమ్మల్ని ఒక మెంబర్‌గా వేద్దామని అనుకుంటున్నాను!" అన్నాను కాస్త బతిమిలాడే ధోరణిలో.

ముసలాయన కొంతసేపు ఆలోచించి, "ఓకే! ఆ కమిటీలో ఉన్నందుకు నాకు మీరు ప్రతి నెలా జీతం ఇవ్వాలి. ముందుగా ఒక నెల జీతం అడ్వాన్స్‌గా కూడా ఇవ్వాలి. అలా అయితేనే కమిటీలో ఉంటాను!" అన్నాడు.

"తప్పకుండా! మంత్రిగారితో చెప్పి మీకు నెలనెలా జీతం ఇప్పించే ఏర్పాటు చేస్తాను. కానీ అడ్వాన్స్ జీతమంటే మాత్రం గవర్నమెంట్‌లో కుదరదు!" అన్నాను.

"ప్రభుత్వ ఉద్యోగస్తుణ్ణి అయిన తర్వాత కూడా కొంచెం అయినా హోదా నిలబెట్టుకోకుండా, ఇలా ఓవర్ బ్రిడ్జి కింద ఈ ముష్టివాళ్ళతో కలిసి బతకమంటారా? ఓ నెలజీతం అడ్వాన్స్‌గా ఇస్తే, ఓ గది అద్దెకు తీసుకుని నాకున్న కొద్ది పాటి సామాను అందులోకి మార్చుకుంటాను. ప్రభుత్వంలో పని చేస్తూ, ఇలా ఓవర్ బ్రిడ్జి కింద ఎండకు ఎండుతూ, వానకూ తడుస్తూ బతుకు ఈడుస్తూ ఉంటే, అది నాకు కాదు, ప్రభుత్వానికి తలవంపులు!" అన్నాడు గంభీరంగా మొహం పెట్టి.

"మీరు ఇక్కడి నుంచి వేరే చోటుకి మారిపోతే, ఈ పేద వాళ్ళతో మీ సంబంధం తెగిపోతుంది కదా! అలా అయితే వీళ్ళ కష్టాలు, సమస్యలు మీకు తెలిసే అవకాశం పోతుంది కదా!" అన్నాను.

"అవకాశం ఎక్కడికీ పోదు! ఎందుకంటే, మన సమాజంలోని నిజమైన పేదరికం ఇక్కడ లేదు!! ఇక్కడ ఉన్న ఈ ముష్టివారిలో నాలాంటి చరిత్రహీనులు ఒకరిద్దరు తప్ప, మిగిలిన వారందరూ వికలాంగులు! జబ్బు మనుషులు! ఇంకా రకరకాల మానసిక సమస్యలు ఉన్నవాళ్లు!! కేవలం ఇలాంటి ముష్టివాళ్ళకి చేయూత ఇచ్చినంత మాత్రాన రాష్ట్రంలో పేదరికం సమస్య మాసిపోదు. ఎందుకంటే వీళ్లకు మీరు 'రోల్స్‌రాయిస్' కారు ఇచ్చినా, అందులో తిరుగుతూ కూడా పెట్రోలు కోసం ఆడుక్కుంటారు తప్ప కష్టపడి పనిచేయరు, చేయలేరు! ఉత్పాదకతకు వీళ్ళు ఏ విధంగానూ సాయం అందించలేరు! ఉత్పాదకశక్తి అందించే మనుషుల సహకారం వల్లనే, వారు చేసే ఉత్పత్తి వల్లనే, ఎక్కడైనా, ఏ రాష్ట్రంలోనైనా, ఏ దేశంలోనైనా అయినా పేదరికం రూపు మాపగలం!" మాటలు ఆపి కట్టలోంచి మరో బీడీ తీసి ముట్టించాడాయన.

"మరి, నిజమైన పేదరికం ఎక్కడ ఉందంటారు?" ముసలాయన వాగ్ధోరణకి ఆశ్చర్యపోతూ అడిగాను.

బీడీ దమ్ము గట్టిగా లాగి "ఇక్కడ నుంచి అలా పోస్టాఫీసు వైపు వెళ్తే అక్కడ 'ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్' ఆఫీస్ ఉంది. ఆ ఆఫీస్ గేటు దగ్గర ఇసకేస్తే రాలనంత జనం అన్నివేళలా మీకు కనిపిస్తారు. వాళ్ళు అందరూ చదువుకున్న మధ్యతరగతి లేదా క్రింది మధ్యతరగతి నిరుద్యోగులు! వాళ్లు, వాళ్ళ కుటుంబాలే ఈ రాష్ట్రంలో నిజమైన పేదవాళ్ళు!! ఎమ్మేలు, బిఏలు, బీటెక్‌లు చదువుకున్నవాళ్ళు కూడా 'వాచ్‌మెన్' ఉద్యోగం కోసం ఎగబడటం అక్కడ మీకు కనిపిస్తుంది! ఒక్క ఖాళీ కోసం వెయ్యిమంది ఎగబడే పరిస్థితి ఈవేళ రాష్ట్రంలో ఉంది!! వారికి ఉపాధిమార్గాలు చూపించాలి. అందుకోసం పరిశ్రమలను ఆకర్షించాలి. కొత్త నిర్మాణాలు చేపట్టాలి. వ్యవసాయరంగానికి పూర్తి చేయూతనిచ్చి ఆధునిక సాగుపద్ధతులను ప్రవేశపెట్టి, విద్యావంతులైన యువతను అందులో భాగస్వాములుగా చేయాలి. అలాగే కొత్త రహదారులు నిర్మించటం ద్వారా 'కనెక్టివిటీ' పెరగటంతో బాటు పదిమందికి ఉపాధి దొరుకుతుంది. ఉపాధి కల్పన వల్ల ఉత్పాదకత పెరుగుతుంది. ఉద్యోగాలు వచ్చి, వారికి జీతాలు అందటం వల్ల ప్రభుత్వానికి కూడా పన్నుల రూపంలో కొంత డబ్బు తిరిగి వస్తుంది.

ఇకపోతే, ఉచిత పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను అడుక్కు తినేవాళ్ళుగా చూడటం, అలా తయారుచేయటం ప్రభుత్వానికి న్యాయం కాదు! ఏ పనీ చేయలేని వికలాంగులు, వయోవృద్ధులు, దీర్ఘకాల రోగులు మొదలైన వారికి మినహా మిగిలిన వారందరికీ ఉచిత పథకాలు అన్నీ రద్దు చేయాలి. తద్వారా ప్రభుత్వానికి వాటి మీద వెచ్చించాల్సిన ఆర్థికభారం తగ్గి, కొత్త పరిశ్రమలు నెలకొల్పటం, రవాణాసౌకర్యాలు మెరుగుపరచడం వంటి వాటి మీద పెట్టుబడులు పెట్టే అవకాశం వస్తుంది. ఓటు బేంకు తయారు చేసుకునేందుకు వెదజల్లే ఈ ఉచితాలు రాష్ట్రానికి, దేశానికి కూడా హానికరం! ఎంత హానికరమో ఇప్పటి 'వెనిజులా' దేశ పరిస్థితి చూస్తే తెలుస్తుంది!" ప్రసంగంలా కొనసాగించిన తన మాటలు ఆపి, దీర్ఘంగా ఓ నిట్టూర్పు వదిలేడు ముసలాయన.

కుబేరమూర్తి తెలివితేటలకు నాకు మతిపోతున్నట్లు అనిపించింది.

"అయితే, ఈ నిరుద్యోగులకు ఉపాధికల్పన ద్వారా పేదరికం నిర్మూలించవచ్చునంటారు!" ఎంతో వినమ్రపూర్వకంగా ఆయన వంక చూస్తూ అడిగాను.

"అలాగని పూర్తిగా చెప్పలేం కానీ కొంతవరకు పని సానుకూలం అవుతుంది!" అన్నాడు విలాసంగా నవ్వుతూ.

"ఏం? ఎందుకని?" అంటూ ఆశ్చర్యంతో అడిగాను.

"సమాజంలో పూర్తిగా పేదరికం నిర్మూలింపబడి సుసంపన్నం కావాలంటే, దేశానికి ఆర్థిక పరిపుష్టత చేకూరాలి. బడా కార్పొరేట్ యజమానులు బ్యాంకుల దగ్గర వేలకోట్ల రూపాయలు అప్పులు చేసి, తీర్చకుండా 'దొంగ దివాళాలు' తీసి, బిచాణా ఎత్తేసి, విదేశాలకు పారిపోయి తలదాచుకున్నంత కాలం, ఆ ఆర్థిక పరిపుష్టత సాధ్యం కాదు! అలాంటివారి వలన ఈ దేశ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు పెరిగిపోతూనే ఉంటాయి! దాంతో బేంకులన్నీ ముందు నష్టాల్లో మునిగిపోయి, తర్వాత దివాలా తీసేసి, షట్టర్లు దింపేస్తాయి! ఏదో రోజు 'రిజర్వు బేంకు' కూడా చేతులెత్తేస్తుంది!! తద్వారా ఈ దేశం ఎప్పుడూ పేదరికంలోనే ఉంటుంది!!...." అంటూ మాటలు ఆపి బరువుగా ఊపిరి తీసుకుని "..... అయితే ఈ కార్పొరేట్ యజమానులకు తమ తాహతుకు మించిన అప్పులు ఎలా లభిస్తున్నాయి? రాజకీయ నాయకులతో లాలూచీపడి బ్యాంకు అధికారుల మీద ఒత్తిడి తీసుకురావడం వల్ల!! అందువలన నేను చివరగా చెప్పేదేమిటంటే రాజకీయనాయకులలో అవినీతి పోనంతవరకూ, వారి పెత్తనం బేంకు అధికారుల మీద ఆగనంతవరకూ ఈ దేశంలో పేదరికం పోదు! అవినీతికి, పేదరికానికీ.. ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది!" అన్నాడు గడ్డం నిమురుకుంటూ కుబేరమూర్తి.

అతని వాగ్ధాటికి, విశ్లేషణకు నోరు తెరిచి ఆశ్చర్యంతో అతని వంక చూస్తూ ఉండిపోయాను!

"ఈ బిచ్చగాడికి ఇంత జ్ఞానం ఎలా వచ్చింది?' అని ఆశ్చర్య పోతున్నారు కదూ! నేను పూర్వాశ్రమంలో ఒక సినిమా ప్రొడ్యూసర్‌ని! ఫైనాన్సర్‌ల దగ్గర అప్పు తీసుకుని 'గరిబీ(బ్) హటావో' పిక్చర్ తీశాను. ఆ సినిమాలో రాజకీయనాయకుల అవినీతి మీద బోలెడు వ్యంగ్యమైన విసుర్లు ఉన్నాయి. సెన్సార్‌వాళ్ళు వాటన్నిటినీ కట్‌చేసి తీసేసారు. దాంతో ఆ సినిమా ఆత్మ అందులో నుండి ఎగిరిపోయింది! అతుకుల బొంత మిగిలిపోయింది! ఇక చెప్పేదేముంది? విడుదలైన రెండో రోజున ఫిలిం డబ్బాలు వెనక్కు వచ్చేసాయి! పిక్చర్ ఫ్లాప్ అయిపోయింది! తర్వాత ఫైనాన్సర్‌లు నన్ను ఇలా ఫ్లాప్ చేశారు!!" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ముసలాయనకు పాదాభివందనం చేసి మంత్రిగారి దగ్గరకు పరుగెత్తాను...

'పేదరిక నిర్మూలనకు కుబేరమూర్తితో ఏకసభ్య కమిటీ వేస్తే సరిపోతుందని చెప్పటానికి!!'

*నాకు కథలంటే ఇష్టం.. ఎందుకంటే అవి మన జీవన విధానలే! మన మిత్రులు వారి వారి ఆనందాన్నో, విషాదాన్నో లేదా అన్యాయం మీద వారి అత్రుతనో, ఉక్రోషాన్నో తెలియజేస్తాయి.*

*– ఎండ్రీ డ్యూబస్*

# ఆచూకీ చెబుతారా?

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

బాడిశ హన్మంతరావు



ప్రజలు ఎవరి పనులలో వారున్నారు. ఎవరి గాలి వారు పీలుస్తున్నారు. ఎవరి తిండి వారే తిన్నా, ఎవరి బట్ట వారే కట్టినా, వారి ప్రమేయం లేకుండా వారి బ్రతుకుల మీద ప్రభావం చూపే అంశాలు చాలా ఉంటాయి. ఎక్కడో ఎవరో తీసుకునే నిర్ణయం జీవితాలను అల్లకల్లోలమూ చేయవచ్చు, ప్రపుల్లమూ చేయొచ్చు. ఎటొచ్చీ ఆ 'ఎవరో' తీసుకునే నిర్ణయానికి ఆధారభూతం ఏమిటనేది కోట్ల రూపాయల ప్రశ్న! అది వ్యక్తిగత ప్రయోజనాలకు పెద్దపీట వేసుకొని చేయబడుతుందా? లేదూ.. నిజంగానే ప్రజల ప్రయోజనార్థమే చేయబడుతుందా? అసలు ప్రజల ప్రయోజనమనేది రాజ్యానికి పడుతుందా? అనేది ఎందరు సిద్ధాంతకర్తలు ఎన్ని రకాల సిద్ధాంతాలు ప్రతిపాదించినా ఆ ప్రతిపాదనలు కాగితం రంగు మార్చడం మినహా కర్తల మెదళ్ళలోకి ఇంకుతాయా?

★★★

ఒక ఇరుగు రాజ్యం, ఒక పొరుగు రాజ్యం ఉన్నాయి. ఇరుగు రాజ్యంలో మార్కయ్య ఉన్నాడు. అతను ఒక వ్యక్తి అనుకునేరు, కాదు... కాదు... ఒక సమూహం! అతని కంఠస్వరం ఎంత తీవ్రంగా ఉంటుందంటే రెండు రాజ్యాల మధ్య ఉన్న అరణపు కొండ మీద నిలబడి పొలికేక పెట్టాడంటే, ఆ రాజ్యలలోని పిల్లా మేకా, ముసలీ ముతకా, గొడ్డూ గోదా అన్నింటికీ స్పష్టంగా వినపడుతుంది. ధ్వని తీవ్రతను కొలవగలిగే యంత్రాలు మార్కయ్య కంఠధ్వని ముందు అతి నాజూకైనవాటి కింద లెక్క.

రాజ్యాలుంటే రాజులుంటారు గదా...

రాజులుంటే యుద్ధాలుంటాయి గదా...

యుద్ధాలంటే సైన్యం ఉండాల్సిందే గదా...

అందుకే తాహతుకి తగ్గట్టు ఇద్దరు రాజులు సైన్యాన్ని సమకూర్చుకున్నారు. మరి ఆ సైన్యాన్ని నిర్వహించాలంటే ఖర్చు ఉంటుంది. అందుకోసం ఓ మాత్రపు పన్నులు, సుంకాలు ఉంటాయని చెప్పనక్కరలేదు గదా! కత్తి పై పూసిన తేనెలాంటి 'సైన్యం ఆ రాజ్య ప్రజలను రక్షించడానికే' అన్న విషయమూ జనులకు ఎక్కించారు. ఎంతలా అంటే అది నిజము కాదన్న వారినే అబద్ధం చేసేంత!!

ఇరుగు రాజ్యానికి ఇరవై వేల దాకా, పొరుగు రాజ్యానికి పదివేల దాకా సైన్యం ఉంది. అందులో మళ్ళీ పదాతి దళమనీ, అశ్వదళమనీ, గజదళమనీ... రకాలు కూడా ఉంటాయన్న విషయం ప్రత్యేకంగా చెప్పుకోపనిలేదు.

ఓ రోజు ఇరుగురాజుకో, పొరుగురాజుకో పక్క రాజ్యాన్ని కలుపుకుంటే రాజ్య వైశాల్యం పెరుగుద్ది కదా... అని కలలాంటిది వచ్చింది. కల ఇంత మాత్రమే కాదు.. దాని పర్యవసానాలు కూడా గొలుసుకట్టు కూర్పులాగా వచ్చే ఉంటాయి. కానీ ఆయన రాజు కదా.. అది ఆయన చెబితే మాత్రమే తెలుసుద్ది! ఆయన చెప్పినా చెప్పకపోయినా యుద్ధప్రయత్నాలకు ముందు జరిగే ఆరంభోత్సవాలు మాత్రం జరిగాయి. పొరుగు రాజ్యపు రాజుకి 'ఏం మొండి ధైర్యమో, ఏమో' గానీ, సంధి ప్రయత్నాల్లాంటివి నచ్చక యుద్ధానికి 'సై' అన్నాడు.

ఓ ముహూర్తాన పూజలూ గట్రా చేశారు, జంతు బలులు ఇచ్చారు, వీరులకు హారతులు ఇచ్చారు. 'విజయోస్తు' అని యుద్ధరంగానికి వెళ్లనొల్లని, వందిమాగధులు హారతులు పాడారు. గతంలో రాజ్యం కోసం ప్రాణాలు ఇచ్చిన వీరుల గాథలు కీర్తనలు చేశారు. తమ పూర్వీకులు స్వర్గంలో పొందుతున్న దేవ మర్యాదలు, అప్సరసల నాట్యాలు, భోగాల గురించి కళ్లతో చూసినట్టే.. కళ్లకు కట్టినట్టే.. చెప్పారు. అవి వింటూనే యుద్ధానికి వెళ్లబోతున్న సైనికుల శరీరాలు నిక్కబొడుచుకున్నాయి.

రెట్టించిన ఉత్సాహంతో రెండు రాజ్యాల సైన్యం అరణ కొండకు కుడి పక్కనున్న పెద్ద మైదానంలో యుద్ధానికి సిద్ధమైయారు. ఇద్దరు రాజులూ అంతఃపురాలలో ఆసనాల మీద కూచుని, ముందు మధుపానీయాలు అమర్చుకొని, చదరంగం బల్ల ముందు మేధావులతో ఆటకు కూర్చున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం వచ్చే వార్తాహరులను ఏర్పాటు చేసుకున్నారు. నిజమే గదా... ఎప్పటికప్పుడు వార్తలు తెలియాలి కదా! ఎత్తులు మొదలయ్యాయి.

అనుకున్న ముహూర్తానికి యుద్ధం మొదలయింది. చీకటి పడేదాకా యుద్ధం చేశారు. కాస్త సంఖ్య అటూ ఇటూగా చెరో అయిదువందల మందికి వీరస్వర్గంలో ఆసనాలు దొరికాయి. ఆ రోజుకి యుద్ధానికి విరామం ప్రకటించారు.

ఆ రాత్రి యుద్ధంలో మరణించిన వీరుల కుటుంబాలను పిలిచి, వీరులు యుద్ధంలో చూపిన సాహసాలను కళ్లకు కట్టినట్టుగా చెప్పి, వాళ్ల కళ్ల నీళ్ళు తెప్పించారు. యుద్ధరంగంలో అసువులు బాయడం బొందితో స్వర్గానికి పోవడమే అని ఖచ్చితంగా సప్రమాణంగా నిరూపించారు. కొందరు వీరపత్నులు తమ పిల్లల్లో పెద్దవారిని, పోయినవారి వంతుగా రణరంగానికి పంపడానికి కూడా సిద్ధమైనారు!

తెల్లవారింది. రెండవరోజు యుద్ధానికి ఏర్పాట్లు జరిగాయి. అరణ కొండకు యుద్ధం నిన్న కుడివైపున జరిగింది కదా... ఆ ప్రదేశం అంతా రక్తమయం, శవాల మయం .... అందుకని ఈ రోజు ఎడమవైపున్న మైదానంలో యుద్ధం జరగబోతున్నది.

ఇక మొదలు పెట్టమని రాజుల నుండి, సైన్యాధ్యక్షుల నుండి సూచనలు వచ్చాయి. అందరూ ఆయుధాలు సరిచూసుకున్నారు. ఎవరు ముందు నిలబడాలో ఎవరు వెనుక నిలబడాలో వారి ఆలోచనను బట్టి నిర్ణయించుకున్నారు. ఇక శంఖమో, నగారానో మోగడమే తరువాయి.

ఇంతలో పెద్ద కేక. ఎంత పెద్దగా అంటే ఎవరూ వినకుండా ఉండలేనంత పెద్దది.

అది మార్కయ్య పెట్టిన పొలికేక. అందరూ ఉలిక్కిపడి కేక వినవచ్చినవైపు చూశారు. ఆ చూపులు సూటిగా అరుణకొండపై మార్కయ్య నిలిచిన చోటుకు చేరాయి. కాసేపు ఆగమన్నాడు అందరిని...

"నేను చెప్పింది విన్నాక పోరు మొదలుపెడుదురుగాని...." అన్నాడు మార్కయ్య.

రెండు సైన్యాలు అయోమయంలో పడ్డాయి. కాకపోతే సాయంకాలం ఇంకో రవ్వంత ఎక్కువ సేపు యుద్ధం చేద్దామని, మార్కయ్య మాటలు వినడానికి సిద్ధపడ్డారు.

సమూహం ఎంత పెద్దగా ఉన్నా... ఒక్కడు లేచి నిలబడి గట్టిగా నోరు తెరిస్తే, వాడు చెప్పింది వినడానికి... సమూహాన్ని రెట్టింపు చేసి, అందులో ఒక సగాన్ని తీసివేస్తే ఎంతమంది మిగులుతారో అంతమందీ వినడానికి తయారుగా ఉంటారు.

"సైనికుల్లారా!..." అని కాస్త కుదురుకుని "వీరసైనికుల్లారా!!" అని పలకరించాడు. ఆ పిలుపు అక్కడ యుద్ధం చేయడానికి సిద్ధమై వచ్చిన ప్రతీ ఒక్కరినీ తమనే పిలుస్తున్నట్లు అనిపించింది.

"ఇరుగు రాజ్యంలో నిన్న పోయిన వారిని కలుపుకొని ఇరవైవేల మంది సైనికులు అవునా?" ప్రశ్నించాడు.

అవునన్నట్లు సమాధానం తెలిసిన కొందరు బల్లేలు ఎత్తేరు. వారిని చూసి కాబోలు అనుకుని మరికొందరు ఎత్తేరు.

"ఈ ఇరవై వేల మంది సైనికులు చచ్చిపోతే పొరుగు రాజ్యంలో ఇరుగు రాజ్యం కలిసిపోతుందా?" అని కొద్ది సేపు దిక్కులు చూసి, ఎవరూ మాటాడకపోతే తనే సమధానం చెప్పాడు.

"పోదు... ఎందుకంటే రాజు మరణించలేదు కాబట్టి. అలాగే ఈ ఇరవై వేలమందిలో ఒక్కరు కూడా చనిపోకుండా... రాజు ఒక్కడే చనిపోతే? అప్పుడు పొరుగు రాజు, ఇరుగు రాజ్యానికి రాజు అవుతాడు. అంటే రాజులు తలచుకుంటేనో, మరణిస్తేనో, ఓడిపోయామని అంగీకరిస్తేనో మాత్రమే యుద్ధఫలితం నిర్ణయం అవుతుంది తప్ప, చనిపోయిన సైనికుల సంఖ్యతో మాత్రం కాదు.. కదా!!"

ఇరువైపులా సైన్యం నిశ్శబ్దమైపోయింది. చెవులు రిక్కించి వినసాగారు.

"అంటే జనాలు ఎంతమంది మరణించారు, బతికి ఉన్నారు అన్నదానితో సంబంధం లేకుండా రాజుల మరణం, బతుకు, సంధి వంటి వాటితోనే ఏ రాజ్యం ఎవరిదో తేలిపోతుంది, అంతే కదా! మరి అలాంటప్పుడు ఇన్ని వేలమంది యుద్ధంలో కొట్టుకోవడం ఎందుకు? మరో విషయం... ఎవరు రాజు అయినా మన జీవితాల్లో ఏ మార్పూ రాదు కదా! చనిపోయిన వాడింట్లో వెలగాల్సిన దీపానికి నూనె పోయాల్సింది, చనిపోయినవాడే కానీ వేరే వాళ్లు కాదు. వాడు వీరస్వర్గానికి పోతే ఆ ఇంట్లో చీకటిని ఏ త్యాగం వెలిగిస్తుంది. ఇదంతా ఆలోచిస్తే నాకో కొత్త ఆలోచన వచ్చింది!" కాసేపు ఆగి మార్కయ్య కొనసాగించాడు...

"ఈ హింస, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం వంటివేవీ లేకుండా.... అదేదో ఆ రాజులిద్దరినే పోట్లాడుకోమంటే సరిపోతుంది కదా? ఒక గోదా ఏర్పాటు చేద్దాం. ఇద్దరురు రాజులను అందులో దిగి బలాబలాలను తేల్చుకోమంటే సరి. దీనివల్ల ఖజానాపై ఖర్చు ఉండదు. పన్నుల పెంపు ఉండదు. అన్నింటికి మించి ఎవ్వరూ... ఒక్కరు కూడా చనిపోరు. ఏమంటారు?"

ఒక్కసారిగా నెమ్మదిగా వీస్తున్న చిరుగాలి సవ్వడి కూడా తుఫాను హోరు మాదిరిగా వినపడుతున్నంత నిశ్శబ్దం ఆవరించింది. అదీ కొంత తడవే! అందరి మొహాల్లోనూ లోతుగా సాగుతున్న ఆలోచనలు. వారికి ఎదురు రాజ్యపు సైనికులలో తమ తోటివారు కనపడుతున్నారు. కూరగాయల కోసం, పప్పు బియ్యం కోసం, కుటుంబానికి భోజనం పెట్టడం కోసం, తాపత్రయపడే సగటు తోటి మనిషి కనపడసాగారు. అస్పష్ట చిత్రం ఏ రంగుకారంగు ఎక్కడికక్కడ అల్లుకొని చిత్రంగా 'చిత్రం' రూపుదాల్చుతోందన్న సమయంలోనే...

చదరంగం బల్లల ముందు కూచుని, తాంబూలం నములుకుంటూ, ఎత్తులు వేస్తూ వింటున్న రెండు రాజ్యాల రాజుల మొఖాలు మాడిపోయాయి. పరుగు పరుగున యుద్ధరంగానికి వచ్చారు.

సైనికులతో చాలా సేపు చర్చలు జరిపారు. రాజులిద్దరూ అంతరంగికంగా కూడా సమాలోచనలు చేశారు. తుదకు ఒక నిర్ణయం తీసుకున్నారు. అది యుద్ధవిరమణ.

అందరూ మార్కయ్యను మెచ్చుకున్నారు. ఎవరింటికి వారు సంతోషంగా... మరీ ముఖ్యంగా 'ప్రాణాలతో' వెళ్లారు.

ప్రజలు ఎవరి పనులలో వారు పడిపోయారు. ఎవరి తిండి వారే తింటున్నారు. కానీ ఎవరికీ తెలియకుండానే కొన్ని పనులు జరిగిపోయాయి. మార్కయ్యను రాజద్రోహ నేరం మీద ఖైదు చేశారు. పొలికేకలు వేసే స్వరతంత్రులను ఉత్తరించారు. మూగవాడైపోయాడు. కొద్ది కాలం తరువాత మాయమైపోయాడు. అతని ఆచూకీ తెలియడం సందేహమే! మార్కయ్య ఒక వ్యక్తి గాదు సమూహం.

ఆ తరువాత కొంతకాలానికి, సృజనశీలురు రాజభక్తి, త్యాగం విలువలు తెలిపే సృజనలు వెలయించడం మొదలయ్యింది. పెద్దలు ఎవరు పుణ్యలోకాలకు పోతారో ఇదివరకే నిర్ణయించిన పరామితులను పునఃస్పృశించసాగారు.

ఏమో? యుద్ధం మళ్ళీ రావచ్చనే ఊహాగానాలు రెండు రాజ్యాలలో వినవస్తున్నాయి.

# ఇచ్చట ఓట్లు అమ్మబడును

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

బలభద్రపాత్రుని ఉదయ శంకర్



"అదిగో మళ్ళీ ఓట్లొస్తున్నాయంట. టీవీలో సెప్తున్నారు" అంటూ రచ్చబండ దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చి ఉత్సాహంగా అరిచాడు బసవయ్య. ఎండుపుల్లలు నెత్తిన పెట్టుకొని భారంగా నడుస్తూ వస్తున్న గంగమ్మ భర్తని చూసి "ముదనష్టపోడా! ఓట్లొస్తే నీయస్మంటోళ్ళు తాగితందనాలు ఆట్టమేగా పని!" అంది రొప్పుతూ.

మాజీ ప్రెసిడెంట్ మాల్యాద్రి బసవయ్య భుజం మీద చెయ్యేసి "అదేందే గంగా అట్టా అంటావు? సంబరం ఈడికొక్కడికేనా ఏందీ... ఎలచ్చన్లంటే ఊళ్ళో కుర్రనాయాళ్ళందరికీ పండగే కదే!" అన్నాడు నవ్వుతూ.

చెమట పట్టిన మొహాన్ని చీరచెంగుతో తుడుచుకుంటూ "అంతేగదన్నా! ఎలచ్చన్లు అయిందాకా ప్రతి గాలి నాకొడుక్కీ రోజూ బిర్యానీ పొట్లం, మందు బాటిలు దొరుకుద్ది. ఆళ్ళకి పండగ్గాక ఏమవుద్ది. మనమేవఁన్నా బాగుపడతామా... ఊరేవఁన్నా బాగుపడుద్దా?" అంది. ఆమె మాటల్లో ఎకసెక్కం, ఆవేదనా కలగలిసిపోయాయి.

పాతికేళ్లు అమెరికాలో ఉండి ఈమధ్యనే స్వగ్రామం వచ్చిన రమణమూర్తి ఆశ్చర్యంగా చూస్తూ "ఇండియా బాగా డెవలప్ అయిందని ప్రపంచమంతా గొప్పగా చెప్పుకుంటుందే! ఐతే అదంతా వట్టిదేనా?" అన్నాడు ఆశ్చర్యంగా.

హెడ్మాస్టర్ వెంకటేశంగారు హేళనగా నవ్వి "బాగానే డెవలప్ అయింది రమణగారూ! మొదట్లో ఓటుకి పదో పరకో ఇచ్చేవారు. తర్వాత్తర్వాత ఒక సారా పేకెట్, వందనోటు ఇవ్వటం మొదలు పెట్టారు. ఇప్పుడు బిర్యానీ పొట్లం, క్వార్టర్ బాటిల్, వెయ్యో రెండు వేలో క్యాషూ ఇస్తున్నారు!" అన్నాడు.

అత్తెసరు మార్కులతో బీటెక్ అయిందనిపించి ఉద్యోగం దొరక్కా, వ్యవసాయం చెయ్యలేకా ఖాళీగా తిరుగుతున్న వీరేంద్ర.. "ఈ చేతగాని ప్రభుత్వం ఉన్నంత కాలం కొత్త ఉద్యోగాలు రావు. అభివృద్ధి జరగదు. మన బతుకులు ఇంతే!" అంటూ అక్కసు వెళ్ళగక్కాడు.

వెంకటేశం అసహనంగా చూసి "ప్రభుత్వం చేతకానిది సరే... మరి నీ బుద్ధి ఏమైందని? ఫీజుల్లేకుండా చదివిస్తున్నారని ఇంజనీరింగైతే చదివావు కానీ, ఉద్యోగం మాత్రం సాధించలేకపోయావు. అదే టెన్త్ అయిపోగానే మీ నాన్నతో పాటు పొలం వెళ్ళి ఉంటే, ఈపాటికి నీకో ఆధారం దొరికి ఉండేది కదా!" అన్నాడు.

వీరేంద్రకి రోషం వచ్చింది. "అంటే మీ ఉద్దేశం నాలాంటి రైతుబిడ్డలు పెద్ద చదువులు చదవకుండా మట్టి పిసుక్కోవాలనేగా?" అన్నాడు. దాంతో మిగిలిన వారు కూడా వెంకటేశం మీద మాటల దాడి చేశారు.

గంగమ్మ వెంకటేశాన్ని సమర్ధిస్తూ "అంటే గింజుకుంటారు కానీ పంతులుగారు సెప్పిందాంట్లో తప్పేఁవుంది? పొలం పనులు చేయటం నామర్దా ఏం కాదు. ఇప్పుడు సూడు. రెంటికీ చెడ్డ రేవడి అయ్యావు గదా!" అంది.

అజాతశతృవులా ఉండే అచ్యుతరామయ్య "మనం చదవగలమా లేదా అని ఆలోచించకుండా, అందరూ బీటెక్ కోసం పాకులాడటం మూర్ఖత్వమే. ప్రభుత్వం కూడా ప్రతిభ ఆధారంగా చదివిస్తే ఈ దుస్థితి వచ్చేది కాదు!" అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు.

రచ్చబండ కబుర్లు ఉచిత చదువుల నుంచి ఎన్నికల వైపూ, ఊళ్ళో సమస్యల వైపూ మళ్ళాయి. వాళ్ళ మాటల్లో వ్యక్తమైన నిర్వేదం, నిస్సహాయత రమణమూర్తిని ఆలోచనల అగాధంలోకి నెట్టేశాయి.

★★★

ప్రస్తుతం ఉన్న సామాజిక రుగ్మతలకు ఏకైక కారణం అవినీతే అని గ్రహించాడు రమణమూర్తి. అతడు ఊరి పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి "నేను అమెరికా వెళ్ళినప్పుడు ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉంది మన రామవరం...." అంటూ మొదలుపెట్టాడు.

మాల్యాద్రి అతడి మాటలకు అడ్డొస్తూ "అదేందబ్బాయ్ అట్టా అంటావు? మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సిమెంట్ రోడ్లు ఏపించాం. అప్పట్లో అన్నీ మట్టి రోడ్లేగా!" అన్నాడు.

వెంటనే ప్రెసిడెంట్ కరుణకుమారి అందుకుని "మా ప్రభుత్వం ఫీజులు భరాయించబట్టే కదా కుర్రోళ్ళు పెద్ద సదువులు సదూతున్నారు!" అంది పోటీగా.

అందరూ సోమయ్య అని పిలిచే సొసైటీ ప్రెసిడెంట్ సోమేశ్వర్రావు కళ్ళెగరేస్తూ "ఇప్పుడు మనోళ్ళకి ఏం తక్కువైందని. పిల్లల్ని స్కూల్ బస్సులో టౌనుకి పంపి చదివిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరుల్లో పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. నీలాంటోళ్ళు విదేశాలకి కూడా వెళ్ళి దాలర్లు సంపాదించారు!" అన్నాడు గొప్పగా.

అచ్యుతరామయ్య అందరినీ గదమాయించి "అరే ఉండండ్రా! మన రవఁణ ఏదో చెప్పబోతున్నాడు. శ్రద్ధగా వినండి!" అన్నాడు. అమెరికాలో పెద్ద ఉద్యోగం చేసి వచ్చిన రమణమూర్తి ఊరిని బాగు చేయగలడు అన్న విశ్వాసం కలిగింది ఆ పెద్దాయనకు.

రమణమూర్తి చిన్నగా నవ్వి "నా విచారమంతా కనీస అవసరాలైన మంచినీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య గురించే! కానీ ఓటుకి నోటు తీసుకున్న జనానికి 'మా కనీస అవసరాలు తీర్చాలి' అని దబాయించి అడిగే ధైర్యం ఉందా? ప్రభుత్వమే ప్రజల్ని సోమరిపోతుల్లా తయారు చేస్తుంటే, ఇంక అభివృద్ధి గురించి ఎందుకు ఆలోచించచటం?" అని సూటిగా ప్రశ్నించాడు.

అచ్యుతరామయ్య రమణమూర్తిని అభినందిస్తూ "బాగా చెప్పావు రవఁణా! కానీ మన వ్యవస్థే అట్టా తగలబడింది. దీనిని ఎవరూ బాగు చేయలేరయ్యా" అన్నాడు నిరాశగా.

"మనని మనమే బాగు చేసుకోవాలి బాబాయ్! అది ఒక నిశ్శబ్ద విప్లవంలా రావాలి. మద్యపానానికి వ్యతిరేకంగా ఒక గ్రామీణ మహిళ మొదలు పెట్టిన ఒంటరి పోరాటం పాలకుల పునాదులు కదిలించిన విషయం మర్చిపోయారా! మహా జలప్రళయం కూడా

ఒక్క చుక్కతోనే మొదలవుతుంది అని మనం గుర్తించాలి!" అన్నాడు రమణమూర్తి. అతడి మాటలు అందరిలో ఆలోచనలు రేకెత్తించాయి.

★★★

సాయంసంధ్య వేళ రమణమూర్తి వాకింగ్‌చేసి పొలంగట్టు మీద సేద తీరుతున్నాడు. అదే సమయంలో సిటీ నుంచి వస్తున్న రాయుడు తన బుల్లెట్ మోటార్‌సైకిల్ రోడ్డువారగా ఆపి "హల్లో మూర్తిగారూ!" అంటూ వచ్చి రమణమూర్తిని పలకరించాడు.

రాయుడు చాకు పార్టీలో చురుకుగా తిరుగుతుంటాడు. అతడికి తెలుసు రమణమూర్తి మాటంటే ప్రజలకి వేదవాక్కని. "అమెరికాలో డాలర్లు పండించి, ఇప్పుడు ఇండియాలో స్థిరపడ్డారు. మీకు ప్రజాసేవ చెయ్యాలనే అభిలాష ఉంది. మా పార్టీలో చేరండి. రాజకీయంగా అండదండలు పుష్కలంగా ఉంటాయి!" అన్నాడు.

రమణమూర్తి నవ్వి "ప్రజాసేవ చెయ్యాలంటే పార్టీలోనే చేరాల్సిన అవసరం లేదండీ. ఏదో నాకు చేతనైన నాలుగు మంచి పనులు చేస్తాను. ఆ తృప్తి చాలు నాకు" అని సున్నితంగా తిరస్కరించాడు.

రాయుడు రమణమూర్తిని ఒప్పించాలని విఫలయత్నం చేసి "సరే మీ ఇష్టం. కానీ మా పార్టీని మర్చిపోమాకండి" అని కొద్ది క్షణాలు ఆగి "రామవరంలో ఉన్న మొత్తం పదకొండొందల ఓట్లలో మీ కులపోళ్ళవి నాలుగొందల దాకా ఉంటయ్. అయ్యన్నీ మా పార్టీకి ఏయించారంటే, ఓటుకి రెండేలు ఇప్పిస్తా. మామూలుగా అయితే పల్లెలో వాళ్ళకిచ్చేది ఎయ్యిరూపాయిలే. ఆలోచించండి. మరి వస్తా!" అంటూ కులాసాగా నవ్వుతూ వెళ్లిపోయాడు.

రాయుడు వెళ్ళిన వైపే చూస్తూ దీర్ఘాలోచనలో మునిగిపోయాడు రమణమూర్తి. అతడి మస్తిష్కంలో కొత్తపథకం రూపు దిద్దుకుంటోంది. రెండు రోజులు తీవ్రంగా ఆలోచించి తన పథకాన్ని ఊరి పెద్దల ముందుంచాడు.

"అదేంటయ్యా రమణా! ఓటుని అమ్ముకోమని నువ్వే సలహా ఇస్తున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు అచ్యుతరామయ్య. రమణ మూర్తి తల పంకిస్తూ "అవును బాబాయ్! ముల్లును ముల్లుతోనే తీయాలి. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు చేసిన వాగ్దానాలు మర్చిపోయి మనకి ద్రోహం చేసినట్లుగానే, మనం కూడా ఓట్లు వేస్తామని డబ్బులు తీసుకుని, ఓటు మాత్రం ఎవరికీ వేయవద్దు!" అన్నాడు.

వెంకటేశం మొఖం చిట్లించి "ఛీ.. ఛీ.. ఎవరో గడ్డి తిన్నారని మనమూ తింటామా? ఓటుని అమ్ముకొని సంపాదించిన డబ్బు తిన్నా మనకి అరగదు!" అన్నాడు.

రమణమూర్తి నచ్చజెప్పే ధోరణిలో "నన్ను అపార్థం చేసుకోకండి మాస్టారూ. రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలను ప్రజలకి చెప్పి, వారిని చైతన్యవంతులను చేయటానికి ఇది ఒక సాధనం మాత్రమే!" అని అందరినీ చూస్తూ "ఓట్లు అమ్మిన డబ్బుతో అందరికీ పనికి వచ్చే మంచి కార్యక్రమం ఏదైనా చేద్దాం. ఐతే ఈ విషయంలో ప్రజలను ఒప్పించటమే కాస్త కష్టమైన పని" అన్నాడు.

ఈ ప్రతిపాదన మీద చర్చోపచర్చలు, వాదోపవాదాలు జరిగాయి. చివరికి 'పార్టీలు డబ్బు పంచటాన్ని ఎవరూ ఆపలేరు. వద్దంటే ఓటర్లు అంగీకరించరు. కనీసం ప్రజా ప్రయోజనం కోసం ఆ డబ్బుని వాడితే పాప పరిహారం అవుతుంది' అనే అభిప్రాయం వ్యక్తం అయింది.

బసవయ్య లాంటి కూలీలని, వీరేంద్ర లాంటి యువతని ఒప్పించిన రమణమూర్తి ప్రజలను చైతన్య వంతుల్ని చేయటానికి నాలుగు బృందాలు ఏర్పాటు చేశాడు. బృందసభ్యులు గడప గడపకు తిరిగి "నోటుకి ఓటు... ఓటు మాత్రం నోటాకి" అంటూ ప్రచారం ప్రారంభించారు.

ఈ కొత్త నినాదం ఏమిటో అర్థంకాక అయోమయంలో పడ్డ ప్రజలకు "ఏ అభ్యర్థి డబ్బు ఇచ్చినా తీసుకోండి. ఆ డబ్బుతోనే మన గ్రామాన్ని బాగు చేసుకుందాం. ఓటు మాత్రం డబ్బిచ్చిన అభ్యర్థికి వేయద్దు" అంటూ ప్రచారం చేశారు బృందసభ్యులు.

రమణమూర్తి ఇంటింటి ప్రచారంలో "దశాబ్దాలుగా మనం ఎంత అంధకారంలో మగ్గుతున్నామో కూడా మనకు తెలియకుండా నాయకులు జాగ్రత్తపడ్డారు. తాత్కాలిక లాభాలు ఎరవేసి మనల్ని దోచుకున్నారు. ఎండాకాలం వస్తే నీటిఎద్దడి, వానా కాలంలో వరద ముంపు! రోగం వస్తే చూసే డాక్టర్ లేదు, పిల్లలు బడికి వెళ్ళే దిక్కు లేదు!" అంటూ ప్రజల్ని చైతన్య పరిచాడు.

ఒక ట్రంకుపెట్టెని ప్రజాహుండీగా మార్చి, రామాలయం ముఖమంటపానికి గొలుసులతో కట్టి బంధించారు. అభ్యర్థుల తరపున ప్రచారం చేసి సంపాదించిన కూలీ, నాయకుల సభలకి హాజరైనందుకు ఇచ్చే భత్యం, పోలింగ్ ముందు పంచిపెట్టే డబ్బులు స్వచ్ఛందంగా ఆ హుండీలో వేయమని అభ్యర్థించాడు రమణమూర్తి.

గతంలో ఓటర్లు డబ్బుకి ఓట్లు అమ్ముకొని జల్సా చేసే వారు. ఇప్పుడు అదే ఓటర్లు రమణమూర్తి పిలుపు మేరకు ఆ డబ్బుని ప్రజా హుండీలో వేయటం వారిలో వచ్చిన చైతన్యానికి అద్దం పట్టింది.

ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజల సమక్షంలో గ్రామపెద్దలు హుండీ తెరిచారు. ఏ మూడు నాలుగులక్షలో వస్తాయని ఆశిస్తే, ఏకంగా పన్నెండు లక్షల యాభై వేలు రావటం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. అవినీతిని పెంచి పోషించే రాజకీయ బేహారుల మీద వాళ్ళకున్న ఆగ్రహాన్ని తేటతెల్లం చేసింది.

అక్కడ చేరిన జనాన్ని ఉద్దేశించి "చూశారా? గట్టిగా వెయ్యి ఓట్లు లేని ఈ ఊళ్ళో ఎన్నికల అవినీతి విలువ పన్నెండు లక్షలు దాటింది. ఇక రెండులక్షల పాతికవేల ఓట్లున్న నియోజకవర్గంలో ఎంత ధనం ప్రవహించిందో మీరే ఊహించుకోండి. ఈ డబ్బు పంచిన వాళ్ళెవరూ ఆగర్భ శ్రీమంతులు కారు అని కూడా తెలుసుకోండి" అన్నాడు రమణమూర్తి ఆవేశంగా.

వెయ్యి, రెండు వేలు అంటూ లెక్కలు వేసుకున్న ప్రజలు ఇప్పుడు అసలు మొత్తం బయటపడేసరికి, ముక్కున వేలేసుకున్నారు. "ఈ డబ్బు వాళ్ళ మొఖానే కొడదాం. మనమేవఁన్నా భిక్షగాళ్ళమా?" అంటూ ఒక పౌరుడు ఆవేశంగా అరిచాడు.

అచ్యుత రామయ్య శాంతంగా చెప్పాడు. "ఇన్నాళ్లూ మనం చేసిందేమిటి? అసలు తప్పు మనలో కూడా ఉంది. ఇప్పుడు ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదు. ఇదంతా మన దగ్గర దోచుకున్న సొత్తు. మళ్ళీ మనకే పంచారు. దీనిని మన ఉమ్మడి అవసరాలకు వాడుకోవచ్చు".

రమణమూర్తి తలాడిస్తూ "అవును. బాబాయ్ చెప్పింది నిజం. ఈ సొమ్ము అందరికీ ఉపయోగపడేలా ఏం చేస్తే బాగుంటుందో మీరే నిర్ణయించండి!" అని నిర్ణయం గ్రామస్తులకే వదిలిపెట్టాడు.

చాలాసేపు తర్జనభర్జనలు జరిగాయి. మహిళలంతా ఊరికి త్రాగునీరు కావాలని ముక్తకంఠంతో కోరారు.

రమణమూర్తి చప్పట్లు చరుస్తూ "మీలో ఈ చైతన్యం చూస్తుంటే నాకు ఉత్సాహం కలుగుతుంది. అయితే ప్రతిసారీ మన పాచిక పారుతుందని అనుకోవద్దు. ఎత్తుకు పైఎత్తు వేసే దుర్మార్గ నాయకులను నడివీధిలో నిలదీసే రోజు రావాలి!" అన్నాడు.

హైస్కూల్ హెడ్మాస్టర్, సొసైటీ ప్రెసిడెంట్, మరో ఇద్దరు యువకులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, మంచినీటి ప్రాజెక్టు పనులు ఆ కమిటీకి అప్పగించారు. అనతి కాలంలోనే గ్రామంలో మంచినీటి పథకం సిద్ధమయింది.

ఓట్ల లెక్కింపు సమయంలో గ్రామాల వారీగా పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులకు దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు తెలిశాయి. రామవరంలో ప్రధానపార్టీలకు పడిన ఓట్లు రెండంకెలు దాటలేదు. ఓట్లన్నీ గంపగుత్తగా నోటాకే పడటం చూసి అభ్యర్థుల నోళ్ళు పడిపోయాయి.

విషయం తెలుసుకుందామని రామవరం గ్రామానికి వచ్చిన నాయకులకు ఊరి పొలిమేరలో "ఇచ్చట ఓట్లు అమ్మబడును" అనే బోర్డు స్వాగతం పలికింది.

# కాదేది కల్తీకి అనర్హం

శ్రీమతి సోమేపల్లి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

కోయిలాడ రామమోహనరావు




"నాన్నేమిటి ఈ మధ్య సైలెంట్‌గా ఉన్నారు? కల్తీ ...కల్తీ అంటూ నిన్ను సతాయించడం లేదేమిటి? ఆశ్చర్యంగా లేదూ?" అంటూ తగ్గుస్వరంలో భార్య, గాయత్రిని అడిగాడు శాండిల్య.

"అవునండీ. నేనూ అదే గమనిస్తున్నాను. ఇంతకు ముందులా ఇబ్బంది పెట్టకుండా, తన గదికే అంకితమయిపోయారు. మీరు గమనించారో లేదోగానీ, బాగా మూడ్ఆఫ్‌లో ఉన్నారు. బహుశా అత్తయ్య గుర్తుకి వచ్చి ఉంటారు. రెండువారాలు దాటిపోయింది కదా? ఆవిడ తీర్థయాత్రలకు వెళ్లి. ఎన్నో ఏళ్ళుగా కలిసున్నారు కదా? ఇదే మొదటిసారి కాబోలు, అత్తయ్య ఆయన్ని విడిచి ఇన్ని రోజులు ఉండడం!" అంది గాయత్రి.

"నిజమే అమ్మ గుర్తువచ్చి ఉంటుంది. చిన్న పిల్లాడిలా బెంగపెట్టుకొని ఉంటారు. వాళ్ళిద్దరూ భార్యాభర్తలే కాదు, గొప్ప స్నేహితులు కూడా!" అన్నాడు.

"కల్తీ గురించి ఆయన ఎప్పుడూ ఉపన్యాసాలు ఇస్తూ ఉంటే, ఇబ్బందిగా ఉండేది. ఆయన చెప్పినట్లు నడుచుకోవాలంటే కష్టంగానూ ఉండేది. కానీ ఇప్పుడాయిన ఇలా సైలెంట్‌గా ఉండిపోతే, చాలా బాధగా ఉంది. మీరు ఆఫీసుకు వెళ్ళిపోతారు కాబట్టి, మీకు పెద్ద తేడా తెలియదు గానీ, నాకు మాత్రం చాలా ఇదిగా ఉంది. ఈ పదిహేనురోజులు ఆయన చేసే హడావిడికి బాగా అలవాటు పడిపోయిన నాకు, ఏమిటో చాలా వెలితిగా ఉంది. ఆయన మునుపటిలా హడావిడి చేస్తూ మాట్లాడుతూ ఉంటేనే బాగుండును అనిపిస్తుంది!" అంది.

ఆ మాటలు వింటే, ఆమె ఎంత బాధపడుతుందో శాండిల్యకు అర్థమయింది. అనుకూలవతి అయిన అర్ధాంగి భుజం మీద ఆప్యాయంగా చేయి వేస్తూ, "అమ్మతో చెప్తాను. రోజుకు రెండు సార్లయినా నాన్నకు ఫోన్‌చేసి మాట్లాడుతుండమని, దానివల్ల కాస్త దిగులు తగ్గుతుంది!" అన్నాడు.

★★★

శాండిల్య తల్లితండ్రులు భరద్వాజ, శార్వరి. వాళ్ళిద్దరూ కాకినాడలో ఉంటారు. భరద్వాజ ఒక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేసి, రిటైర్ అయ్యాడు. శార్వరి డిగ్రీ వరకూ చదువుకున్నా, గృహిణిగానే ఉండిపోయింది. శాండిల్య, గాయత్రి హైదరాబాదులో ఉంటారు. ఒక నెలపాటూ శార్వరి, తన స్నేహితురాళ్ళతో ఉత్తరాదికి తీర్థయాత్రలకు వెళ్ళడంతో, తండ్రి ఒంటరివాడు అయిపోతాడని, హైదరాబాదు తీసుకొచ్చేసాడు శాండిల్య.

గతంలో చాలాసార్లు హైదరాబాదు వచ్చినా, ఏదో ఫంక్షన్‌కో, పెళ్ళికో వచ్చి హడావిడిగా తిరిగి వెళ్ళిపోతూ ఉండడంతో, ఇంట్లో తీరికగా ఉన్న సమయం తక్కువే. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. అంతా తీరికే. వచ్చిన మర్నాడే అతని దృష్టి వంటగదిలో ఉన్న సామాన్లపై పడింది. ధనియాల పొడి, జీలకర్ర పొడి, పసుపు, కారం, గోధుమ పిండి, అల్లం వెల్లుల్లి పేస్టు వంటివెన్నో అందమయిన పేకింగులలో కనబడేసరికి, కోడలికి క్లాసు పీకడం మొదలుపెట్టాడు.

"ఏమిటి తల్లీ.. చదువుకున్నదానివి, అన్నీ తెలిసినదానివి. నువ్వు కూడా ఇలా చేస్తే ఎలా?" అంటూ ఏ ఉపోద్ఘాతం లేకుండా వాయించేస్తుంటే,

"ఏమిటి మావయ్య గారూ?" అంటూ కంగారు పడింది.

"నీకు తెలుసుగా ఈరోజుల్లో కల్తీ ఎంతగా పెరిగిపోయిందో? అన్నింట్లోనూ కల్తీయే!" అంటుంటే ఆయన ఆ టాపిక్ ఎందుకెత్తాడో తెలియక అయోమయంగా చూసింది. అది అర్థం చేసుకున్న భరద్వాజ చెప్పడం మొదలుపెట్టాడు.

"చూడమ్మా... మీ ఇంట్లో కూడా అన్నీ రెడీమేడ్ ఫుడ్‌లే!" అంటూ షెల్ఫ్ వైపు చేయి చూపాడు.

"వీటన్నిటినీ రెడీమేడ్‌గా కొనుక్కోవడం మానేయాలి. కొన్నింటిలో, చాలాకాలం నిల్వ ఉండడానికి ప్రిజర్వేటివ్‌లు కలుపుతారు. అవి మరీ ప్రమాదకరం. చదువుకున్న మనలాంటివాళ్ళు కల్తీ మీద దృష్టి పెట్టాలి. పదిమందిని ఎడ్యుకేట్ చేయాలి. చూడు, ఈ మిరియాలు. వీటిలో కూడా కల్తీయే. బొప్పాయి గింజలు కలిపేస్తారు. ఈ మిరియాలను నీట్లో వేస్తే, తెలిసిపోతుంది. మిరియాలు కిందకు దిగిపోతాయి. బొప్పాయి గింజలు పైకి తేలిపోతాయి. కొంతమందికి ఆ గింజల వల్ల 'ఎలర్జీ' వచ్చి, చాలా ఇబ్బందులు పడతారు!" అంటూ తేనె సీసా చూపించి,

"నీకు తెలుసా కల్తీలేని తేనెకు 'ఎక్స్‌పైరీ డేట్' లేదు. ఎన్నాళ్లయినా అది పాడవదు. కానీ అలాంటి తేనె ఎక్కడ దొరుకుతుంది? తేనెను గాజు సీసాల్లోనే భద్రపరచాలి. ప్లాస్టిక్‌తో అది మెల్లమెల్లగా చర్య చెందే అవకాశం ఉంది. బజార్లో దొరికే తేనె, ప్లాస్టిక్ సీసాల్లోనే దొరుకుతుంది. ఏం చేస్తాం? తప్పక కొనుక్కోవలసి వస్తుంది. పెద్ద పెద్ద కంపెనీలు చేసే తేనెలోనూ కల్తీయే!" అంటున్న భరద్వాజను అడిగింది గాయత్రి,

"తేనెలో కల్తీ ఎలా కనుక్కుంటారు మావయ్యగారూ?" అంటూ.

"ఓ... నీకు బోర్ కొడుతుందేమోననుకున్నాను. ఫరవాలేదే!" అంటూ సంతృప్తి వ్యక్తం చేసి,

"తేనెలో కల్తీ కనుక్కోవడానికి చాలా టెస్టులున్నాయి. అయితే సింపుల్ టెస్ట్‌లు, చెప్తాను. నీట్లో వేసి చూస్తే, కల్తీ లేని తేనె, కిందకు దిగిపోయి, ముద్దలు గా సెటిల్ అవుతుంది. కల్తీ ఉన్న తేనెలో కొంత భాగం నీట్లో కరిగిపోతుంది. అందులో కలిపిన, గ్లూకోజ్ వల్లగానీ, పంచదార వల్లగానీ అలా జరుగుతుంది. మరో టెస్ట్ కూడా ఉంది. కల్తీ లేని తేనెలో ముంచిన కాగితాన్ని, అంటిస్తే, చక్కగా మండుతుంది. కల్తీ ఉంటే మండదు. చెప్పానుగా గ్లూకోజ్, పంచదార ద్రావణరూపంలో కలపడం వల్ల, ఆ తేనెలో తేమ ఉంటుంది. అందుకే అది మండదు. 'కాదేది కవితకనర్హం' అని మహాకవి శ్రీశ్రీ చెప్పారు. 'కాదేది కల్తీకి అనర్హం' అని నాలాంటివాళ్ళు చెప్తారు" అంటూ నవ్వి,

"అన్నీ కల్తీయే, పాలు, పంచదార, బెల్లం, పసుపు, కాఫీ, టీ, ఎండుమిర్చి, కందిపప్పు, మినపప్పు .....ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద లిస్టే ఉంది. అయితే అన్నిటికీ కల్తీ గుర్తించే పరీక్షలున్నాయి. వాటి గురించి చెప్పి, నీకు బోర్ కొట్టించనులే!" అంటూ పెద్దగా నవ్వాడు. గాయత్రి కూడా నవ్వుతూ..

"అవన్నీ వినే ఓపిక లేదు గానీ, పసుపు ఎలా టెస్ట్ చేస్తారో చెప్పండి చాలు!" అని అడిగింది.

"సాధారణంగా పసుపులో 'మెటానిల్ ఎల్లో' అనే కెమికల్ కలుపుతారు. అచ్చు పసుపులాగే ఉండే ఆ కెమికల్ చాలా ప్రమాదకరమయినది. దానివల్ల 'కేన్సర్' వచ్చే ప్రమాదముంది. ఒక సింపుల్ టెస్ట్ చెప్తాను విను. ఒక గాజు గ్లాసులో గోరువెచ్చని నీళ్ళు తీసుకొని, అందులో చెంచాడు పసుపు వేసి, కలపకుండా, కదపకుండా ఇరవై నిమిషాలు ఉంచు. కల్తీ లేని పసుపు కిందకు దిగి, సెటిల్ అయిపోతుంది. నీళ్ళు, సహజమయిన రంగుతో స్వచ్ఛంగా ఉంటాయి. అదే కల్తీ పసుపు అయితే, నీళ్ళు పసుపు రంగులోకి మారతాయి. ఆ నీళ్ళలో ఉన్నది కల్తీ చేసిన కెమికల్. మీ ఇంట్లో కూడా కొని తెచ్చిన పసుపు ఉంది కదా? దాన్ని టెస్ట్ చేసి చూడు" అంటూ పేపర్లో తలదూర్చాడు.

'అలాగే' అంటూ గాయత్రి ఉత్సాహంగా వంట గదిలోకి వెళ్ళింది. అరగంట తర్వాత బయటకొస్తూ, "నిజమే మావయ్య గారూ. మేము వాడేది, కల్తీ పసుపే. ఇప్పుడెలా?" అంటూ అడిగింది, బేలగా. చిన్నగా నవ్వి

"వెంటనే ఆ పేకెట్ డస్ట్ బిన్లో పడేయ్. సాయంత్రం బజార్లోకి వెళ్ళి, పసుపుకొమ్ములు, గోధుమలు, ధనియాలు, జీలకర్ర, అల్లం, వెల్లుల్లి, కారం కోసం ఎండుమిర్చి వగైరా కొనుక్కొద్దాం. రెడీగా ఉండు. చాలా సామాన్లు ఇంట్లోనే చేసుకోవచ్చు. కారం, పసుపు, గోధుమపిండి మిల్లులో ఆడించుకోవచ్చు. నా మాట విని, ఈ కల్తీ ఆహారానికి స్వస్తి చెప్పి, నేను చెప్పినట్లు చేయి!" అన్నాడు.

'అమ్మ నాయనోయ్! పెద్ద పనే తగిలేటట్లు ఉంది. నా పని అయిపోయినట్లే!' అనుకుంటూ గాభరా పడింది. ఇంతవరకూ ఏదిబడితే అది, రెడీమేడ్‌గా కొనుక్కుంటూ, సుఖానికి అలవాటు పడిన గాయత్రికి ఇపుడు పెద్ద కష్టమే వచ్చింది. దీనికి తోడు, మరో దాని గురించి కూడా చింత మొదలయింది ఆమెకు. 'దీనిని బట్టి చూస్తే, మావయ్యగారు ఉన్నన్నాళ్ళు, హోటల్నుంచి, పార్సిళ్ళు బంద్. డామినోస్ లేదు...స్విగ్గీ లేదు...జొమాటో లేదు' అనుకుంది, నీరసంగా.

★★★

భరద్వాజ మూడీగా అయిపోయి, గదికే పరిమితం అయిపోవడానికి కారణం, అతని భార్య మీద బెంగ కాదు. రెండ్రోజుల క్రితం అతనికో భయంకరమయిన నిజం తెలిసింది. ఆ నిజాన్ని జీర్ణించుకోవడం అతని వల్ల కావడంలేదు. ఎన్నో తరాలుగా సదాచార సంపన్నులుగా పేరుగాంచిన అతని కుటుంబ చరిత్రకు మాయని మచ్చను తెచ్చిన, ఆ వార్త అతన్ని బాగా కుదిపేసింది. 'తన తల్లి కులము, జాతి గురించి తెలిసిన దగ్గరి నుంచి, అతని మనసు, మనసులో లేదు. అరవైఏళ్ల వయసు వచ్చేవరకూ, తనకు ఆ నిజం తెలియకపోవడం ఎంతో చిత్రంగా ఉంది అతనికి. ఏనాడూ తల్లి, ఒక పరాయిజాతి స్త్రీ అన్న అనుమానం కలగలేదతనికి. ఆచారవ్యవహారాలను పాటించడంలోగానీ, శుచీ, శుభ్రత విషయంలోగానీ ఆమెను వేలెత్తి చూపలేని విధంగా నడుచుకుంది.

"నాన్నెందుకీ పనిచేసాడు? ఆయనకా ఖర్మ ఎందుకు పట్టింది? ఆయన్ని ఎంతో ఉన్నతంగా ఊహించుకున్నానే? ఆ గౌరవంతోనే నా కొడుక్కి ఆయన పేరు పెట్టుకున్నానే.... ఆయనెందుకిలా చేసాడు? ప్రతి చోటా కల్తీని ఎత్తి చూపే నా కుటుంబమే కల్తీ అయిపోతే, నా పరిస్థితి ఏమిటి? ఈ నిజం తెలిస్తే, నా భార్య తట్టుకోగలదా? దేవుడా....! ఎందుకయ్యా నాకిలాంటి పరీక్ష పెట్టావు?" అనుకుంటూ పరిపరి విధాల చింతించసాగాడు, రోజుల తరబడి. అయినా తన ఫీలింగ్స్ కొడుకుకు గానీ, కోడలికి గానీ తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. ఇటువంటి పరిస్థితిలో, తన బాధను భార్యతో చెప్పుకుంటేనే ఉపశమనం కలుగుతుందని, ఆమెను పోరుబెట్టి, వెనక్కి రప్పించేసాడు.

★★★

భర్త ఇలా పట్టుబట్టి, అర్ధాంతరంగా తనను ఎందుకు రప్పించేసాడో తెలియని అయోమయపు పరిస్థితిలో, శార్వరి వెనక్కి వచ్చేసింది. ఆమె గదిలోకి రాగానే, తలుపులు వేసేసి, ఆమెను కావలించుకొని ఏడుస్తున్న భర్తను చూస్తూ విస్తుపోయింది. ఏం జరిగి ఉంటుందో

తెలియక సతమతమవుతున్న శార్వరి దగ్గర తనకు తెలిసిన నిజం మెల్లగా బయట పెట్టాడు, ఎంతో సంకోచిస్తూ. 'ఎంతో ఉపద్రవం సృష్టిస్తుంది అనుకున్న తుఫాన్ తుస్సుమన్నట్లు' శార్వరి ఆ విషయాన్ని చాలా తేలికగా తీసుకుంది.

"ఓస్... ఇంతేనా? మరేదోననుకొని భయపడ్డాను. మీకు సగమే తెలిసినట్లుంది. నాకు మొత్తం తెలుసు. అది తెలియకే మీ నాన్నగారిని ఆడిపోసుకుంటున్నారు!" అంటున్న శార్వరి వైపు చాలా ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

"నాకీ విషయం మా నాన్న, మన పెళ్ళికి ముందే వివరంగా చెప్పి, నేను మనస్ఫూర్తిగా ఇష్టపడితేనే పెళ్లి చేస్తానన్నాడు. నేను వెంటనే నా అంగీకారాన్ని తెలిపాను. జరిగిందేమిటో వివరంగా చెప్తాను వినండి.

అపుడు మీ నాన్నగారు 'అడ్డతీగెల తాలుకా ఆఫీస్' లో డిప్యూటి తాసిల్దారుగా పనిచేసేవారు. అది బాగా మన్యం ప్రాంతం కావడం వల్ల తాసిల్దారు, అడ్డతీగెలకు కాస్త దూరంలో ఉండే 'ఏలేశ్వరం'లో ఉంటూ, అప్పుడప్పుడు ఆఫీసుకు వచ్చే ఏర్పాట్లు చేసుకున్నాడు తెలివిగా. అందుచేత మొత్తం బాధ్యత అంతా మావయ్యగారి మీదే పడేది. దూరంగా ఉంటూనే, తాసిల్దార్ పెత్తనం చెలాయించేవాడు. అతను చెప్పినది అమలు చేయడమే మావయ్యగారి పని. ఖాళీగా పడి ఉన్న ఎన్నో ఎకరాల ప్రభుత్వభూములను, వ్యవసాయం చేసుకోవడానికి ఇమ్మని అక్కడి గిరిజనులు తాసిల్దార్ ఆఫీసుకు అర్జీ పెట్టుకున్నారు. ఎన్నోసార్లు బతిమాలిన తర్వాత, వాళ్ళ కోరికను మన్నించడానికి అంగీకారం తెలిపాడు తాసిల్దార్. ఎంతో ఆశతో వాళ్ళు ఎదురుచూస్తున్న సమయంలో, తాసిల్దార్, కలెక్టర్ లంచాలు తీసుకొని, ఒక బడా వ్యాపారవేత్తకు, ఒక ప్రాజెక్ట్ నిమిత్తం ఆ భూములు ఇచ్చేసారు. ఇదంతా మావయ్యగారే చేస్తున్నారనుకున్న గిరిజనులు ఆవేశంతో, ఆఫీసు మీద దండెత్తారు. అయితే నిజానిజాలు తెలిసిన, 'బాపన్నదొర' అనే గిరిజనుడు, వాళ్ళను ఆపుదామని, అసలు కారకులెవరో చెప్దామని ఎంతగానో ప్రయత్నించినా, రెచ్చిపోయిన జనం అతని మాటలు వినలేదు. అతను కూడా మీ నాన్నగారితోనే పనిచేస్తూ ఉండడం వల్ల, అతనికి అన్ని విషయాలూ బాగా తెలుసు. బాపన్నదొర ఎంత చెపుతున్నా వినకుండా, ఆవేశంతో రెచ్చిపోయిన ఒక గిరిజనుడు, మావయ్యగారి మీద దాడి చేయబోతే, బాపన్నదొర అడ్డం పడి, మావయ్యగారిని కాపాడాడు. అనుకోని విధంగా, ఎంతో మంచివాడు, అందరికీ ఆప్తుడయిన తమ సహచరుడు నేలకొరిగేసరికి, జనం కొయ్యబారిపోయారు. మావయ్యగారి కోసం దొర ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధపడటంతో, ఆయన తప్పులేదని నమ్మిన జనం, దాడి విరమించారు.

"నా కూతురు దిక్కులేనిదయిపోతుంది సారూ" అంటూ మరణశయ్య మీదున్న దొర మాటలకు మావయ్యగారు చలించిపోయారు. అప్పటికప్పుడు అత్తయ్య మెడలో పసుపుతాడు కట్టడంతో, దొర తృప్తిగా మరణించాడు. ఆ తర్వాత ఆమెకు, చదువుతో సహా అన్ని ఆచార వ్యవహారాలూ పూర్తిగా నేర్పి, మన కుటుంబాల్లో ఇమిడిపోయేలా తీర్చిదిద్దారు. అన్ని విషయాలూ తెలుసుకున్న మీ తాతగారు ఆ వివాహాన్ని ఆమోదించి, ఆమె పరాయి జాతి మనిషన్న విషయాన్ని పూర్తిగా దాచిపెట్టారు. అలా ఆ రహస్యం అప్పుడే సమాధి అయిపోయింది. మా నాన్న, ఆ రోజుల్లో, ఆ ప్రాంతంలోనే కరణంగా పనిచేస్తూ ఉండడం వల్ల, ఆయనకు ఈ విషయాలన్నీ తెలిసాయి."


"మీ అమ్మగారి మూలంగా మన కుటుంబం కల్తీ అయిపోయిందని, సంకరం అయిపోయిందని బాధ పడడం మానేయండి. మీరే చెప్తారుగా 'సంకరం' వల్ల జీన్స్ మెరుగుపడతాయనీ, ఆ విషయం హైబ్రిడ్ గులాబీలు, పళ్ళు, కాయగూరలకే కాక, మనుషులకు కూడా వర్తిస్తుందనీ. మనకయితే నష్టం ఏమీ జరగలేదు. అంతా లాభమే. ఒక్కసారి ఆలోచించండి. మీరు పిజి చేస్తే, మన పిల్లలు అంతకన్నా ఎక్కువగా ఎదిగి, యూనివర్సిటి టాపర్లు అయ్యారు. కల్తీ వల్ల ప్రయోజనాలు కూడా ఉన్నాయంటూ... మీరే కొన్ని ఉదాహరణలు చెప్పారు. గుర్తు లేదా? బంగారంలో రాగి కల్తీ అనుకుంటే ఎలా? అది కలవకపోతే, బంగారానికి బలమే ఉండదు, నగలు తయారుచేయలేము అని. నవరత్నాలలో కాపర్ ఆక్సైడ్, నికెల్ ఆక్సైడ్ లాంటి మలినాలు లేకపోతే, అవి అన్నీ ఆకర్షణీయమయిన రంగులలో ఉండక, తెల్లగానే ఉంటాయనీ, తాగే నీటిలో మినరల్స్ కల్తీ అనుకుంటే, ఆ నీటికి పోషక విలువలు ఎలా వస్తాయి అనీ... ఇంకా" అనబోతుంటే, అడ్డు తగిలాడు.

"ఇంక ఆపండి మేడం. ఒప్పుకుంటున్నాను, నా అభిప్రాయం తప్పని. నాన్న గొప్పతనం గురించి తెలుసుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. చూసావా? నువ్వు రావడం వల్ల ఎంత మేలు జరిగిందో? దీనికి ప్రతిఫలంగా నువ్వు చూడకుండా వదిలేసి వచ్చిన తీర్థస్థలాలన్నీ నేనే దగ్గరుండి చూపిస్తాను" అన్నాడు భార్యను దగ్గరగా తీసుకుంటూ.

# తమసోమా జ్యోతిర్గమయా

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

డా. జడా సుబ్బారావు




స్కూలు నుంచి వచ్చి పనంతా పూర్తి చేసుకున్నాక పుస్తకాల గదిలోని బల్లమీద కూర్చొని ఏదో ఒకటి చదువుకోవడం సరస్వతికి అలవాటు. చదువుతున్నప్పుడల్లా 'పుస్తకం మనలో గడ్డకట్టిన సముద్రాల్ని గొడ్డలిలాగా పగలగొట్టాలి' అని చెప్పిన 'కాఫ్కా' గుర్తొస్తాడు. పుస్తకం దేశాభివృద్ధికి సూచిక అనీ, దేశ మనుగడ అంతా పుస్తకాలలోనే ఇమిడివుందని ఆమె నమ్ముతుంది. గోడకు వేలాడినట్టుగా చుట్టూ అరలు కట్టించి అందులో పుస్తకాలను భద్రపరిచింది.

వాటిని చూస్తున్నప్పుడల్లా తనలో పేరుకుపోతున్న అజ్ఞానమేదో అందనంత దూరం పారిపోతున్నట్లుగా అనిపిస్తుంటుంది. ఒక్కో అర ముందు నుంచొని చూస్తూ, గదిలో ఒక మూల ఏర్పాటు చేసిన నల్లబల్ల ముందు ఆగింది. ఎన్నో తరాలకు జ్ఞానాన్ని అందించినా ఏమాత్రం అలసిపోనట్లుగా ఠీవీగా కనిపిస్తున్న నల్లబల్లను ఆత్మీయంగా స్పృశించింది. రెండు పెదాలను నల్లబల్లపై ఆన్చి తృప్తిగా ముద్దాడింది. ఎంతోమంది జ్ఞానుల్ని ప్రపంచానికి అందించిన నల్లబల్ల ఆమెవైపు చూస్తూ చిర్నవ్వు నవ్వుతున్నట్లుగా అనిపించింది.

ఆమెకు తను పాఠం చెప్పిన తరగతి గది గుర్తొచ్చింది. తను వెళ్లగానే నుంచుని 'గుడ్మార్నింగ్ టీచర్' అని చెప్పే పిల్లలు గుర్తొచ్చారు. ఒకర్నొకరు నెట్టుకుంటూ అల్లరి చేసే పిల్లలు మదిలో మెదిలారు. ఎవరో మంత్రం వేసినట్టు మాయమైన ఆనాటి రోజులు, దుమ్ముతో నిండిపోయిన తరగతి గదులు, సుద్దముక్క స్పర్శలేక నిట్టూర్చుతున్న నల్లబల్లలు... గుర్తొస్తుంటే కళ్ళముందున్న అమూల్యమైన వస్తువును చూడకుండా కళ్లు మూసుకున్నట్లుగా ఉంది.

బడి అంటే... రాతిగోడల కట్టడాలు కాదనీ, రాతిగుండెల్ని కరిగించి మనిషిలో మానవత్వాన్ని చిగురింపజేసే గోపురమనీ, పేరుకుపోయిన అజ్ఞానాన్ని పారదోలే చైతన్యకెరటమని అనిపించేది. కానీ రోజురోజుకూ మారుతున్న పరిస్థితుల్ని చూస్తుంటే కళ్లముందేవో రాకాసి అలలు ఇంతెత్తున ఎగసిపడుతున్నట్లుగా, బడితోటలో బాధ్యతగా పెరగాల్సిన బాల్యమంతా నాలుగ్గోడల మధ్య నలిగిపోతుందేమోననే భయం వెన్నంతా పాకుతున్నట్లుగా అనిపించసాగింది. కొన్ని నెలల క్రితం భర్తతో జరిగిన సంభాషణ వైపు ఆమె ఆలోచనలు మళ్లాయి.

★★★

"ఏంటీ... టీచర్‌గారేదో చదువుతున్నారు?" అంటూ ఆమెను సమీపించాడు ధనకుమార్.

చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి "రేపు చెప్పవలసిన పాఠం" అంది నవ్వుతూ.

"ఇన్నేళ్లనుంచీ అదే పాఠం కదా... రోజూ చదవాలా?" అన్నాడు.

"గురువెప్పుడూ నిత్య విద్యార్థే... మర్చిపోయారా?" అంది సరస్వతి.

"అది ఒకప్పటి మాట. పిల్లలు మారతారు తప్ప పాఠాలు మారవుగా? మారని పాఠాల్ని ముందేసుకుని టైం వృథా చేసుకోవడం ఎందుకు? ఇప్పుడు రోజులు వేగంగా మారిపోతున్నాయి, పాతవిషయాలనే కొత్తగా నిర్వచించే కొలమానాలు వచ్చేశాయి. దానికణుగుణంగా మనల్ని మనం మార్చుకుంటూ ముందుకెళ్లకపోతే మనుగడ కష్టం" అన్నాడు ధనకుమార్.

"ఏది మారినా మారకున్నా... గురువెప్పుడూ గురువే! విద్యార్థెప్పుడూ విద్యార్థే! గురువు పాఠం చెప్తాడు, విద్యార్థి నేర్చుకుంటాడు" అంది.

"అది నేను కాదనడం లేదు. అంత ప్రిపేరయి చెప్పేదేముంది? నువ్వు క్లాసులోకెళ్లి ఏది చెప్తే అదే పాఠం. వినేవాడికేం తెలుస్తుంది"

"వినేవాడికి తెలియకపోయినా చెప్పేవాడికి మనస్సాక్షి ఉంటుందిగా! నెలనెలా తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయాలనుంటుందిగా! ఆత్మసాక్షికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ విద్యార్థికి అవసరమైన జ్ఞానం అందించలేనప్పుడు మన చదువులెందుకు? మోసుకు తిరుగుతున్న డిగ్రీలెందుకు?" ఏదో తెలియని కోపం కనిపించసాగింది సరస్వతి మాటల్లో.

కాసేపు మౌనం తర్వాత "రిటైరయ్యేదాకా సుద్దముక్కలా అరిగిపోవడం తప్ప టీచరు సాధించేదేముంది?" అన్నాడు ధనకుమార్.

అతని వంక జాలిగా చూసింది సరస్వతి. పాఠం చెప్పడమంటే గొంతు చించుకోవడమని, సుద్దముక్కతో రాయడమంటే మొక్కుబడి తంతనీ అనుకుంటున్న ధనకుమార్ వైపు బాధగా చూసింది. తోటలోని మొక్కలకి, తోటమాలికి ఏం సంబంధమంటే ఏం చెప్పగలదు తను? మొక్క ఏపుగా, ఆరోగ్యంగా పెరగడానికి ఎంతో శ్రమిస్తాడు తోటమాలి! తనూ అంతే. భవిష్యత్ తరాలను జ్ఞానమనే ఎరువు వేసి పెంచుతోంది. సంస్కారమనే పంటను కోయించాలని ఆరాటపడుతోంది. అది తప్పు కాదుగా!

అతని వైపు చూస్తూ "టీచరు చెప్పీ చెప్పీ అలసిపోయినా, రాసీ రాసీ అరిగిపోయినా మళ్లీ కొత్త సుద్దముక్కలా అవతరిస్తూనే ఉంటాడు. క్లాసులోని నల్లబల్ల మనలోని అంధకారానికి, అవివేకానికి సూచిక. దాన్ని సుద్దముక్కనే తెలుపుతో ప్రక్షాళన చేసేవాడే టీచరు. మనలోని అజ్ఞానం మీద వెదజల్లే జ్ఞానపు చినుకులే అక్షరాలు.." అంది.

పెద్దగా నవ్వాడు ధనకుమార్. సరస్వతి గెడ్డం పట్టుకుని ఊపుతూ "పిచ్చి సరసూ... నల్లబల్లనగానే ఎక్కడలేని ఆవేశం వస్తుంది నీకు. ఏదో చిన్నప్పుడు వేరే ఆల్టర్నేటివ్ లేదు కనుక పలకలు, నల్లబల్లలు వాడేవాళ్లం. అలాగని తరాలు మారుతున్నా వాటినే పట్టుకుని వేలాడడం నిజంగానే అజ్ఞానం. ఇప్పటికే చూద్దామన్నా పలకలు కనబడ్డం లేదు. ఇప్పుడంతా టెక్నాలజీ యుగం, అరచేతిలో భోగం. నువ్వు చూస్తూ ఉండు...ఏదో ఒకరోజు కచ్చితంగా నల్లబల్లలు కూడా కనుమరుగైపోయి డిజిటల్ క్లాసురూములో, ఆన్లైన్లో పాఠం చెప్పడమో మొదలవుతుంది. అప్పుడు ఇంట్లో కూర్చుని బోలెడు వేదాంతాలు మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

"ఇక్కడ కూడా మీ కార్పోరేట్ బుద్ధులు పోనిచ్చుకున్నారు కాదు. ఆన్లైన్ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నంత మాత్రాన అది విద్యార్థి ఎదురుగా కూర్చుని చెప్పే పాఠంతో సమానం కాదు. ఆన్లైన్ పరికరాలు ఉత్పత్తి చేసే వ్యక్తులు, చదువును వ్యాపారంగా మార్చిన వ్యక్తులు, వాళ్లిచ్చే కమీషన్లకు ఆశించే అధికార్లు, వాళ్లందరికీ కొమ్ముకాసే రాజకీయ నాయకులు, దీన్ని అడ్డం పెట్టుకుని కోట్లకు పడగలెత్తుతారేమో గానీ, ఆన్లైన్లో ఇచ్చే అసైన్మెంట్లు, స్టడీ మెటీరియల్స్, రికార్డు చేసిన వీడియోలు విద్యార్థుల్ని సంపూర్ణ పౌరులుగా తయారుచేయగలవా? ఇప్పటికే పల్లెలు పట్నాలు అని లేకుండా కార్పోరేట్, ప్రైవేటు విద్యాసంస్థలిచ్చే 'ఆకర్షణీయ వ్యాపార ప్రకటనలు' ఎక్కడపడితే అక్కడ విస్తరించి సామాన్యులను కూడా 'ఏదో ఉందనే భ్రమ'లోకి నడిపిస్తున్నాయి!" అంది సరస్వతి.

"అయితే వ్యాపారం చేయడం తప్పా?" అడిగాడు ధనకుమార్.

"చదువుతో వ్యాపారం తప్పంటున్నాను. పిల్లల్ని శారీరకంగా, మానసికంగా ఎదిగేలా చేయడానికి తోడ్పడే చదువులో కక్కుర్తి పడవద్దంటున్నాను. దానివల్ల కొన్ని తరాలు యంత్రాలుగా తయారవుతాయి. జీవితాలు యాంత్రికంగా మారుతాయి. మరో మనిషితో అవసరం లేనంత మరమనుషులుగా మారిపోతారు!" అంది సరస్వతి.

ఆమె వైపు విచిత్రంగా చూశాడు ధనకుమార్. కాసేపయ్యాక "ఇప్పుడు ప్రతీ పనికి ఇంటర్నెట్ మీదే ఆధారపడుతున్నాం. ఎంతసేపూ చేతిలో ఒక రూలుకర్రా, సుద్దముక్కా పట్టుకుని పిల్లలకు పాఠం చెప్పే పద్ధతి పోతుంది. ఎక్కడో ఖండాల అవతల ఉన్నవాళ్ళు కూడా ఇక్కడున్న వాళ్లకి చదువు చెప్పొచ్చు. అరచేతిలో ఉన్న స్వర్గాన్ని వదులుకుని, తరగతి గదుల్లోని నరకాన్ని కావాలంటున్నావు!" అన్నాడు.

ధనకుమార్ వంక కోపంగా చూసి "తరగతి గది నరకం కాదు... నవశకం! పిల్లల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుంది. 'ఐ కాంటాక్ట్' వల్ల పిల్లలతో టీచరుకి అనుబంధం పెరుగుతుంది. తననెవరో గమనిస్తున్నారనుకోవడం వల్ల అల్లరి చేయడానికి భయపడి, మంచిదారిలో నడుస్తారు. తోటిపిల్లలతో ఆటలాడడంవల్ల శారీరకంగా ఉల్లాసంగా ఉంటారు. సందేహాలొస్తే అప్పటికప్పుడు టీచర్లను అడిగి తెలుసుకుంటాడు. సమయపాలన, క్రమశిక్షణ, సామూహిక స్ఫూర్తి అలవాటవుతాయి. సమాజంతో, ప్రకృతితో అనుబంధం ఏర్పడుతుంది. ఇవన్నీ వదిలేసి ఖండాలవతల నుంచి ఎవరో గొంతు చించుకుని అరుస్తుంటే, పిల్లలు కుదురుగా కూర్చుని వినగలుగుతారా? తెలిసీ తెలియని వయసు మీద ఇంటర్నెట్ వేసే ప్రభావాన్ని దాటుకుని తమ దృష్టిని చదువు మీద లగ్నం చేయగలుగుతారా? అయినా ప్రతీ పనిలోనూ లాభాల్ని ఆశించి, తరగతి గదిని నరకంలా భావించి పైకొచ్చిన నీలాంటి వాడి నుంచి ఇంతకన్నా మంచి మాటలు ఆశించలేములే!" అంది సరస్వతి.

ఆ మాటలకు పెద్దగా నవ్విన ధనకుమార్ "నువ్వొట్టి పిచ్చిదానిలా ఉన్నావే! 'డబ్బురాని విద్య కూటికి కూడా చేటే'నని వినలేదా? డబ్బు కూడబెట్టడం ఉప్పునీటిలాంటిది. ఉప్పునీళ్ళు ఎంత తాగినా దాహం తీరదు, డబ్బు ఎంత సంపాదించినా ఆశ చావదు. కొంతమంది కూర్చున్నచోటే కూర్చొని, కుబేరులుగా మారతారు. మరికొంతమంది కాలికి బలపం కట్టుకుని తిరిగినా కడుపు నింపుకోవడానికి కూడా సంపాదించలేరు. లోకమంతే... ఏది కోరుకుంటామో అది రాదు, ఏది వద్దనుకుంటామో దానికి దగ్గరవుతాము. అయినా నువ్వు టీచరువు కాబట్టి నీకు అర్థమైంది. ఇది అర్థం కాకుండా మా మీద ఎగబడే తల్లిదండ్రులున్నంత కాలం మాకొచ్చిన నష్టమేమీ లేదు. అంతేకాదు ఇప్పుడు మూడో అల, దేశం మీద దండెత్తి మీ క్లాసురూముల్ని, నల్లబల్లల్ని, సుద్దముక్కల్ని ఆక్రమించింది. మళ్ళీ ఖండాలవతల నుంచి గొంతులు చించుకోవాల్సిందే... నాలుగ్గోడల మధ్య కంప్యూటర్లకు కళ్లప్పగించాల్సిందే!" ఆగాడు.

సరస్వతి మనసంతా దిగులుగా అయిపోయింది. చదువుకుని బిజినెస్ చేస్తున్నాడంటే ధనకుమార్ తో పెళ్ళికి ఒప్పుకుంది. నేర్చుకున్న చదువు అతనికి విలువల్ని నేర్పకపోగా విపరీతమైన వ్యాపార మెళకువల్ని నేర్పింది. కళ్లముందు 'నిలువెత్తు వ్యాపార మహావృక్షం'లాగా కనిపిస్తున్న భర్తతో వాదించడం కన్నా మౌనమే మంచిదనిపించింది.

★★★

ఒక్కొక్కటిగా మళ్ళీ బడులన్నీ మూతపడుతున్నాయి. తరగతి గదిలోని చదువంతా 'మూడడుగులు ముందుకి, ఏడడుగులు వెనక్కి' అన్నట్లుగా అయిపోయింది. ఏ మాత్రం స్వార్థం లేకుండా ఎదుటివ్యక్తి జీవితంలో జ్ఞానజ్యోతిని వెలిగించడమే ధ్యేయంగా గురువులు పాఠాలు చెప్పిన రోజులన్నీ పాతాళగంగలా అడుగంటిపోతున్నాయి. తన భర్త చెప్పినట్లు భవిష్యత్తులో ఇక క్లాసురూములు కనిపించవేమో!

కంటికి కనిపించని సూక్ష్మక్రిములు ప్రపంచం మీద దాడిచేసినప్పుడల్లా, విద్యావ్యవస్థ వికసించడం మానేసి తనలో తానే కుంచించుకుపోతుందేమో! ఉదయం వినిపించే పక్షుల కిలకిలారావాల్లా, బడికి వెళ్లగానే వినిపించే సీతాకోకచిలుకల అల్లరి ఇక వినిపించదేమో! తరగతి గదుల్ని ఆత్మీయంగా స్పృశించిన రోజులు, పిల్లలతో కలిసి ఆడిన రోజులు గేటుకు వేసిన తాళంకప్పల్లా వెక్కిరిస్తున్నాయి. తోటి పిల్లలతో ఆటలాడని బాల్యం బాల్యమేనా? కూర్చున్నచోటే ప్రపంచాన్ని పరిచయం చేసి, పిల్లల్ని గదులు

దాటకుండా చెప్పే చదువులు వాళ్లని దృఢంగా తయారుచేస్తాయా? ఆలోచనలు వికసించని గదుల్లో బందీలై మానసిక రోగులై సమస్యల్ని కూడా పరిష్కరించుకోలేక తనువు చాలించే వాళ్లని ఆపగలమా?

ఉచ్ఛ్వాస నిశ్వాసాల వేడి గాలులతో సరస్వతి దేహం నిలువెల్లా కంపించిపోసాగింది! అడుగులు బరువవుతున్నట్లు, శరీరం తేలికైపోతున్నట్లు భారంగా కళ్ళు మూతలు పడుతున్నాయి. కాలికేదో అడ్డంపడి ముందుకు పడిన సరస్వతి తనలో తనే

"దేవుడా... దేశాన్నిప్పుడు అలలు ముంచెత్తుతున్నాయి. ఆకాశాన్ని అందుకోవాలని ఆశపడే భావిభారత పౌరుల కలలన్నీ తీరం చేరకుండానే ముగిసిపోతున్నాయి. అలుముకుంటున్న చీకట్లను తొలగించి అనంత కాంతిజలపాతాల కిరణాల్ని ప్రసాదించు. అజ్ఞానతిమిరాన్ని తరిమికొట్టే విజ్ఞాన వీచికల్ని ప్రసరింపజేయి!"

అంటూ పలవరించసాగింది.

*ఓ చిన్న కథ తప్పకుండా విచిత్రాలను సృష్టిస్తుంది. ప్రపంచం చుట్టూ మిమ్మల్ని తిప్పుతుంది, లేదా మీ హృదయాన్ని ద్రవింపచేస్తుంది.*

*– నైల్ జైమాన్ (Neil Gaiman)*

# విద్యాధరి కుక్కపిల్ల

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

**చాగంటి ప్రసాద్**



డిసెంబర్ మాసం. చలికి ముసుగేసి పడుకున్న జనజీవాలు నిద్రలేవక ముందే మంచుతెరలు చీల్చుకుని పైకి వస్తున్న సూరీడు తన చేతులు చాపడానికి దారులు వెతుక్కుంటున్నాడు. కాలనీలో ఉన్న పార్కులో కొంతమంది జనం వ్యాయామాలు చేస్తుంటే, మరికొందరు జనం మరిచిపోయిన నవ్వును ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.

యోగా చేసి విశ్రాంతి తీసుకుంటున్న కొంతమంది మహిళలు పిచ్చాపాటి మొదలు పెట్టారు.

"జ్యోతిగారు! మన మహిళా ధీశక్తి వాట్సాప్ గ్రూపులో ఈ రోజు ప్రభాతవిశేషాలేంటి? ఫోన్ ఇంట్లో వదిలేసివచ్చాను" అడిగింది శారద.

"నేనుకూడా చూడలేదు. ఉండండి, ఇప్పుడే చూస్తా" అంటూ వాట్సప్ ఓపెన్ చేసింది జ్యోతి.

గ్రూపు ఎడ్మిన్ విద్యాధరి నుంచి వచ్చిన మెసేజ్ కనపడింది.

"మా 'మిల్లీ' మిస్సయిపోయింది. ఇంటిల్లిపాది బెంగగా ఉన్నాము. ఎవరికైనా కనబడితే వెంటనే తెలపండి. మా అబ్బాయి రాహుల్ అది మిస్సైన క్షణం నుంచీ తిండీ తిప్పలు మానేసాడు. వాడు ఏమైపోతాడో అని ఆందోళనగా ఉంది." అంటూ కన్నీళ్ళ 'ఎమోజీలు' పెట్టి ఉన్నాయి.

వరసగా ఆ గ్రూప్ సభ్యులు బాధపడుతూ పెడుతున్న మెసేజెస్‌తో మొబైల్ నిండిపోతోంది వేగంగా.

"తప్పకుండా వెతుకుతాం. మన కిట్టీ పార్టీలో చూసిన ఆ బుజ్జిముండేనా? అయ్యో మీకు అన్నం కూడా సయించదు పాపం" అంటూ గట్లు తెగిన మూసీలా సంతాపం తెలియజేసే విచారగ్రస్తమైన ప్రతిస్పందనలతో ప్రవహిస్తోంది గ్రూప్.

“విద్యాధరి మేడమ్ కుక్కపిల్ల తప్పిపోయిందట పాపం. ఆవిడ చాలా బెంగపెట్టుకున్నారు”....అంటూ హడావిడిగా లేచింది జ్యోతి.

“అరెరె! మిల్లీ ఎంత మంచిదండి పాపం! మేడమ్ చాలా అప్‌సెట్ అయ్యుంటారు కదా? మనం వెళ్ళి ధైర్యం చెప్దాం వస్తారా?” అడిగింది శారద.

“వస్తాను. మా ఆయన్ని ఆఫీసుకి, పిల్లాణ్ణి స్కూలుకీ పంపించేసి, గంటలో మీ ఇంటికి వస్తాను” ఇద్దరూ లేచారు.

★★★

రేపు పెందరాళే లేపమ్మా. ఆఫీసులో చాలా పని ఉంది. త్వరగా వెళ్ళాలి ” అంటూ నిద్రకు ఉపక్రమించింది దివ్య.

“అలాగేనమ్మా. మీ కంపెనీ ఓనర్‌గారు అప్పుకింద పదివేలు ఇస్తారేమో అడగమ్మా! నాన్నకి డయాలిసిస్ చేయించాలి” అంది పార్వతి.

“లేదమ్మా ఇవ్వరు. ఆయన చాలా స్ట్రిక్టు. ఎవ్వరికి అప్పులూ, ఎడ్వాన్సులూ ఇవ్వవద్దని మొన్న ఆఫీసులో సర్క్యులర్ రిలీజు చేసారు” బాధగా చెప్పింది. తల్లి మోహంలో విచారం చూసి, “రేపటినుంచి ఓవర్ టైము చేస్తానమా. రాత్రుళ్ళు రావడం కాస్త లేటవుతుంది, కంగారు పడకు. కానీ డబ్బులు ఎక్కువ వస్తాయి. పదిహేను రోజులకు ఒకసారి అక్కౌంట్‌లో వేసేస్తారు. దానితో నాన్నకి వైద్యం చేయిద్దాం!” ధైర్యం చెప్పింది.

“ఆడపిల్లవి. అన్నీ నీ మీద భారం మోపుతున్నాం. నాన్నకి ఈ సమస్య రాకపోతే నీకు పై చదువులు చెప్పించేవారు. ప్చ్... మన జీవితాలొక్కసారిగా గతితప్పాయి” బాధగా అంది పార్వతి.

“నేను కాస్త నిలదొక్కుకున్నాక తమ్ముడికి పైచదువులు చెప్పిద్దాం, బెంగపెట్టుకోకు. అన్నీ సర్దుకుంటాయి” అంటూ వాతావరణం తేలిక పరచడానికి ప్రయత్నం చేసింది.

“సర్లే పడుకో” అంటూ పార్వతి దుప్పటి కప్పి, లైటు ఆర్పి, వంటింట్లోకి వెళ్లింది.

తండ్రి వైద్యానికి డబ్బులు ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది దివ్య.

పక్క గదిలో మంచం మీద నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతున్న సత్యం, తల్లి కూతుర్ల మాటలు విని, చదువుకోవలసిన వయసులో తన కోసం కూతుర్ని కష్టపెడుతన్నాననే బాధతో వదిలిన కన్నీటిచుక్క జారి తలగడలో ఇంకిపోయింది. సొంత వూర్లో వ్యవసాయం గిట్టుబాటు అవ్వక, తాను నమ్ముకున్న భూమిని తెగ నమ్ముకుని వ్యాపారం చేద్దామని నగరం చేరాడు. ఇక్కడికి వచ్చేక అనారోగ్యం పాలయ్యాడు.

సొంతవూరు వదిలి నగరం చేరిన ఆ కుటుంబానికి ఇక్కడ దగ్గర బంధువులూ, తెలిసినవారూ ఎవ్వరూ లేరు. వాళ్ళకి వాళ్లే ఆసరా, వాళ్ళకి వాళ్ళే ధైర్యం, ఆలంబన. దివ్య చేసే చిన్న వుద్యోగమే వాళ్ళకి ఆసరా. అద్దె ఎక్కువైనా, ఆఫీసుకి కాస్త దగ్గర అని, ఈ కాలనీలో ఒక చిన్న ఇంట్లోకి అద్దెకు దిగారు. డబ్బూ, హోదా గల వాళ్ళతోనే పరిచయాలకు ఇష్టపడే నగర నాగరికులకు వీరి ఉనికి అవసరం లేదు.

★★★

విద్యాధరి ఖరీదైన కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకోవడం చూసిన గ్రూప్ సభ్యులు “ఏడవకండి మేడమ్! మన మిల్లీ తప్పక దొరుకుతుంది” అంటూ ఆ కష్టం తమ కుటుంబానికే వచ్చినంతగా కన్నీరు కారుస్తున్నారు. అప్పుడే ఆమె సౌధంలో అడుగుపెట్టి, విషయం తెలుసుకున్న సి ఐ శంకరయ్య ...

‘‘కాలనీ అంతా మిల్లీమీటర్, మిల్లీమీటర్ లెక్కన గాలించి మన మిల్లీని మీకు చేర్చే బాధ్యత మాది. అక్కడా దొరక్కపోతే, నగరమంతా గాలించి పట్టుకొస్తాం మేడమ్!”, హామీ ఇచ్చాడు.

"చూడు శంకరయ్యా మిల్లీ చాలా ఖరీదైన అరుదైన జాతి కుక్కపిల్ల. క్రిందటిసారి యూరప్ ట్రిప్ వెళ్ళినప్పుడు, మా రాహుల్‌కి బర్త్‌డే గిఫ్ట్‌గా కొని ఇచ్చాము. తప్పిపోయి అప్పుడే ఇరవై నాలుగు గంటలైంది" అంటూ విద్యాధరి అతని కేసి తీక్షణంగా చూసింది..

ఆమె చూపుకి భయపడి, "అయ్యో మేడమ్ మీ కుక్కపిల్లను వెతికి పట్టుకోపోతే ఎస్.పి. దొరవారి ముందు నిలబడగలమా? రాత్రికల్ల మన `మిల్లీ' మీ ముందుంటుంది మేడం." అని భరోసా ఇచ్చాడు. అతనితో వచ్చిన కానిస్టేబుల్‌తో "యాదగిరీ, ముందు నువ్వు స్టేషన్‌లో ఉన్నందరిని తీసుకుపోయి కాలనీ మొత్తం గాలించు. ఇక్కడ దొరక్కపోతే కాలనీ బయటకూడా చూడండి. ఏ సంగతీ నాకు వెంటనే ఫోన్ చెయ్యి." అంటూ హుకుం జారిచేసి, ఆమెకు సలాంలు కొడుతూ జీపు ఎక్కి 'ఈవిడ కుక్కపిల్ల దొరక్కపోతే నా ఉద్యోగానికి ముప్పు వచ్చేలా ఉన్నట్టుంది' అని గొణుక్కుంటుంటే, ఫోన్ మ్రోగింది.

★★★

విద్యాధరి ఆ కాలనీలో మకుటం లేని మహారాణి. ఆమె తండ్రి నలభైఏళ్ళు రాజకీయాల్లో ఎన్నో పదవులు వెలగబెట్టి, ఆ రాజకీయ వారసత్వాన్ని తన ఏకైకపుత్రిక విద్యాధరికిచ్చి శాశ్వతంగా గోడమీద దండ వెనుక విశ్రాంతి తీసుకుంటున్నాడు. జనం ఎల్లప్పుడూ తనతో ఉండడానికి వారితో మమేకమైనట్టు నటిస్తుంది. తను చేసే అభివృద్ధి పనుల కన్న, జనంతో మాటామంతి, సహపంక్తి భోజనాలు చేయడం, పండగ సంబరాల్లో పాల్గొనడం, కాస్త ఎగువ మధ్యతరగతి మహిళలతో కిట్టీపార్టీలు ఏర్పాటు చేయడం ఎక్కువ ఫలితాలిస్తాయని ఆమె రాజకీయ బుర్రకి బాగా తెలుసు.

'మహిళా ధీశక్తి' అన్న క్రియాశీలక గ్రూపు ఏర్పాటు చేసి, దాని ద్వారా తన పేరు ప్రాచుర్యంలో ఉండేలా కార్యక్రమాలు చేపడుతూ, ఓటు బ్యాంకు పదిలంగా కాపాడుకుంటుంది. ఇప్పుడు ఆమెకు వచ్చిన కష్టం కాలనీ కష్టం. పారిపోయిన కుక్కపిల్ల విద్యాధరి ఇంట్లొ సభ్యురాలు మాత్రమే కాదు... కాలనీవాసుల కన్నబిడ్డ క్రింద లెక్క. అందరూ కన్నీరు మున్నీరయ్యారు. మిల్లీ దొరికేదాకా పచ్చిగంగైనా ముట్టమని ఒట్టేసుకున్నారు. భర్తలని, పిల్లలని వెంటేసుకుని కుక్కపిల్లని వెతకడానికి బయలుదేరారు.

★★★

చీకటి చిక్కగా మారింది. ఆకాశంలో నల్లమబ్బొకటి జాబిల్లిని మ్రింగేసింది.. చలిగాలుల ధాటికి జనం బయటకు రావడానికి భయపడుతున్నారు.. ఓవర్ టైము పనితో దివ్య రావడం ఆలస్యం అవుతుందని చెప్పడం వలన, భర్తకి, కొడుక్కి అన్నం పెట్టి, తను కాస్త కతికింది. నెత్తిమీద చీరకొంగు కప్పుకుని చలికి వణుకుతూ, ఆరుబయట గుమ్మం ముందు కూతురు కోసం ఎదురుచూస్తూ కూర్చుంది పార్వతి. మెట్రోరైలు టైమింగ్స్ అయిపోవచ్చాయి. కూతురు వస్తున్న దాఖలాలు ఏమీ కనబడ్డంలేదు. దివ్య మెట్రోరైలు దిగి, అక్కడ నుంచి నడుచుకుంటూ ఇంటికి వస్తుంది. మరీ ఆలస్యం అయితే ఆటోలో వచ్చేయమని పార్వతి ఎన్నోసార్లు చెప్పింది కూతురికి.

"ఎందుకులే అమ్మా! నడిస్తే ఒళ్ళు తగ్గుతుంది. కాస్త ఎక్సర్సైజు చేసినట్టుంటుంది!" అంటుందెప్పుడు, ఆ ఆటో ఖర్చు తమ్ముడి పుస్తకాలకి పనికొస్తుందన్న ఆలోచనతో..!

"కంగారు పడకు! నన్ను ఎవ్వరూ ఏమి చేయరు. అందగత్తెను కాదు కదా!" అప్పడప్పుడు కూతురి మాటలు వింటుంటే, తల్లి మనసు గిలగిల లాడేది।

"ఛ...నువ్వు బంగారానివే! నిన్ను చేసుకోబోయేవాడు అదృష్టవంతుడురా!" అని దగ్గరకు తీసుకున్న క్షణాలు జ్ఞాపకం వచ్చాయి పార్వతికి. కాలనీమధ్య పార్కులో ఉన్న క్లాక్‌టవర్ గడియారం ఠంగ్ ఠంగ్ మని పదకొండు గంటలు కొట్టింది.

పదకొండు గంటలు లెక్కపెట్టిన పార్వతి అమ్మో చాలా ఆలస్యం అయ్యింది. దివ్య ఇంకా రాలేదని అనుకుంటూ కంగారుగా ఫోన్ చేసింది. స్విచ్ఆఫ్ వచ్చింది. కాలూచెయ్యి ఆడలేదు ఆమెకి. ఎవర్నయినా సాయం అడుగుదామంటే, అందరూ నిద్ర పోయే టైము. ఏం తోచక కూలబడింది అక్కడే.

కాలనీలో ఉండుండి కుయ్‌కుయ్ మంటూ పోలీస్‌జీప్ హారన్ వినబడుతోంది. ఆ శబ్దం వినగానే దివ్య గురించి పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ ఇస్తే?....అన్న ఆలోచన వచ్చింది. ఆలస్యం అవుతుందని చెప్పాను కదమ్మా! అంటూ దివ్య మాటలు గుర్తుకువచ్చి,

కూతురు కోప్పడుతుందేమోనని ఆ ఆలోచనని మనసులోనే అణిచేసుకుని అక్కడే కూర్చుండిపోయింది.

"వచ్చేస్తుంది, ఓవర్ టైము చేస్తానంది కదా, ఆలస్యం అయ్యుంటుంది!" మనసు సమాధానపరుచుకుంది.

ఇంతలో కరెంట్ పోయింది. ధరిత్రిని రాత్రి నల్లదుప్పటిలా పూర్తిగా కప్పేసింది. పార్వతి ఇంట్లోకి వెళ్ళి కొవ్వొత్తి వెలిగించింది.

"అమ్మాయి ఇంకా రాలేదా?" సత్యం కంగారుపడుతూ మంచం మీద నుంచి లేచే ప్రయత్నం చేసాడు.

"ఇవ్వాళ ఆలస్యం అవుతుందని చెప్పింది. కంగారు పడకండి. పడుకోండి!" భర్తకి సర్ది చెప్పింది.

మళ్ళీ క్లాక్‌టవర్ గడియారం పన్నెండు గంటలు కొట్టిన శబ్దాలు పార్వతి గుండెల మీద సమ్మెట దెబ్బల్లా అనిపించాయి. ఇంక ఆగలేక. ఈ మధ్యే పరిచయం అయిన పక్కింటి జ్యోతి ఇంటి గేటు తీసి కాలింగ్‌బెల్ కొట్టింది. రెండుమూడు సార్లు కొట్టాక తలుపు తెరిచిన జ్యోతి. తాళం వేసిన కటకటాల వెనకాల నుంచి.....

"ఎవరూ? అంది విసుగ్గా

"నేను మీ పక్క ఇంటి పార్వతిని! మా అమ్మాయి దివ్య పొద్దున్న ఆఫీసుకు వెళ్ళి ఇంతవరకు రాలేదు. చాలా కంగారుగా ఉంది. ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. దయుంచి కాస్త మీ వారిని లేపగలరా? దివ్య ఆఫీసు గచ్చిబౌలిలో ఉంది." కంగారుపడుతూ చెప్పింది.

"ఇప్పటి వరకు మేడమ్ విద్యాధరిగారి కుక్కపిల్లని వెతికి అలసిపోయి పడుకున్నాము. మా ఆయన నిద్ర మధ్యలో లేపితే కోప్పడతారు!" అంటూ నసిగింది.

"వచ్చేస్తుందిలే. కంగారుపడకు. ఇంత రాత్రి వరకు ఆడపిల్లని ఉద్యోగం చేయించడం ఎందుకు? రోజులసలే బావోలేవు కదమ్మా. ఉండు మా వాట్సప్ గ్రూపులో పెడతాను. ఎవరైనా సాయం వస్తారేమో?" అంటూ మొబైల్లో మెసేజ్ పెట్టింది.

"ఖరీదైన కుక్కపిల్ల కోసం నేను అల్లాడి పోతుంటే, అడ్డమైన న్యూస్‌లు పెడతావేంటి జ్యోతి? మన గ్రూప్ పర్పస్ డిఫీట్ చేయకు" హఠాత్తుగా విద్యాదరి నుంచి వచ్చిన రిప్లై మెసేజి చూసిన జ్యోతి కంగారు పడి మెసేజి డిలిట్ చేసింది. పార్వతికి సర్ది చెప్తూ. పోనీ పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ చేస్తే... అనే లోపున, పార్వతి ఇంక ఆగలేక మరో ఇంటికి వెళ్ళి తలుపు తట్టింది. ఎవ్వరూ తలుపు తీయలేదు. రెండు మూడు ఇళ్ళకి వెళ్లింది. ఆమె ఎవరో తెలియక ఎవరూ సాయం చేయడానికి ముందుకు రాలేదు.

దివ్య వస్తోందేమోనని వీధి చివర వరకు పిచ్చెత్తిన దానిలా చూసుకుంటూ రెండు మూడు సార్లు వెళ్ళి వెనక్కి తిరిగి వచ్చింది. అంత చలిలోను తలలోంచి చెమట ధారాపాతంలా కారి, కంటి నుండి ప్రవహిస్తున్న నీటి చెలమలతో సంగమిస్తోంది. ఏం చెయ్యాలో తోచక మళ్ళీ ఇంటికి పరుగెత్తింది. తన పరిస్థితి బావున్నప్పుడు ఇంట్లో పనిచేసిన అమ్మాయి భర్త హోమ్‌గార్డు రాములు, ఏమైన సాయం చేయగలడేమో అని ఆమెకు ఫోన్ చేసింది.

"కంగారు పడకండమ్మా, మా ఆయన్ని పంపిస్తున్నాను!" ధైర్యం చెప్పిందామె. ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళారు. ఈ లోపు రాములు ఫోన్లో తనకి తెలిసిన హోమ్‌గార్డులకి ఫోన్ చేసి వివరాలు చెప్పి, దివ్య ఆఫీసుకి పంపించాడు. అక్కడనుండి సమాధానం రావడానికి గంట పట్టింది. అప్పటి వరకు మనసులో ముసురుకున్న చెడు ఆలోచనల భయంతో నరకం అనుభవించింది పార్వతి.

దివ్య ఆఫీసు నుండి ఎనిమిది గంటలకే బయలుదేరిందని సమాచారం వచ్చింది. ఎనిమిదింటికి బయలుదేరిన ఆడకూతురు పన్నెండు గంటల వరకు రాలేదంటే ... ఇంక పార్వతికి దుఖం ఆగలేదు. పోలీసు స్టేషన్‌లోనే భోరుమంది.

"నా చిట్టితల్లికి ఏమైంది? ఎక్కడుందో ఏ కష్టాలు పడుతోందో అయ్యా పోలీసయ్య! నీ కాళ్ళు మొక్కుతా. నాబిడ్డ ఎక్కడుందో కనిపెట్టండయ్యా" అంటూ రైటర్ విశ్వం కాళ్ళ మీద పడబోయింది.

అతను ఆమె దుఖాన్ని చూసి విచలితుడై "నీ బిడ్డని వెతకడానికి పంపుదామంటే స్టేషన్‌లో కానిస్టేబుల్స్ అందరు మేడం విద్యాధరిగారి కుక్కపిల్లని వెతకడానికి వెళ్ళిపోయారమ్మా!" అంటూ మాటల్లోనే సి.ఐ. శంకరయ్యకి ఫోను చేసాడు. ఫోను ఎత్తిన శంకరయ్యకు దివ్య విషయం చెప్పాడు.

"ఏంటి గోల విశ్వం. అసలేనేను విద్యా మేడం కుక్కపిల్ల దొరక్క పరేషాన్ అవుతుంటే మధ్యలో నీ లొల్లి ఏంటి? కాసేపు ఉండమను!" అని ఫోను పెట్టేసాడు.

"కాసేపు ఇంటికాడ ఉండి ఎదురు చూడమ్మా. బిడ్డ తిరిగి వస్తుందేమో!" సర్ది చెప్పి పంపించేసాడు విశ్వం.

నిస్సత్తువుగా ఇంటికొచ్చిన పార్వతి భర్తకి నెమ్మదిగా విషయం చెప్పింది. సత్యం తల బాదుకుని ఏడ్చాడు. నేను బ్రతికి ఉండి ప్రయోజనం లేదంటూ వాపోయాడు. శ్రీను తన అక్కయ్యకి ఏమవ్వకూడదని దేముణ్ణి ప్రార్థించాడు.

పార్వతి గుండెల్ని ఉగ్గపెట్టుకుని దివ్య కోసం ఇంటి బయట పిచ్చిదాన్లా ఎదురు చూస్తోంది. ఆమె సుఖంగా తిరిగి వస్తుందనే ఆశ పెనుగాలికి రెపరెపలాడే దీపంలా కొట్టుమిట్టాడుతోంది. కూతురు దొరికిందనే వార్త తప్ప, మరో వార్త అంగీకరించడానికి మనస్సు అంగీకరించడం లేదు.

★★★

కుక్కపిల్ల దొరకలేదనే ఆందోళనతో ఇంటిముందు లాన్లో ఆందోళనగా పచార్లు చేస్తున్న విద్యాధరికి జుట్టు రేగిపోయి, నలిగిపో–యిన చీరలో, గుండెల్లో బాధని, కళ్ళల్లో కన్నీటి కడవల్ని భారంగా మోసుకొస్తూ, గేటు తీసుకుని లాన్లోకి వచ్చిన పార్వతిని చూసింది. చిరాగ్గా మొహం పెట్టి "చెయ్యి ఖాళీ లేదు!" అంది.

"అయ్యో అడుక్కునేదాన్ని కాదమ్మా. ఆడపిల్ల తల్లిని. నా కూతురు దివ్య నిన్న రాత్రినుంచి ఇంటికి రాలేదమ్మా. ఈ కాలనీకి కొత్తగా వచ్చాము, మీరు సాయం చేస్తారని తెలిసి వచ్చాను. కాస్త పోలీసులతో మా అమ్మాయిని వెతకమని చెప్పమ్మా. వాళ్ళు పట్టించుకో–వడం లేదు!" గద్గద స్వరంతో ప్రాధేయపడింది. గ్రూపులో జ్యోతి పెట్టిన మేసేజి జ్ఞాపకం వచ్చింది విద్యాధరికి.

"అయ్యో! కంగారుపడకమ్మా. పోలీసులకు ఇతర కేసులు వుంటాయి కదా. కాసేపు వేచి చూడు. ఈరోజుల్లో ఆడపిల్లలు చాల ధైర్యవంతులు. ఏం ఫర్వాలేదు. మీ అమ్మాయి క్షేమంగా ఇంటికి వచ్చేస్తుంది" అని నమ్మ బలికి పార్వతిని ఇంటికి పంపించేసింది.

★★★

రాత్రంతా కుక్కపిల్ల కోసం కాలని అంతా వెతికిన పోలీసులు తెలతెలవారుతుండగా కాలనీ చివర ఉన్న డంప్‌యార్డ్ లోపలి వెళ్ళారు. అక్కడక్కడ ఊరకుక్కల మొరుగులు వినబడుతున్నాయి. కానిస్టేబుల్స్ నలుగురు గబగబ చీకట్లో బ్యాట్రీ లైట్లు వేసుకుంటు నడు–చుకుంటూ వెళ్ళారు. కొండంత ఎత్తున పేరుకుపోయిన చెత్త వెనకాల నుంచి పోలీసులని చూసిన దివ్య తన నోటిలో గుడ్డలు కుక్కి పాశవికంగా ఆక్రమించిన మృగాళ్ళనుంచి విడిపించుకోవడానికి పెనుగులాడుతోంది. గట్టిగా అరిచి తన ఉనికిని తెలియజేయ–డానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. ఒక పక్క డస్సిపోయి, స్పృహ కోల్పోతున్నా బలవంతాన తెలివి తెచ్చుకుని అరవడానికి ప్రయత్ని–స్తోంది. ఆమె సన్నని మూలుగులు ఊర కుక్కల అరుపుల్లో మృగ్యమవుతున్నాయి. ఆ పక్కకి దగ్గరగా వెళ్ళిన కానిస్టేబుల్స్ ముందుకు అడుగు వేసే తరుణంలో, మరో వైపునుండి కుయ్‌కుయ్ మన్న కుక్కపిల్ల ఏడుపు వినబడింది.

అందరి దృష్టి అటువైపు మళ్ళింది. ఊరకుక్కల దాడిలో పోరాడి అలసిపోయి కొనఊపిరితో ఉన్న విద్యాధరి మేడమ్‌గారి కుక్కపిల్ల దొరికింది. ఊరకుక్కల్ని తోలేసి దాన్ని అపురూపంగా పట్టుకుని ఆఘమేఘాల మీద ఆ వార్త అమ్మగారికి చేరవేయడానికి వెనుదిరి–గిన రక్షకభట పటాలంను చూసిన దివ్య నిరాశగా కంట కన్నీటి చుక్క వదిలింది. అది అవని మీద పడి ఇంకిపోయింది. కళ్ళు మూసింది శాశ్వతంగా.

మిల్లీకి హుటాహుటిని వెటర్నరీ డాక్టర్లు ట్రీట్మెంట్ మొదలుపెట్టారు. కాలనీ అంతా ఊపిరి పీల్చుకుంది. కుక్కపిల్ల దొరికిందన్న వార్త కాలని అంతా వ్యాపించింది. పార్వతి ఇంటిముందున్న కాసిని జనం కూడా విద్యాధరి ఇంటికి పరుగెత్తారు. కూతురి జాడ తెలియక ఏడుస్తూ పార్వతి మళ్ళీ పోలీసుస్టేషన్‌కి వెళ్ళింది రాములుతో. చివరకు పోలీసు యంత్రాంగం వెతుకులాట ప్రారంభించింది. ఉదయించిన సూర్యుడు కూడా తన కిరణాలతో వెతికి డంప్‌యార్డ్‌లో పడిఉన్న ఛిద్రమైన దివ్య శరీరాన్ని కనిపె–ట్టి, వెలుగులోకి తీసుకువచ్చాడు. గుండెలవిసిపోయేలా ఏడుస్తున్న దివ్య కుటుంబాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. ఎందుకంటే ఖరీదైన ఉత్తమ జాతి కుక్కపిల్ల అంతకు ముందే దొరికింది కదా!

# అత్తయ్య చీర

గొర్తి వాణి శ్రీనివాస్

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022



రాత్రి అమ్మ ఫోన్‌చేసి "రేపు దీపావళి పండగ. అత్తయ్యకి కొత్త చీర కొనడం మాత్రం మర్చిపోకు!" అంది. అత్తయ్య మా జ్ఞాపకంగా మారి పదేళ్ళయింది. మావయ్యకి ఇష్టంలేని పెళ్లి చేశారుట. దాని పర్యవసానం పాతికేళ్లకే నుదిటి బొట్టు కోల్పోయి ఒంటరిగా మిగిలింది. మిగిలిన జీవితాన్ని పుట్టింటివాళ్ళ సేవకు అంకితం చేసింది. నేను కడుపులో వున్నప్పుడు అమ్మని కాలు కిందపెట్టకుండా చూసుకుందిట. అమ్మకి ఆ కృతజ్ఞత ఉంది. అత్తయ్య ఒక అమావాస్య రోజు కన్నుమూసింది.

ప్రతి సంవత్సరం ఆవిడ జ్ఞాపకార్ధం ఏదో ఒక పుణ్యకార్యం చేస్తూ ఉంటుంది అమ్మ. ఈ సంవత్సరం అక్క పురిటికోసమని అమెరికా వెళ్ళటంవల్ల ఆపని నాకప్పగించింది. ఒక కాటన్ చీర, జాకెట్టు కొనుక్కుని బండిమీద ఊరంతా తిరిగి వెతికినా, అత్తయ్య పోలికల్లో వున్న బీదరాలు నాకెక్కడా కనపడలేదు. చీర ఇస్తేగానీ టిఫిన్ తినొద్దని చెప్పింది అమ్మ. ఆకలేస్తోంటే టిఫిన్స్‌ని గుర్తుతెచ్చుకుంటూ అటుగా చూసాను.

కాలువ గట్టు. పక్కన ఉన్న ఖాళీ జాగాలో ఒక చెక్క బడ్డీకొట్టు ఉంది. దాని ముందు ఓ ముసలావిడ కూర్చుని ఉంది. వెంటనే నాకు ప్రాణం లేచొచ్చింది. ఆవిడ దగ్గర కెళ్లి చీర చూపించి 'ఇందా తీసుకో' అన్నాను.

అయోమయంగా చూసింది. ఏం చెప్పి ఇవ్వాలో నాకర్ధం కాలేదు. ఇలాంటివన్నీ నాకు కొత్త. మళ్లీ చీర చూపించి 'తీసుకో' అన్నాను. ఆవిడ తీసుకుంది.

"నువ్వే కట్టుకో ఎవరికీ ఇవ్వకు" అన్నాను.

ఇక నేనొచ్చిన పని అయ్యిందన్నట్టుగా ఆవిడకి చీర ఇస్తున్నట్టు ఫోటో తీసుకుని అమ్మకి పంపించాను. ఇక అక్కడితో నా పనైపోయిందని ఇంటికెళ్లిపోయాను.

రెండ్రోజుల తర్వాత నేను అటుగా వెళుతూ బడ్డీకొట్టువైపు చూశాను. ముసలమ్మ పాత ముతక చీర కట్టుకుని కూర్చుంది. కానీ నేనిచ్చిన చీర ఆ పక్కనే కొబ్బరి బొండాలు అమ్మే అమ్మాయి కట్టుకుని కనబడింది.

“నేనిచ్చిన చీర నీకు నచ్చలేదా? ఆ అమ్మాయికిచ్చేసావే?” అన్నాను. అసలు నాకనవసరమైన విషయమే కానీ అత్తయ్య మనసులో మెదిలేసరికి వుండబట్టలేక.

“అదా! అల్లప్పుడు కరోనా వచ్చినపుడు ఆయమ్మి రేషన్‌బియ్యం, కూరలు ఇచ్చి నాకెంతో సాయం చేసినాది. తిరిగి నేనేం ఇవ్వలేకపోయా. మీరిచ్చిన చీర చూపిస్తే చక్కగుందని మెచ్చుకుంది. అందుకే కట్టుకోమని ఇచ్చాను బాబూ” అంది. ఆమెను చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది.

మన దగ్గర ఉండగానే సరికాదు. ఉన్నదాంట్లో ఇతరులకు సాయం చేసే గుణం కూడా ఉండాలి. “మంచిదానివే, నీకేమన్నా సహాయం కావాలంటే నాతో చెప్పు. కరోనా టైంలో మేమందరం దుప్పట్లు, దోమతెరలు, మాస్కులు, మందులు పంచిపెట్టాం. అలాంటిదేదన్నా కావాలంటే చెప్పు చేస్తాను” అన్నాన్నేను.

“నాకు రేషన్‌బియ్యం ఇవ్వట్లేదు బాబూ! నా వేలిముద్ర పడట్లేదని నాకిచ్చే బియ్యం ఎగ్గొట్టారు. ముసల్దాని వేళ్ళకి గీతలు ఎలా ఉంటాయి .. అరిగిపోవా! ఆ విషయం మిషనుకి ఎలా తెలుస్తుంది. మనిశెల్లి అడిగినా వల్లకాదంటన్నారు. ఎదురుగా ఉన్న మనిషిని నమ్మకున్నారు. మిషన్ మీద నమ్మకం పెట్టుకుంటున్నారు. పైన రేకులు కన్నాలు పడి వర్షానికి కారుతున్నాయి. రాత్రంతా చలికి వొణికి పోతున్నాను. వీలైతే ఏదన్నా సినిమావో, పార్టీల పోస్టర్లో దొరికితే ఇప్పించండి బాబూ. పైన కప్పించుకుంటాను.”

తన కష్టాన్ని దాచుకోవడం కష్టంగా ఉన్నట్టుంది. అడగంగానే చెప్పేసింది. ముసలమ్మ బడ్డీ పక్కన టీ కొట్టు. దాని ముందు బల్లమీద టీకోసం వచ్చినవాళ్ళు ఆమె మాటలు విని నవ్వుతున్నారు. “మీరడగాలే గానీ అవసరాల మూట ఠక్కున విప్పుతుంది. ఆయన్నీ తీర్చాలంటే ఆ దేవుడే దిగిరావాలి” అన్నారు వాళ్ళు.

‘ఈ మాత్రం దానికి దేవుడు దిగిరావాలా? ఆవిడ అడిగింది ఇంటి పైకప్పు, తిండి గింజలు. అంతేగా!’ అనుకున్నాను. నాకు ఉద్యోగం వచ్చిన ఈ ఆరునెలల్లో వచ్చిన జీతం మొత్తం నా అవసరాలకని, ఆనందాలకనీ ఖర్చు చేశాను. అవన్నీ పిచ్చి ఖర్చులే.

‘మొదటిసారిగా ఓ మంచి పని చేద్దాం’ అనిపించింది. అనిపించిందే తడవుగా, ‘పోస్టర్లేం ఖర్మ.. సిమెంటు రేకులే వేయిస్తాను. నీకిక చలీ గిలీ ఏం వుండవు!” అన్నాను ధీమాగా.

ఆ మాటకి టీకొట్టు వాడు నన్ను కొట్టేట్టు చూసాడు “ఏంటి నువ్వు యేసేది. ఆకులో సున్నం! రోడ్డు పక్కన బడ్డీ ఏసుకోడమే తప్పు. అలాంటిది పైరేకులు వేసి ఏ సీ కూడా బిగిస్తావా బాబూ? ఈ స్థలం ఎవడి బాబుగాడి సొమ్మని. ఎవరికివాళ్ళు దిట్టంగా ఇళ్లేసుకుని దిండేసుకుని పడుకుంటే చూస్తూ ఊరుకోడానికి మునిసిపాలిటీ వాళ్ళు పిచ్చోల్లా. ఏదో ముసల్ది కదాని నాలుగు చెక్కముక్కలు పాతి రేకేసి ఇచ్చింది మేము! నువ్వెక్కడినుంచొచ్చావసలు?” అంటూ బిగ్గరగా అరిచాడు టీకొట్టతను! వాడెందుకు ఇంతలా అరుస్తున్నాడో నాకర్థం కాలేదు.

“మరి నువ్వు పెట్టుకున్న కొట్టు స్థలం నీ సొంతమా? నువ్వూ ఆక్రమించుకుని వేసుకున్నదేగా? నువ్వయితే కొట్టు పెట్టుకుని వ్యాపారం చేసుకోవచ్చుగానీ ఈమె మాత్రం వుండకూడదా? అంతగా రోడ్డుకి ఏదన్నా ఇబ్బందయితే మునిసిపాలిటీ వాళ్ళు చూసుకుంటారు నీకేం బాధ” అన్నాన్నేను.

మా ఇద్దరి వాదనకీ కొద్దిమంది జనం గుమిగూడారు. అతను స్థానబలాన్ని చూసుకుని నామీద అరుస్తూ రెచ్చిపోయాడు. కొంతమంది అతనికి మద్దతుగా వచ్చారు.

“తెల్లారికల్లా ముసలమ్మ బడ్డీ ఇక్కడ లేకుండా చేస్తాం. దిక్కున్నచోట చెప్పుకో!” అన్నారు. ‘వీళ్ళన్నంత పనీ చేస్తారా? ముసలమ్మకి నిలవనీడ లేకుండా చేస్తారా? మంచికి పోతే చెడు ఎదురైనట్టు అలా చేస్తే ముసలమ్మ కష్టాలకు కారకుడిని నేనే అవుతాను’ అనుకుని నేనే కాస్త వెనక్కి తగ్గాను.

అప్పటికి ఆ గొడవ సర్దుమణిగింది. ఇంటికొచ్చినా.. అది నా మనసుని తొలుస్తూనే ఉంది. మర్నాడు నా ఫ్రెండ్స్‌ని కలిసి ఆ విషయం చెప్పాను. గడ్డ పక్కనున్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి లోకనాథం అనే కాంట్రాక్టర్ ట్రై చేస్తున్నాడని చెప్పారు వాళ్ళు. గడ్డ పొడవునా నాలుగు చెక్కముక్కలు పాతి రేకులు వేసి పేదవాళ్ళకి తక్కువ రెంట్ కి అద్దెకిస్తాడు.

కొన్నాళ్ళకి మసిపూసి మారేడుకాయ చేసి ఆ స్థలానికి హక్కుదారైపోతాడు. 'లా'లో ఉన్న లొసుగుల్ని వాడుకుని, కన్నంలో దూరిన ఎలుకలా ఎవరికీ చిక్కకుండా తప్పించుకుంటాడు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వభూమిని అప్పణంగా కొట్టేస్తాడు. ఇదీ వాడి ప్లాను. చాలా చోట్ల తాత్కాలికంగా 'స్లమ్' లు సృష్టించి ఆనక కబ్జా చేస్తాడని, నా స్నేహితులు చెప్పిన విషయాలు వింటే నా బుర్ర తిరిగింది.

'ఎప్పుడూ లాప్‌టాప్ ముందు కూర్చుని బుద్ధిగా ఉద్యోగం చేసుకోవడం, నాలుగు డబ్బులు వెనకేసుకోవడమే తెలుసు నాకు. యువకుడినై వుండికూడా నా కళ్ళముందు ఇంత అన్యాయం జరుగుతున్నా నాకెందుకులే అని ఊరుకుంటే నాకన్నా దేశద్రోహి ఉండడు. దీని సంగతి తేల్చాల్సిందే! కానీ... కబ్జాని ఎలా ఆపాలి. ఇల్లీగల్ వ్యవహారాలు చేసేవాళ్లకు చాలామంది అండ ఉంటుంది. చాలా నెట్‌వర్క్ ఉంటుంది. నా వెనక ఎవరు నిలబడతారు? నేను నలుగురు ఫ్రెండ్స్‌తో కలిసి గట్టిగా ఊళ్ళో తిరిగిన పాపాన పోలేదు. ఎప్పుడూ చదువు, ఉద్యోగం తప్ప నాకేం తెలుసని. పోలీసుల్ని ఆశ్రయిస్తే? అయినా వాళ్ళతో ఏమని చెప్తాను. ఎవిడెన్స్ ఎక్కడినుంచి తెస్తాను. అదీకాక నా వర్క్ ఫ్రం హోమ్ టైం పీరియడ్ అయిపోవచ్చింది. నేను బెంగుళూరుకు వెళ్లిపోవాలి. ఈలోపలే ఈ లోకనాథంగాడి పని పెట్టాలి' అనుకున్నాను.

అయితే ఆ టీ బడ్డీవాడు ఆ స్థలానికి కాపలా దారయ్యుంటాడు. నన్ను బెదిరించిన ఆ ఇద్దరు ముగ్గురూ వాడి తాలూకు రౌడీలై వుంటారనిపించింది. బాగా ఆలోచించాను. సాయంకాలం నా ఫ్రెండ్స్ దగ్గరకి వెళ్ళాను. ఒక సహాయం చేయమన్నాను.

'ఏం చేయాలో చెప్పు, పక్కాగా అమలుపరుస్తాం!' అన్నారు.

అంతా తెల్లారికల్లా ప్లాన్ ప్రకారం జరగాలని నిర్ణయించుకున్నాం.

నా ఫ్రెండ్స్ ఇద్దరూ టీ బడ్డీ కొట్టు దగ్గరకు వెళ్లి కూర్చుని టీ అడిగారు. ఆ ఎదురుగానే ఉన్న బెంచీ మీద ఆ రౌడీలు కూడా కూచుని ఉన్నారు. బడ్డీ కొట్టతను టీ కలుపుతున్నాడు.

మా వాళ్ళు నెమ్మదిగా లేచి కొట్టతని పక్కకు వెళ్ళి నిలబడ్డారు. వాడికి ఫోన్‌లో ఒక వీడియో చూపించారు.

అది చూస్తూనే వాడు ఖంగుతిన్నాడు. తర్వాత తలెగరేశాడు. చిందులుతొక్కాడు. కాసేపు వాదించాడు. రౌడీలకు ఏమీ అర్థంగాక అయోమయంగా చూస్తున్నారు. కొద్దిసేపటికి వాడి బింకం సడలింది. బెదిరాడు. తర్వాత నా ఫ్రెండ్స్‌కి దణ్ణం పెడుతూ వేడుకుంటున్నాడు.

అక్కడ జరిగేదంతా నేను దూరంగా నిలబడి చూస్తున్నాను.

కొద్ది సేపయ్యాక ఆ రౌడీలకి టీ బడ్డీ అతను ఏదో చెప్పాడు. వాళ్ళు అక్కడినుంచి వెళ్లిపోయారు. కాసేపటికి బడ్డీ మూసేసి అతనుకూడా వెళ్ళిపోయాడు.

చీకటి పడింది. ఇక మేమనుకున్న పనులు చకచకా చేయడం మొదలుపెట్టాం. మర్నాడు ఉదయం మేం వచ్చేసరికి మేం అనుకున్నట్టే గడ్డ దగ్గర కలకలంగా ఉంది. అక్కడికి ఎం ఎల్ ఏ గారు వచ్చారు. ఆయనతో పాటు కలెక్టర్, పోలీసు ఆఫీసర్లు, బోలెడుమంది సిబ్బందితో ఆ ప్రాంతం కిటకిట లాడుతోంది.

'ఇక్కడ పునాదులు తీసిందెవరని' ఆఫీసర్లు అక్కడి వాళ్ళని వాకబు చేశారు.

కాంట్రాక్టర్ లోకనాథం తన మనుషులతో వచ్చి రాత్రిపూట గోతులు తవ్వుతున్నాడని నేను చెప్పమన్నట్టుగానే చెప్పారు వాళ్ళు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించిన లోకనాథంపై యాక్షన్ తీసుకోటానికి ఆదేశాలిచ్చారు ఎం ఎల్ ఏ గారు.

"ఇక్కడ జరిగే అక్రమాల గురించి మీకెలా తెలిసింది సారూ!" అని అడిగారు అక్కడి పేదలు. "ముసుగులేసుకున్న మనుషులు రాత్రిపూట గోతులు తవ్వుతున్న వీడియో నాకెవరో పంపించారు. 'పేదలు నిలువ నీడ లేక చిన్న గుడిసెలు వేసుకుని ఇక్కడ నివసిస్తుంటే, వాళ్ళమీద దౌర్జన్యాలు జరుగుతుంటే చూస్తూ ఊరుకోం. పేదల కోసమే మా ప్రభుత్వం ఉంది. మీకు ఎటువంటి అన్యాయం జరిగినా క్షణాల్లో వచ్చి వాలతాను." అంటూ ఉపన్యాసం ఇచ్చారు ఎం ఎల్ ఏ గారు.

"మమ్మల్ని ఖాళీ చేయించకండి సార్. మమ్మల్ని ఇక్కడే తలదాచుకొనివ్వండి. ఆ లోకనాథం మా జోలికి రాకుండా చూడండి బాబూ!" అంటూ పేదలందరూ తమ గోడు ఎం ఎల్ ఏ గారి ముందు వెళ్ల బోసుకున్నారు.

"మీరు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. వచ్చే ఎలక్షన్స్ లోపు మీ అందరికీ పక్కా గృహాలు నిర్మించి ఇస్తాం." అని హామీ ఇచ్చారాయన.

"అయితే మా అందరి ఓట్లూ మీకే. ఎం ఎల్ ఏ గారికి జై" అంటూ నినాదాలు చేశారు వాళ్లంతా. అక్కడ జరిగేదంతా మీడియా కవర్‌చేసింది. టీవీల్లో ప్రసారమయ్యింది. ప్రతిపక్షాలు కూడా వచ్చి వాలిపోయి ప్రజల పక్షాన నిలబడి హామీల వర్షం కురిపించాయి. కబ్జా రాయుడు లోకనాథాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇదంతా ఇరవైనాలుగు గంటల్లో జరిగిపోయింది. చదువుకోని వాడు దొరలా దొరికినదంతా దోచుకోవడానికి కారణం చదువుకున్నవాడి మౌనం లేదా నిర్లక్ష్యం వహించడమే!

సాయంత్రానికల్లా ముసలమ్మ ఇంటిపై సిమెంటు రేకులు వెలిశాయి. త్వరలో పక్కా ఇల్లు కూడా అమురుతుంది. ఇదంతా నీ చలువే అంటూ మెచ్చుకున్నారంతా.

ముసలమ్మ వేలిముద్ర పడకపోతేనేం, ఆమె వేలితో పిలిస్తే పలికేందుకు టీకొట్టు ఓనరిని సెట్ చేసి పెట్టాను. క్రితంరోజు టీకొట్టు అతనికి నా ఫ్రెండ్స్ చూపించిన ఒక మనిషి మర్డర్ వీడియోలో హతుడి మొహం చితికిపోయి రక్తం ఓడుతూ ఆనవాలు పట్టలేకుండా ఉంది. హంతకుడి మొహం మాత్రం టీ కొట్టు వాడి పోలికల్లోనే స్పష్టంగా కనబడుతోంది. అది పోలీసులకు చూపిస్తానని బెదిరించగానే వాడు వణికిపోయాడు. నిజానికి అది ఓ సినిమాలో బిట్. అచ్చం టీకొట్టు వాడి పోలికల్లో ఉన్న మనిషిని ఎక్కడో చూశాననుకుంటుంటే తక్కున గుర్తొచ్చింది. నేరాలు చేయడం అలవాటైన వాడు కాబట్టి, ఏ హత్య ఎక్కడ చేసాడో వాడికే గుర్తులేదనుకుంటా. అది ఎవడో చాటుగా తీసుంటాడని నమ్మేసి భయపడిపోయాడు. అందుకే నేను చెప్పినట్టు విన్నాడు. లోకనాథం నా మీద పగబట్టి నన్నేమైనా చేస్తాడేమో అంది ముసలమ్మ. దానికి కూడా ఒక స్కెచ్ ఆలోచించి పెట్టుకుని బెంగుళూరు వెళ్ళిపోయాను. మోసాలు చేసే వాళ్ళున్నంత ఎలెర్ట్‌గా బాధితులూ వుంటేనే గానీ, అన్యాయాలు కొన్నయినా అంతమవవేమో!

అత్తయ్య చీర ప్రహసనం నాలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. నాలో సామాజిక చైతన్యానికి నాంది కలిగించింది. ఏమాత్రం స్వార్థం లేకుండా జీవించిన అత్తయ్య ఆత్మకు శాంతి కలిగుంటుందనిపించింది!!

*ప్రతీ వారం ఒక కథ రాయండి. వరుసగా ఏభై రెండు చెడ్డ కథలు రాయలేరు.*

– *రే బ్రాడ్ బ్యురి (Ray Badbury)*

# ప్రేరణ

గేరపాటి భానువర్ధన్



"ఏవే.. సరోజినీ ఏంటే ఆ శబ్దం? కీచు కీచు మని ఒకటే గోల. అబ్బా!! చెవులు చిల్లులు పడిపోతున్నాయి. తల పగిలిపోతుంది" మంచం మీద పడుకుని గట్టిగా చెవులు మూసికొని మెలికలు తిరుగుతూ అసహనంతో అంది పార్వతమ్మ.

పార్వతమ్మ రంగారావు మాస్టారి భార్య. వారికి సరోజిని ఒక్కతే కూతురు. సరోజిని ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతోంది. పార్వతమ్మ గదిలో ఆ శబ్దం భరించలేక రంగారావు మాస్టారి గదిలోకి వెళ్లిపోయింది. మాస్టారు పేపర్లు దిద్దుకుంటూ ఉన్నారు.

"మీరు ఆ పేపర్లు దిద్దుకుంటూ పదకొండు గంటల దాకా నిద్రపోరు. ఆ లైట్ వేసుంటేనేమో నాకు నిద్ర రాదు. సరోజిని గదిలో పడుకుందామంటే ఏవో కీటకాల శబ్దాలు. ఏం చేస్తాను? ప్రశాంతంగా నిద్రపోవడానికి లేదు." అంటూ విసుక్కుంటూ నిండా ముసుగు కప్పుకొని పడుకుంది పార్వతమ్మ.

సరోజిని గదంతా ఆ కీటకం కోసం వెతికింది. ఎంత వెతికినా శబ్దం ఎటునుంచి వస్తుందో తెలియట్లేదు. గదంతా ఒకటే గోల గోల. ఇక విసుగు పుట్టి.. మంచం, బెడ్ బయట పడేసి, గదిలో ఉన్న పుస్తకాలు బయట పడేసింది సరోజిని. చీపురుతో గదంతా ఊడుస్తూ ఒక మూలన మిడతలాంటి కీటకాన్ని చూసింది. పరిశీలనగా చూస్తే దాని నుంచే భరించలేనంత పెద్ద శబ్దం వస్తుందని గ్రహించింది.

దాన్ని చిన్న కాగితం సహాయంతో చేతితో పట్టుకుని ఇంటి బయటకు విసిరివేసింది సరోజిని.

"అమ్మా! మనల్ని ఇంతగా అల్లాడించింది ఎవరో తెల్సా? అది చాలా చిన్నగా మిడతలా ఉన్న కీటకం తెల్సా?" అంటూ తల్లిని తట్టి నిద్రలేపి చెప్పింది సరోజిని.

"అబ్బా..! ఏంటే ఆ విషయాన్ని నిద్ర లేపి మరీ చెప్పాలా? కాసాపు ప్రశాంతంగా పడుకోనివ్వరు కదా!" విసుక్కుంటూ అంది పార్వతమ్మ.

"సరేనమ్మా నీకు లైట్ వేసుంటే నిద్రపట్టదుగా. నా గదిలో ఆ కీటకాన్ని తీసేసి బెడ్ రెడీ చేసాను. రామ్మా పడుకుందువుగానీ!" తల్లిని పట్టుకుని లేపి కూర్చోబెడుతూ అంది సరోజిని.

పార్వతమ్మ అలానే నిద్ర మత్తులో సరోజిని సాయంతో నడుచుకుంటూ వెళ్ళి సరోజిని గదిలో పడుకుంది. సరోజిని కూడా తల్లి పక్కనే పడుకుంది. ఆ రాత్రి సరోజినికి ఎన్నో ఆలోచనలతో సరిగ్గా నిద్ర పట్టలేదు.

★★★

ఉదయాన్నే పెరటి బావిలో నుంచి నీళ్లు తోడుకుని బకెట్ ని గట్టు పై పెట్టుకుని బ్రష్‌తో పళ్లు తోముకుంటూ పరధ్యానంగా ఆలోచిస్తూ ఉంది సరోజిని.

"ఏమే! ఏంటీ? సుదీర్ఘంగా ఆలోచిస్తున్నావు. ఇవ్వాళకు అవుతుందా నువ్వు బ్రష్ చేసుకోవడం?" అన్న తల్లి మాటలతో ఈ లోకంలోకి వచ్చింది సరోజిని.

"అమ్మా..!" అంటూ తల్లిని వాటేసుకుంది సరోజిని.

"ఏంటే చెప్పు"అంది పార్వతమ్మ.

"రాత్రి మనల్ని అంతగా విసిగించింది కదా ఆ కీటకం. దాని పేరేంటమ్మా"

"ఓ.. అదా!. మిడతలాగా ఉందన్నావు కదా! అదే కీచురాయి. చూడటానికి అది ఇంత చిన్నగా ఉంటుంది. కానీ అది చేసే శబ్దం చాలా తీవ్రంగా ఉంటుంది. చెవులు చిల్లులు పడేలా శబ్దం చేస్తుంది దాని శబ్దానికి మనకు తలనొప్పి రావాల్సిందే" చెప్పింది పార్వతమ్మ.

"దానికా శక్తి ఎక్కడనుండి వచ్చిందంటావమ్మా?" ఆసక్తిగా అడిగింది సరోజిని.

"ఎక్కడ నుంచి వచ్చిందంటే అది దేవుని సృష్టమ్మా.. ఇతర ప్రాణుల నుంచి తనను తాను రక్షించుకోవడం కోసం, ఏ ప్రాణులు తనను సమీపించకుండా అలా అధిక శబ్దాన్ని చేసే శక్తి దానికి దేవుడు ఇచ్చి ఉండొచ్చు. తన కన్నా పెద్ద ప్రాణులను ఎదుర్కొనే శారీరక బలం దానికి ఉండకపోయినా పెద్ద శబ్ధంతో ఎదుటి ప్రాణుల్ని బెదరగొట్టి అలా విజయం సాధిస్తుంది!" అంది పార్వతమ్మ

"ఓహో.. అలాగా!" అంటూ సరోజిని ఆలోచనలోపడింది.

★★★

సిటీ బస్టాండ్‌లో కాలేజ్ బస్ కోసం సరోజిని ఆమె స్నేహితురాలు ప్రమీల నిలబడి ఉన్నారు.

"ఏంటి సరోజిని.. కంగారుగా ఉన్నావ్?" అడిగింది ప్రమీల.

"అదేనే..! ఆ వెంకీగాడు ఎక్కడ వస్తాడోనని..! ఈమధ్య వాడి టార్చర్ ఎక్కువైంది. కాలేజ్ దగ్గర కూడా కాపు కాస్తున్నాడు." అంది సరోజిని.

"ఏంటంట వాడి గోల?" అంది ప్రమీల.

"ఏముంది ఐ లవ్యూ చెప్పమంటాడు. అసలే ఫైనలియర్ పరీక్షలు.. చదువుకోవాలి. చదువు మీద ధ్యాస పెట్టలేకపోతున్నాను. వీడి వెధవ వేషాలు నుంచి తప్పించుకోవడం ఎలాగో ఆలోచించడం సరిపోతుంది.", అంది సరోజిని

అంతలో బస్ వచ్చింది. ఇద్దరు బస్ ఎక్కి కూర్చున్నారు. వెనుక సీట్లోనుంచి ఎవరో తన కాలును రాస్తూ ఉన్నట్లు అనిపిస్తే వెనక్కి తిరిగి చూసింది సరోజిని. గుండెల్లో రాయి పడ్డట్టయ్యింది. ఎప్పుడు ఎక్కాడో, ఎక్కడ ఎక్కాడో గానీ, ఆ పోకిరివెధవ వెంకీ తనను చూడంగానే 'ఏంటీ' అని కళ్ళెగరేసి చూస్తున్నాడు. పురుగును చూసినట్లు వాడి వైపు అసహ్యంగా చూసి కాలిని ముందుకు జరుపుకుంది సరోజిని.

ఇదంతా గమనించిన ప్రమీల.. "ఎందుకే ఈ వెధవను వదిలేస్తున్నావ్? ఒకసారి మీ నాన్నగారికి విషయం చెప్పొచ్చుగా?" అంది ప్రమీల.

"చెప్పానే నాన్నగారు కూడా వీడికి మంచిగా హితబోధ చేశారు.. 'బాబూ .. నీదంటే రాజకీయ నాయకుల ఫ్యామిలీ.. నువ్వు చదువుకోకపోయినా ఎలాగైనా నీకు జరిగిపోతుంది. బోలెడన్ని స్థిరాస్తులు, బిజినెస్‌లు ఉంటాయి. కానీ మాకు చదువొక్కటే ఆధారం. అమ్మాయి బాగా చదువుతుంది. రేపు ఏదైనా చిన్న ఉద్యోగం సంపాదించుకుని తన బ్రతుకు తాను బ్రతుకుతుంది. దయచేసి దాని చదువును పాడుచేయకని' చెప్పారు. అప్పుడు బాగానే విన్నట్లు నటించాడు. కానీ తర్వాత షరా మామూలే" అంది సరోజిని.

"మరి పోలీస్ కంప్లైంట్ అయినా ఇవ్వాల్సింది"

"అదీ అయిపోయింది. వీడు మేయర్ కొడుకు కదా! వీళ్ళ నాన్నకున్న పలుకుబడిని ఉపయోగించుకొని ఇట్టే బయటకు వచ్చేస్తున్నాడు. పోలీసులు కూడా వాడిని ఏమీ చేయలేకపోతున్నారు. వాళ్ళ బాబులానే వీడూ అరాచకాలు చేస్తున్నాడు. వీడు ఎంతమంది ఆడపిల్లల జీవితాలు నాశనం చేశాడో లెక్కే లేదు. అటువంటివాడి కంటపడడం నా దురదృష్టం!" బాధపడుతూ అంది సరోజిని.

ఇంతలో బస్ కాలేజీస్టాప్‌లో ఆగింది. సరోజిని, ప్రమీల ఇద్దరూ దిగారు. వారి వెంటా, వెంకీ కూడా దిగాడు. అతని కారు బస్ ప్రక్కనే వచ్చి ఆగింది. కారుడోరు ఓపెన్ చేసి డ్రైవర్ వినయంగా నించున్నాడు.

"హే.. బ్యూటీ .. నేను చెప్పిన విషయం గుర్తుందా? ఎప్పుడు చెప్తావు నాకు ఐ లవ్యూ అని.. తెలుసుగా నా సంగతి! ప్రేమిస్తే గుండెల్లో పెట్టుకుంటాను.. కాదంటే కాటికే.. ఖబడ్దార్!" కారు ఎక్కబోతూ హెచ్చరిస్తూ వేలు చూపించాడు వెంకీ.

సరోజిని గజగజ వణికిపోతూ వడివడిగా కాలేజీ గేటు వైపు నడించింది. ప్రమీల కూడా సరోజినిని అనుసరించింది కంగారుగా!

సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి రాగానే ఒక్క ఉదుటనవచ్చి తండ్రిని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది సరోజిని. కూతురు అలా ఏడవడం తో మాస్టారు కలతచెందారు.

ప్రేమగా తలనిమురుతూ అడిగారు "ఏమైంది సరోజిని?"

"నాన్నా! నాకు తొందరగా పెళ్ళిచేయి.. నాన్నా!" అంది ఏడుస్తూ.

"ఎందుకమ్మా, అసలేమైంది నీకు? పెళ్ళంటే ఇప్పుడప్పుడే వద్దని ఉద్యోగం సంపాదించుకునే దాకా చేసుకోననే దానివి కదా? ఇప్పుడేమైంది నీకు?" అడిగారు రంగారావు మాస్టారు.

"అదే.. ఆ వెంకీగాడు నన్ను చాలా ఇబ్బంది పెడ్తున్నాడు నాన్నా. వాడి టార్చర్ పడలేకపోతున్నా. వాడికి నువ్వు ఒకసారి చెప్పినా నా వెంట పడి నన్ను ఏడిపించడం మానలేదు. కుటుంబ విషయాలతో బిజీగా ఉండే మీకు ఆ విషయం చెప్పి, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని నేను మీకు చెప్పలేదు. నేను ఎవర్నైనా పెళ్ళిచేసుకుని దూరంగా వెళ్తే ఆ వెధవ గోల పోతుంది!" అంది సరోజిని.

"ఆలోచిద్దామమ్మా. ఈ పది రోజులు ఫైనల్ పరీక్షలు కానీ... తర్వాత పెద్దమ్మ వాళ్ళ ఊరెళ్ళి ఉండు కొన్నాళ్ళు. నా ఉద్దేశ్యం ఏంటంటే ఈ సంవత్సరంతో నీ ఇంజినీరింగ్ అయిపోతుంది. మంచి కంపెనీలో ఉద్యోగం వస్తే ఒకరి మీద ఆధారపడకుండా నువ్వు లైఫ్‌లో సెటిల్ అయిపోతావు. అప్పుడు నిదానంగా మంచి సంబంధం చూద్దాం అని. ఆ వెంకిగాడే నీకు సమస్యైతే నేను వాళ్ళ నాన్నని కలిసి విషయం చెప్తాను!"

"అయ్యో నాన్నా.. వాళ్ళ నాన్నకూడా అలాంటివాడేగా! వాళ్ళ అబ్బాయి అకృత్యాలు ఆయనకు తెలిసి ఉండవంటారా? తెలిసే మెదలకుండా ఉంటున్నాడు. ఆయనకు చెప్పి ప్రయోజనం లేదు."

"అయినా నేను ఒక ప్రయత్నం చేసి చూస్తాను. నువ్వు ఏం దిగులు పెట్టుకోకుండా సమయానికి తిని బాగా చదువుకో. వాడెవడి

కోసమో.. నీ జీవితాన్ని నాశనం చేసుకోవడం ఎందుకు? ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ అయ్యేవరకు, నేనే వచ్చి నిన్ను కాలేజీలో వదిలిపెడతాను. అవునూ.. ఇంతకీ ఎగ్జామ్స్ సెంటర్ ఎక్కడమ్మా?" అడిగారు రంగారావు మాస్టారు.

"సిటీ అవుట్‌స్కర్ట్స్‌లో ఉన్న గాయత్రి కాలేజీ నాన్నా."

"ఓకే.. రేపు ఉదయం తయారై ఉండు. నేను నిన్ను ఎగ్జామ్ సెంటర్‌కు తీసుకువెళ్తాను."

"సరే నాన్న అలాగే!", అని తన గదిలోకి వెళ్ళిపోయింది సరోజిని. గబగబా స్నానం ముగించుకొని భోజనం చేసి చదవుకోవడానికి కూర్చుంది.

అప్పుడే జరిగింది ఆ సంఘటన. ఎక్కడ నుంచి వచ్చిందో కానీ కీచురాయి మళ్ళీ ఇంట్లోకి వచ్చింది. ఒకటే రొద. భరించలేక పోయింది. అలాగే చెవులు కళ్ళు గట్టిగా మూసుకుంది అసహనంతో. అదే సమయంలో సరోజిని లో ఆలోచన కూడా మొదలైంది.

ఆలోచించగా, ఆలోచించగా తన సమస్యకు పరిష్కారం దొరికినట్లనిపించింది. ఆ సంతోషంలో కీచురాయిని ఒక్క ఉదుటన బయటపడేసి వచ్చి చిరునవ్వుతో గుండె నిండా ఊపిరి పీల్చుకుంది. ఆ రాత్రి ప్రశాంతంగా గాఢంగా నిద్రపోయింది సరోజిని.

★★★

ఉదయం హుషారుగా తయారై పరీక్షకు బయలుదేరింది సరోజిని.

"నాన్నగారు వస్తాన్నారుగా ఉండమ్మా" అంది పార్వతమ్మ.

"ఏం అవసరం లేదులేమ్మా.. నేనే వెళ్ళి వస్తాను. ఇప్పుడు నాకేం భయంలేదు.", అంటూ వెళ్ళిపోయింది సరోజిని. దారిలో ప్రమీలని కూడా కలుపుకుని ఎగ్జామ్ సెంటర్‌కు బయలుదేరింది.

కాలేజీ ఊరు బయట తారురోడ్డు మీద నుంచి అర కిలోమీటర్ లోపలికి పొలాల్లో ఉంది. ఓ అరగంట నడక తప్పదు. ఇద్దరూ బస్ దిగి నడిచి వెళ్తున్నారు. హఠాత్తుగా చెట్టుచాటు నుంచి వచ్చి సిగిరెట్ తాగుతూ వాళ్ళకు అడ్డుగా నిలిచాడు వెంకీ. సిగరెట్ పొగను రింగులు రింగులుగా ముఖంపై వదులుతూ ఓ విషపు నవ్వును నవ్వాడు. సరోజినిని మైకంగా చూస్తూ మీద మీదకు రాసాగాడు.

ప్రమీల భయపడి "హే రావే పరిగెత్తు" అంటూ సరోజిని చేతిని లాగింది.

సరోజిని నిర్భయంగా "నీకు భయమైతే నీవెళ్ళిపోవే.. నాకేం భయంలేదు!" అంటూ చేతిని వెనిక్కి లాక్కుని విడిపించుకుని ప్రమీలని పక్కకు నెట్టింది.

"సరే నీ ఖర్మ ..! " అంటూ వడిగా కొంత దూరం వెళ్ళింది ప్రమీల.

"ఏంట్రా చెప్పు ఎందుకాపావు నన్ను?" కంచుకంఠంతో ప్రశ్నించింది సరోజిని.

ఆ వాయిస్‌లోని బేస్, తొణికిసలాడే ఆత్మవిశ్వాసాన్ని గుర్తించిన ప్రమీల వెళ్ళబోతూ ఆగి వెనక్కి తిరిగిచూసింది.. ఏదో జరగబోతుందని ఉత్సుకతతో..!

"ఇన్నాళ్లు లెక్కలేనితనంగా నన్ను నిర్లక్ష్యం చేసావు కదూ.. ఇప్పుడు చూడు నిన్నేం చేస్తానో!" మీదకు వస్తూ అన్నాడు వెంకీ.

"ఏం చేస్తావ్‌రా..! దమ్ముంటే నా మీద చెయ్యేసి చూడు." అంది గుడ్లురుముతూ సరోజిని.

"అబ్బా ఇదంతా కోపమే..? ఎంతైనా కోపంలో కూడా నువ్వు చాలా అందంగా ఉంటావే డార్లింగ్.. నిన్నటి దాకా జింకపిల్లగా బిక్కుబిక్కుమంటూ వెళ్ళేదానివి. ఇంతలోనే అంత ధైర్యమా? ఆహా..! ఎక్కడ నుండి వచ్చిందే నీకు ఇంత ధైర్యం? ఈ రోజు ఈ పులికి ఇంకో జింకపిల్ల బలి.. మత్తెక్కించి కనువిందు చేసే నీ లేలేత అందాలను కసితీరా అనుభవించి నీ బ్రతుకును కుక్కలు చింపిన విస్తరిని చేస్తా.. నిన్ను ఎవడొచ్చి కాపాడుతాడో చూస్తా. ఈ పొలాల్లో నువ్వు అరిచినా ఎవ్వరికీ వినిపించదు.. నేను నిన్ను ఏం చేసినా

ఎవ్వరికీ కనిపించదు..! హ..హహ..హహహ..” అంటూ భీకరంగా నవ్వుతూ జుట్టు పట్టుకుని పొలాల్లోకి ఈడ్చుకెళ్ళాలని చెయ్యి వేయబోయాడు వెంకీ.

సరోజిని మెరుపు వేగంతో వెనక్కి అడుగువేసి తన భుజానికున్న బ్యాగ్‌ను బలంగా ముఖానికేసి కొట్టింది.అందులో ఎప్పుడూ లాప్‌టాప్ ఉంటుంది. ఆ లాప్‌టాప్ రాయిలా తగిలింది కాబోలు కంటి కింద చర్మం చిట్లి రక్తం కారింది.

“అబ్బా..!” బాధతో అరిచాడు వెంకీ.

సరోజిని వేగంగా బ్యాగ్‌ను గాలిలో తిప్పుతూ ముఖానికి ఆ వైపు ఈవైపు ఆగకుండా కొట్టింది. లోపల లాప్‌టాప్ పగిలిందనుకుంటా. ముఖానికి గాజు పెంకులు గుచ్చుకుని ముఖమంతా రక్తసిక్తమై, ముఖం మంట పుట్టింది. దెబ్బతిన్న వెంకీ సరోజిని పై ఎదురుదాడి చేయటానికి బ్యాగ్‌ను గట్టిగా పట్టుకుని దూరంగా విసిరాడు. బలమైన తనచేతిని పులిపంజాలా ఆమె వైపు విసిరాడు. సరోజిని తృటిలో తన మోకలిపై కిందకు కూర్చుని వెంకీ పొట్టలో పిడిగుద్దులు కురిపించింది క్షణమైనా గ్యాప్ లేకుండా.

ఇంతలో ఇదంతా దూరంనుంచి గమనిస్తున్న ప్రమీల సరోజిని దగ్గరకు పరుగు పరుగున వచ్చింది.

“ఏవే అసలు నువ్వు నువ్వేనా? నమ్మబుద్ధి కావడంలేదు. ఛూత్ అంటే ఝడుసుకుని పరిగెత్తే సరోజినివేనా నువ్వు? అసలింత ధైర్యం ఎక్కడనుంచి వచ్చిందే నీకు? ఇప్పుడు సరే తర్వాత వాడు పదిమందిని వెనకేసుకొని వచ్చి ఏమైనా అఘాయిత్యానికి పాల్పడితే ఏంటే సంగతి.” అంది ప్రమీల భయపడుతూ..

“ఏయ్ ఏం చేస్తాడేవాడు? ఎన్నాళ్ళు భయపడ్తావాడికి!” అంది సరోజిని.

“ఏరా! ఇంత తన్నినా కర్రతో మీదకొస్తావా? ఇంకెలా లేచి వస్తావో చూస్తాను” అంటూ బూట్ కాలులో వెంకి కుడిపాదానికి పైభాగంలో గట్టిగా తొక్కింది. కండ చిదురు చిదురై ఎముక చిట్లింది.

“అబ్బా.. అంటూ వెంకీ బాధతో కాలుపట్టుకుని భయంతో వెనక్కి వెనక్కి జరగసాగాడు.

“ఏరా ఇందాక ఏదో ప్రగల్భాలు పలికావుగా. ఆడవాళ్ళంటే అంత చులకనరా నీకు” అంటూ కాలుతో ముఖం మీద తన్నింది. భళ్ళున రక్తం కక్కాడు.

“అరేయ్ బద్మాష్ ..! నేను ఇదివరకటి పిరికి సరోజినిని అనుకున్నావురా. ఇప్పుడు చూడు సివంగిని.. నా జోలికే కాదు ఇంకే ఆడకూతురు జోలికి వెళ్ళినా నీ పేగులు తీసి మెళ్ళో వేసుకుంటా ఖబడ్దార్..! నేనిప్పుడు మార్షల్ ఆర్ట్స్ కూడా నేర్చుకున్నా..! వెధవ్వేషాలేస్తే తొక్కిపట్టి నారతీస్తా.. జాగ్రత్త” అంది కరాటే పొజిషన్ తీసుకుంటూ.

వెంకీ మసక బారిన కళ్ళకు ఇప్పుడు సరోజిని మహంకాళిలా కనిపిస్తుంది. అప్రయత్నంగా తనను వదిలివేయమని సంకేతాన్నిస్తూ అతని చేతులు దండం పెట్టాయి.

స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చి, సరోజిని ప్రమీలతో కలసి ఎగ్జామ్ సెంటర్‌కి బయలుదేరి వెళ్ళిపోయింది.

వెంకీ అలాగే చెట్టు దగ్గర పడిఉన్నాడు. అటునుండి వెళ్ళే కాలేజీ అమ్మాయిలు సహాయం చేద్దామని వెళ్ళి అతడిని చూసి “ ఛీ వీడా..! వీడొక రోగ్. ఏం ఏడిపించాడూ అమ్మాయిలని! ఎవరో కాని బాగానే బుద్ధి చెప్పారు వీడికి.” అని తిడుతూ ముఖం మీద ఉమ్మి ఊసిపోయారు.

సరోజినిని ప్రమీల అడిగింది దారిలో.. "అవును సరోజిని.. నువ్వు నాకు తెలీకుండా ఎప్పుడు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నావే?”, అని విస్మయంతో.

“ఛ.. ఊరుకోవే. నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడమేంటీ..! మార్షల్ ఆర్ట్సనా నా బొందా..! నేనేమీ నేర్చుకోలేదు!” ధీమాగా చెప్పింది సరోజిని.

"మరెందుకు వాడితో అలా చెప్పావు?" ఆశ్చర్యంగా అడిగింది ప్రమీల

"అలా చెప్తేనే వాడికి భవిష్యత్తులో కూడా భయముంటుంది. ఇంకెప్పుడూ మన జోలికి రాడు!" అంది సరోజిని.

"అది సరే కానీ అంత ధైర్యం నీకు ఎక్కడనుండి వచ్చిందే తల్లి ..!" అంది సరోజిని.

"నేను ఇంక విసిగిపోయి వేరే ఊరు వెళ్లామనుకున్నా వీడి గోల పడలేక.. కానీ ఆ రోజు రాత్రి కీచురాయి అనే కీటకం నాలో ఆలోచన రేకెత్తించింది. ఇంత చిన్న కీటకమే తనకు ఎదుటవారిని ప్రతిఘటన చేసే శక్తి లేనప్పటికి, తన ప్రయత్నంగా పెద్ద శబ్దం కలుగజేస్తూ ఎదుటివారిని భయపెడుతుంది. అదేదో పెద్ద జంతువనుకుని ఏవీ ఆ శబ్దానికి దానిని సమీపించే సాహసం చేయవు. ఆంతెందుకు మనుషులకే చిరాకు తెప్పిస్తుంది. అది ఉన్న గదిలో కాసేపైనా ఉండలేరు ఆ శబ్దాన్ని భరిస్తూ. చిన్న కీటకానికే అంత శక్తియుక్తులున్నప్పుడు మనకెంత ఉండాలి? మనం కూడా దాడిని ప్రతిఘటించే శక్తి లేకపోయినా ధీటైన మాటలతో బెదిరిస్తూ ధైర్యాన్ని ప్రదర్శిస్తూ ఎదుటివారిలో భయాన్ని కలిగించవచ్చు. ఎప్పుడూ కాపాడటానికి ఎవరో ఒకరు వస్తారని ఎదురుచూస్తూ ఉంటే కుదరదుగా. మనమంటూ స్వీయరక్షణకు కొంత సిద్ధపడి ఉండాలి. స్త్రీ తాను అసహాయురాలుననుకుంటే ఎప్పుడూ దౌర్జనానికి గురౌతూనే ఉంటుంది. ఎప్పుడైతే తాను పురుషులకు ఎందులోనూ తక్కువ కానని ప్రతిదీ తాను చేయగలననే ఆత్మవిశ్వాసం కలిగి ఉంటుందో దౌర్జన్యాన్ని ప్రతిఘటించే వీరనారి అవుతుంది!" అంది సరోజిని ఉద్వేగంగా.

ప్రమీలకు సరోజిని ఆ రోజు కొత్తగా కనిజపించింది. తన నుంచి సమాజంలో ఏదో మార్పు సంభవించబోతుందని తలచి మౌనంగా అనుసరించింది.. రేపటి మహోద్యమానికి శ్రీకారం చుడుతూ..!

*రచయిత కావాలనుకునేవాడు..చిన్న కథలతోనే మొదలెట్టాలి. చాలామంది నవలతోనో, ధారావాహికంతోనో, రచనా ప్రస్థానాన్ని అరంభిస్తున్నారు. అదెలా వుంటుందంటే.. నడకొచ్చినవాడు ఎకాఎకి ఎవరెస్టు ఎక్కినట్టే! చిన్న కథలు రాయడం వలన చక్కటి నైపుణ్యం వస్తుంది!*

*– జార్జ్ ఆర్.ఆర్. మార్టిన్*

# భోగ భూపాలం

పి. వి. ఆర్. శివకుమార్



అతిథి దేవుడి కారు ఆవరణలోకి వచ్చి ఆగింది. వినయంగా వచ్చి, వెనక డోర్ తెరిచి పట్టుకున్నాడు ఆహ్వాన బృంద నాయకుడు, భద్రగిరి.

ముందుగా వెండిపొన్ను చేతికర్ర బయటకు వచ్చింది. ఆ వెనుకే, గండపెండేరం ధరించిన వామపాదం నేలకి తాకింది. స్వర్ణ కంకణధారిణి అయిన ద్వితీయ కరపద్మం కారు తలుపు పై భాగాన్ని ఊతగా చేసుకు దర్శనమిచ్చింది. చివరగా ఆరడుగుల నాదబ్రహ్మ రఘునాథ శాస్త్రిగారి గంభీర విగ్రహం బయటకు వచ్చింది.

"బాగున్నావా భద్రగిరీ!" మేఘ గర్జనలో వెన్నముద్ద మార్దవం కలగలిసిన గళం పలకరించింది.

జవాబుగా నోరు తెరవకుండా రెండు చేతులు జోడించాడు భద్రగిరి. వస్తున్న వణుకును అణుచుకునే ప్రయత్నం అందులో ఉంది. నోరు తెరిస్తే, భయం బయట పడుతుందనే భయం, పెదాల్ని బిగించి పట్టుకుంది. హస్త ద్వయంతో పద్మముకుళిత ముద్ర పట్టి, వేదిక వైపు దారి చూపుతూ ఆహ్వానం పలికాడు.

వన్నె తగ్గినా విలువ తగ్గని వజ్రంలా ఉన్న నాదబ్రహ్మ రఘునాథ శాస్త్రి, దశాబ్దం పైగా జన బాహుళ్యానికి కనుమరుగై, వానప్రస్థం స్వీకరించినా, రసికాభిమానులకు ఆయనపై అభిమానం ఇసుమంతైనా తగ్గలేదు. ఆయన దర్శనం తోటే, వారి ఆనందం ఇనుమడించింది. అడుగులకు మడుగులొత్తుతూ, ఆయనను తీసుకువెళ్లి, ముందు వరుస సోఫాలో ఆసీనం చేశారు.

ఎదురుగా వేదికమీద నిలువెత్తు తైలవర్ణ చిత్రం.. దానికి ఇరువైపులా వివిధ సంగీత సభల తాలూకు దృశ్యాలు. అన్నిటా శశితేజంతో మెరిసిపోతూ, ప్రస్తుత దశాబ్దంలో ప్రభ నడుపుకొంటున్న గానగంధర్వ భూషణ శాస్త్రి!! జానెడంత జరీ అంచు తలపాగా నుదుటిని కప్పివేయగా, నల్లటి గుబురుమీసాలు బుగ్గలను ఆక్రమించాయి. రెండు నిమిషాలు దీక్షగా చూసినా ఆ 'గంధర్వుడిని' ఆనవాలు పట్టటం రఘునాథ శాస్త్రిగారి తరం కాలేదు.

'ఏ తరం శిష్య పరమాణువు ఈ భాగవతోత్తముడు?'అన్న మీమాంస ఆయనను ఇబ్బంది పెడుతూనే ఉంది.

స్వాగత పత్రం అతగాడి ప్రతిభా వ్యుత్పత్తులపైన ప్రశంసా పత్రంలాగే భాసిల్లింది గానీ, అతడి మూలాల జోలికి పోలేదు.

"పుర జనులు తనకు తలపెట్టిన అఖండ సన్మానానికి తమరు అధ్యక్షత వహిస్తే తప్ప, అంగీకరించనని హఠం వేసుకు కూర్చొన్నారు గాన గంధర్వ భూషణ శాస్త్రి గారు. తమరు కాదంటే, అభాసు తప్పదు." పని గట్టుకు హరిద్వార్ వెళ్ళి, అభ్యర్థించారు నిర్వాహకులు.

"వారెవరట? నేనెందుకట?" అడిగారు చిరాకుగా రఘునాథ శాస్త్రిగారు.

"వారు తమ శిష్య పరమాణువట. తమ ఋణం తీర్చుకునే దారులలో ఇది ఉత్తమమట!" చెప్పారు వారు.

రఘునాథ శాస్త్రిగారు గతాన్ని మరిచి, పరాన్ని ప్రేమించే సాధనలో ఉన్నారు గత కొన్నేళ్లుగా.

ప్రాశ్చాత్యం విరుచుకుపడి, తన ప్రాభవం తగ్గటం అందుకు బీజం వేస్తే, భార్యామణి వియోగం మరింత ముందుకు తోసింది. దానా దీనా, ఆయన తన జ్ఞానేంద్రియాల ఆదేశం మేరకు, స్వగ్రామం వదలి, హరిద్వారంలో నిలబడి, స్వర్గ ద్వారం పిలుపుకు ఎదురు చూస్తున్నాడు. ఆ పిలుపు ఇంకా రాకపోగా, ఇప్పుడీ పిలుపు!!

భూషణ శాస్త్రి నుండి వచ్చే తమకు లక్షలను వదులుకోలేక, ఒక్క రోజు తమకిమ్మని ఆయనను లక్ష విధాలా బ్రతిమిలాడి, అయోమయంలో ఉన్న రఘునాథ శాస్త్రిగారిని, మారు చెప్పే అవకాశం ఇవ్వకుండా, విమానయాన ఖర్చులు భరించి మరీ ఎగరేసుకు వచ్చారు నిర్వాహకులు.

నిర్వాహకులను కూడా ఆశ్చర్యానికి గురి చేస్తూ, రఘునాథ శాస్త్రిగారి పేరు చూడగానే, గతం మరువని శాస్త్రీయ సంగీత ప్రేమికులు మేమింకా ఉన్నామని, క్యూలు కట్టి మరీ టికెట్లు కొనుక్కున్నారు!! ఊహను మించి సభ కిటకిట లాడింది.

ఒక ట్రే లో ఫలహారాలు వచ్చాయి. సున్నితంగా తిరస్కరించారు రఘునాథ శాస్త్రిగారు.

"కనీసం కాఫీ అయినా..."

"అది మాకు విషతుల్యం." గంభీరంగా చెప్పారు. బలవంతం మీద ఒక కప్పు వేడి పాలు మాత్రం తీసుకున్నారు.

ముఖ్య అతిథి అయిన సాంస్కృతిక శాఖామాత్యులని స్వయంగా ఆహ్వానించటానికి భూషణ శాస్త్రి స్వయంగా వెళ్లారని చెప్పారు.

పది నిమిషాల్లో వేదిక మీద సందడి మొదలయింది. సాంస్కృతిక శాఖామాత్యులు, జిల్లా కలెక్టర్‌లతో భూషణశాస్త్రి నేరుగా వేదిక మీదకు వచ్చాడు. రఘునాథ శాస్త్రిగారిని కూడా వేదిక మీదకు తీసుకువెళ్లారు.

సభ ప్రారంభమయింది. దీపోజ్వలనం అనంతరం ఉపన్యాసాలు మొదలయ్యాయి. జిల్లా కలెక్టర్‌గారు పరిపాలన కూడా ఒక కళే అని, పరిపాలనలో కళల పాత్రగురించి మాట్లాడారు. మంత్రివర్యుడు రానున్న ఎన్నికలని దృష్టిలో పెట్టుకుని, కళాకారులూ ఓటర్లే గనుక, ఎన్నికలలో ఓటర్ల ప్రాముఖ్యత గురించి ఉపన్యసించారు. ఆ తరవాత, రఘునాథ శాస్త్రిగారి అధ్యక్షోపన్యాసం. ఏమీ తెలియని శిష్యుడి గురించి, తనకు తెలిసిన వాక్యాలు పలికారు.

"శాస్త్రీయ సంగీతాన్ని సినిమా గ్రహణం, తదుపరి దూర దర్శన వ్రణం పీడించటం మొదలయ్యాక, నాబోటి ఛాందసుల నిష్క్రమణం మొదలయింది. ఎక్కడో హరిద్వారాన చెవులు మూసుకు, హరి దర్శనానికై తపసు చేసుకుంటున్న నన్ను, ఈ కళా భూషణుడెవరో గానీ, పట్టుబట్టి, రెక్కబట్టి రెక్కల బండిలో పడేసి, ఎగరేసుకు వచ్చాడు. ఆ అజ్ఞాత ఆధునిక కళాస్రష్టకి చేతులెత్తి ఆశీర్వాదం పలుకుతున్నాను. ఆ బిడ్డను కన్న కళామతల్లికి శిరసు వంచి నమస్కరిస్తున్నాను. కొడిగడుతున్న శాస్త్రీయ సంగీతాన్ని ఒడిసి పట్టి జ్వాజ్వల్యమానం చేయమని గళమెత్తి ఆశీర్వదిస్తున్నాను." అని ఉద్వేగంగా ఉపన్యసించారు. కరతాళ ధ్వనులతో సభ దద్దరిల్లింది.

ఆ వెనకే భూషణశాస్త్రికి ఘన సన్మానం. అతనికి రఘునాథ శాస్త్రిగారు కాశ్మీరు శాలువ కప్పి, స్వర్ణ కిరీటం ధరింపజేశారు. గురువర్యులకి గురుతెరుగని శిష్యుడు పాదాభివందనం చేశాడు. తరవాత మంత్రివర్యులు రఘునాథ శాస్త్రిగారికి సన్మానం చేశారు. వెను వెంటనే మంత్రిగారు, కలెక్టర్‌గారు అర్జంట్ పనుల నెపంతో (ప్రమాదం పసిగట్టినట్టు?) సభనుంచి నిష్క్రమించారు.

రఘునాథ శాస్త్రిగారిని వేదిక పైనే, కుడి చివర ఉపవిష్టుడిని చేసి, గాన కచ్చేరీ ప్రారంభించారు.

విఘ్నేశ్వర ప్రార్థన, శారదా స్తుతి అనంతరం, లలిత గీతం అని ప్రకటించారు. భూషణ శాస్త్రి భూపాల రాగ వైదుష్య ప్రశస్తిని కనులారా స్వాగతపత్రంలో చదివి ఉండటాన, ఆ శాస్త్రీయ సంగీత గానలహరిలో ఓలలాడాలని చెవులు దొప్పల్లా చేసుకు కూర్చొన్న రఘునాథ శాస్త్రి గారి భృకుటి ఒకింత ముడిపడింది. గీతం ప్రారంభమయింది.

"తొలి సంజె వేళలో... తొలి పొద్దు పొదుపులో...

తెలవారే వేళలలో వినిపించే రాగం బ్రూ పాలం... అది తెచ్చే కాఫీ కడు రుచ్యం..."

రఘునాథ శాస్త్రిగారి మెదడుకి కరంట్ షాక్ తగిలింది. పదిహేనేళ్ల మదవంతుడైన శశిభూషణ్ కళ్ళముందు రూపు కట్టాడు. వాడు భూషణ శాస్త్రి ఎలాగయ్యాడో తెలియలేదు.

ఒక్క విసురున లేచి నుంచున్నారు, " శశీ!" సన్నాసీ అన్నంతగా గర్జించారు.

"ఏమిటి నువ్వు పాడుతున్నది? దాసరి గీతానికి చరమ గీతం పాడుతున్నావా?"

ఒక్కసారిగా గానానికి బ్రేకు పడింది. తాళానికి తాళం పడింది. సభ శంకరాభరణం పెళ్లి చూపుల సభలా స్తబ్దమై పోయింది.

భూషణశాస్త్రి తొణకలేదు. కోరిక తీరిన చందంగా, చిద్విలాసంగా తల మీది స్వర్ణ కిరీటాన్ని సవరించుకుంటూ, చిరునవ్వు చిందించాడు. రఘునాథ శాస్త్రిగారు ఆపాదమస్తకం ఉద్రేకంతో ఊగిపోయారు. గతమంతా క్షణంలో ఆయన కళ్ళముందు రీళ్లు తిరిగింది.

★★★

రఘునాథ శాస్త్రిగారి ప్రభ రవి తేజంతో వెలుగొందుతున్న దశలో, ఆయనకు ఆ ఊరి జమీందారుగారి అధ్వర్యంలో ఒక సన్మానసభ జరిగింది. ఆ సభకి తండ్రితో వచ్చిన చిన్నారి శశిభూషణ్‌ని, రఘునాథ శాస్త్రి గారికి కనులు మిరుమిట్లు గొలిపేలా జరిగిన సన్మానం, అందిన సభా మర్యాదలు మంత్ర ముగ్ధుడిని చేశాయి.

'ఇంత గౌరవమూ ఒక పాట పాడినందుకేనా!' అనుకున్నాడు.

'బతుకంటే ఇదీ! చదువు బరువు లేకుండా, హాయిగా పాటలు పాడుకుంటూ, జేజేలు కొట్టించుకోవటం ఎంత తేలిక.

కీర్తి సంపాదన మేడీజీ' అనీ అనుకున్నాడు, రెండేళ్లుగా ఎంసెట్ తో కుస్తీ పట్టి కుదేలవుతూ వస్తున్న శశిభూషణ్.

తను రఘునాథ శాస్త్రిగారి దగ్గర సంగీతం నేర్చుకుంటానని తండ్రి దగ్గర ముచ్చట పడ్డాడు. మరో రెండు తరాలు తిని కూర్చొన్నా తరగని జమీలు ఉన్న ఆ జమీందారు, 'వీడికి ఎలాగూ చదువబ్బటం లేదు. జమీందార్లకి కళా పోషణ కూడా ఒక ఆభరణమే కదా!' అనుకుని, కొడుకు ముచ్చట తీర్చటానికి అంగీకరించాడు.

శశిభూషణ్ సంగీత సాధన శ్రీకారం చుట్టుకుంది. అతను రఘునాథ శాస్త్రిగారి శిష్యబృందం లో చేరిపోయాడు. కతిపయ దినాలకే, దూరపు కొండల గరుకు తెలిసొచ్చింది. సంగీతం చేదు కషాయం అనిపించింది. తినే పదార్థాలపై కట్టడి, తాగే పానీయాలపై కట్టడి.. యాక్...మిరియాలు కలిపిన వేడి పాలు ... తెల్లవారు ఝామునే లేపటాలు... నది నీటిలో నిలబడి, ఆ చలిలో గాత్ర సాధన... ఇంతకన్నా, చాటుమాటున దమ్ము కొడుతూ, అప్పుడప్పుడు మందు కొడుతూ చేసే ఎంసెట్ సాధనే నయం అనిపించింది. కానీ, ఆ యేడు ఎంసెట్ సమయం ముగిసిపోవటంతో, సత్వరం వెనుదిరిగే అవకాశం లేదు. కనీసం కొన్నాళ్లపాటైనా ఈ సాధన కొనసాగించక తప్పదు!

వీడి సంగీత చెలగాటం, రఘునాథ శాస్త్రిగారికి ప్రాణ సంకటమే అయింది. అతి కోపం చూపిస్తే, అవతల జమీందారు గారి క్రోధం తట్టుకోవటం కష్టం! ఇటు శశి మూలంగా శిష్యగణమే సమూలంగా చెడేట్టు ఉంది!!

ఏడు స్వరాలు చెప్తుంటే, ఏడుపు మొహం పెడతాడు. రిషభం చెప్తుంటే, వృషభం స్వరూపంలో వింటాడు. గాంధారం పాడబోతే, గార్దభంలా ఓండ్ర పెడతాడు. కాకలి నిషాదానికి వచ్చేసరికి, ఆకలి వియోగం మొదలవుతుంది!!

తెచ్చుకున్న చిరుతిళ్ళు నమలటం ప్రారంభిస్తాడు. అది చూసిన మిగతా శిష్యగణం నీళ్ళు నమలటం మొదలుపెడతారు!!

ఇవన్నీ ఒక ఎత్తు, వాడి కాఫీ పిచ్చి ఒక ఎత్తు. గంటకోసారి కాఫీ త్రాగకుండా వాడిని ఆపటం ఈయన తరం కాలేదు.

కాఫీ రాగం వివరిస్తుంటే, ఫ్లాస్కులోంచి కాఫీ వొంపుకు తాగుతాడు. భూపాలం చెబుతుంటే, వెంట వచ్చే బంట్రోతు వైపు చూస్తాడు. వాడు చక్కెర కలిపి తెచ్చిన వేడి వేడి పాలలో, బ్రూ పౌడర్ కలిపి అందిస్తాడు. బ్రూ పాలతో ఆ రాగం సరి!

భోగాలలో తేలేవాడికి రాగాలు అంటవు. కానీ, అవి మిగతా శిష్యులకి అంటు రోగంలా వ్యాపించే ప్రమాదం ఉంది.

అది గుర్తెరిగి, సత్వరం వాడిని ఐసోలేట్ చేసేసి, క్వారంటైన్‌లో కూచోపెట్టి, ఏకాంత శిక్షణ కొనసాగించాడు ఆయన. ఏడాది గడిచి, ఎలాగోలా థియరీ చెప్పటం పూర్తి చేశాడు.

స్థిత ప్రజ్ఞులని కొందరుంటారు. అందరూ కలిసినా వీళ్ళని మార్చలేరు. ఈ శశి ఆ బాపతే. గురువుగారి ఏడాది శ్రమనీ బూడిదలో పోసేసి, నవ్వుతూ చూశాడు!

రఘునాథ శాస్త్రిగారు జమీందారుగారిని కలిసి, "మీ వాడికి శిక్షణ పూర్తయింది. ఇహ, స్వతహాగా ప్రాక్టీసు చేసుకోవటమే!" అని చెప్పేసి, 'అమ్మయ్య' అనుకోబోయాడు.

"మరిహనేం, మీ సరసన వీడి పాట కచ్చేరి పెడదామూ!"

'మీ పాడె కట్టేసి పెడతానూ' అన్నట్టు వినిపించింది రఘునాథ శాస్త్రి గారికి. కంగారుపడిపోయాడు.

"మహా ప్రభో! మర్రిచెట్టు నీడన మల్లె మొక్కలు పెరగవు. చిరంజీవితో ప్రత్యేకంగా కచేరీ పెట్టించండి. కావాలంటే, నా వాద్యబృందాన్ని పట్టుకుపొండి. నేను మాత్రం వేదిక మీద కాదు. ఆ చుట్టుపక్కల కూడా ఉండను. నా నీడ కూడా ఈ ప్రజ్ఞా నిధి మీద పడరాదు." అని వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ చెప్పాడు.

తొలి గానసభకి భారీ ఎత్తున ఏర్పాట్లు జరిగాయి. ఆ సాయంత్రం సభ అనగా, శశిభూషణ్ రఘునాథ శాస్త్రిగారింటికి వెళ్ళాడు.

"మీరు నా ఈ మొదటి మహా సభకి తప్పనిసరిగా విచ్చేసి, కొద్దినిమిషాలైనా వెచ్చించి, నన్ను దీవించి, నా శిరస్సు మీద నాలుగు అక్షింతలు వేయాలని ప్రార్థిస్తున్నాను." అన్నాడు.

తన నెత్తిన నిప్పులు పడ్డట్టు మండి పడ్డాడు రఘునాథ శాస్త్రి గారు. "నీ సభకా? నేనా? అసాధ్యం. నీ నెత్తిన అక్షింతలు వెయ్యాలా? ఇన్నాళ్ళు వేసిన చీవాట్లు చాలలేదా? బుద్ధి గడ్డితిని, నీకు శిక్షణ ఇచ్చినందుకు, నన్ను ఇంకా శిక్షించకు." అనేశారు క్రోధంగా.

శశిభూషణ్ అహం దెబ్బ తింది.

"అలాగేం? అలాగైతే, ఇదే నా ప్రతిన. మీ చేత సభా ముఖంగా సన్మానం జరిపించుకునే దాకా నేను విశ్రమించను." అనేశాడు.

నిరసనగా నవ్వాడు రఘునాథ శాస్త్రిగారు.

"ఈ జన్మలో అది సాధ్య పడదు." అన్నాడు.

"అదీ చూద్దాం!" అని అక్కడినుంచి కదిలాడు శశిభూషణ్.

ఆ మాట మర్చిపోయి, తన వేదంలో, ఆనక నిర్వేదంలో పడిపోయాడు రఘునాథ శాస్త్రిగారు.

తనయుడు పాటతో ఆకట్టుకోలేకపోయిన రసిక జనాన్ని, తండ్రి జమీందారుగారు 'వేలం పాట'తో ఆకట్టేసుకున్నారు.

నేల నాలుగు చెరగులా, ముఖ్యనగరాలలో శశిభూషణ్ సంగీత కచేరీలు ప్రారంభమయ్యాయి.

'నువ్వొకందుకు పోస్తే – నేనుకందుకు తాగుతున్నా' నన్నట్టు, చప్పట్లకు వీరు పిలిస్తే, సంభావనలకు వారొచ్చేవారు.

వెరసి, సభలు కిటకిటలాడేవి. శశిభూషణ్ శాస్త్రీయ సంగీతం కన్నా, ఆహుతులకి దక్కే మర్యాదలు ప్రజలని ఎక్కువ ఆకట్టుకునేవి. ఉచిత ప్రదర్శనలు– ఆపై షడ్రుచుల ఆరగింపులు!! ఇసకేస్తే రాలే జాగా మిగిలేది కాదంటే, ఎలా మిగులుతుంది మరి? సభలు జనంతో క్రిక్కిరిస్తే? పేపర్లు పొగడ్తలలో అగడ్తలు దాటేవి. ఈ క్రమంలో క్రమక్రమంగా, రఘునాథ శాస్త్రిగారికి విద్వత్తు తప్ప మరేమీ మిగల్లేదు. బృందం మాయమైపోయింది. సతీమణి పైవాడి పిలుపు అందుకుంది. ఆయన ఇహ బంధాలు తెంపుకుని, హరిద్వారం పట్టాడు.

ఇన్నేళ్లకి, ఇలా మళ్ళీ చంద్ర దర్శనం!!

★★★

"ఎందుకు చేశావీ పని శశీ? ఎప్పుడు శాస్త్రి బిరుదం తగిలించుకున్నావ్? ఎందుకు నన్నిలా ఇక్కడికి ఈడ్చావ్? దిక్కులు మాసిన శాస్త్రీయ సంగీతానికి, రెక్కలు కట్టి తారామండలం చేర్చావని భ్రమసి, రెక్కలు కట్టుకుని ఇక్కడ వాలానే, ఇదా నాకు నువ్వు చూపిన విద్వత్తు? ఇందుకా నేను వచ్చింది!"

"గురువర్యా! ఆనాడు, నాకు విద్య లేదని మీరు చింత పడ్డారు. నన్ను ఆశీర్వదించటానికి కూడా కించ పడ్డారు. ఏనాటికైనా, మీ చేత సభాముఖంగా సన్మానం జరిపించుకుని మీ చింత తీరుస్తానని మాట ఇచ్చాను. ఆ మాట ఈనాడు చెల్లించుకున్నాను." అన్నాడు శశి భూషణ శాస్త్రి, కసి తీరిన తృప్తితో.

ఆవేశ కావేషాలతో నోట మాట రాక, గుండె పట్టుకుని, సోఫాలోకి కూలబడిపోయారు రఘునాథ శాస్త్రిగారు.

వేదిక మీద కలకలం చెలరేగింది. అది ప్రేక్షకులలోకి ప్రాకింది.

"అయ్యో, నాద బ్రహ్మ పడిపోయారు..." అన్న అరుపులు మొదలయ్యాయి.

భద్రగిరికి కాళ్ళూ, చేతులూ వణికాయి. తను డబ్బుకి కక్కుర్తి పడి, శశిభూషణ శాస్త్రికి సహకరించటం ఇంతకు దారి తీస్తుందని అతడనుకోలేదు. ఈ విపత్కర పరిస్థితికి కళవళ పడి, జారిపోతున్న పంచె సర్దుకుంటూ, ఏ సహాయమైనా దొరుకుతుందేమోనని, సభలోకి పరుగుతీశాడు.

ఇవేమీ తెలియని చేతనాచేతనావస్థలో పడ్డారు రఘునాథ శాస్త్రిగారు. ఆయన మనసులోని శోకం, అప్రయత్నంగా నాద నామ క్రియా రాగమై ప్రవహించింది.

"ఏ తీరుగ నను దయజూచెదవో ఇన వంశోత్తమ రామా! నా తరమా ఈ గీతా శ్రవణము నళిన దళేక్షణ రామా!

క్రూర కర్మమున శిక్షణ నొసగితి నేరమునెంచకు రామా! నా పాపము పరిహారము సేయుచు మోక్షము నీయవె రామా!”

అకస్మాత్తుగా ఆ మూతబడిన కనుగవ ముందు శతకోటి సూర్య తేజ సమ కాంతి పుంజం మెరిసింది!!

అలనాడు జవానుడి రూపంలో వచ్చి, ఆ భక్త రామదాసుకు కావలసిన కాసుల దానమిచ్చినట్లే, ఈ భక్త రామదాసు మొర విన్న కోదండరాముడు, ఎగిరిపోనున్న ఇతడి ప్రాణపు చిలుకను, ఎగుభుజాన బంధించి, ఇతడికి అవసరమైన ఆరోగ్య దానం చేసే వైద్యుడి రూపుదాల్చి, ప్రత్యక్షమయ్యాడు!

మోహనరాగం ఆశువుగా ప్రవహించగా, సమ్మోహనంగా ఆలపించారు రఘునాథ శాస్త్రిగారు.

“నను పాలింపగ నడచీ వచ్చితివా! నా రామా! మొరనాలించీ తరలీ వచ్చితివా నా రామా!”

ఆయనకు చికిత్స అందించాలని, ప్రేక్షకులలో నుంచి ఆదరా బాదరా లేచి వచ్చిన వైద్యుడు రామారావు, మూతబడ్డ కనులతోనే కరాలెత్తి నమస్కరిస్తున్న రఘునాథ శాస్త్రి తననసలెలా గుర్తుపట్టాడో, ‘రామా’ అని పేరుపెట్టి మరీ ఎలా పిలుస్తున్నాడో అర్థంకాక అయోమయంగా చూశాడు.

ఆ మధ్య ప్రవాస తెలుగు కథాభిమాని శ్రీ రాయవరం భాస్కర్ గారు నిర్వహించిన బిప్లస్ కార్యక్రమంలో భాగంగా.. ప్రఖ్యాత చిత్రకారుడు, టిటిడి ఆస్థాన చిత్రకారుడు శ్రీ కూచి గారితో ఓ బొమ్మ వేయించి, ఆ బొమ్మ ని కొందరు రచయితలకి పంపి, ఓ ఇరవై నాలుగు గంటల్లో కథ రాయమన్నారు. అలా వచ్చిన కథల్లో శ్రీ పి.వి.ఆర్. శివకుమార్ గారి ఈ కథ ఎంపికయ్యింది. బిప్లస్ వారు ప్రతీ ఆదివారం నిర్వహించే "బి+ లైవ్ కథాకళ" అంతర్జాల కార్యక్రమంలో శ్రీ కూచిగారి సమక్షంలో శ్రీ రవికుమార్ గారు చదివి వినిపించారు. మేం కోరిన వెంటనే కథామంజరికి బొమ్మతో పాటు అందించిన శ్రీ రవికుమార్ గారికి, బొమ్మను వేసుకోడానికి అనుమతి ఇచ్చిన శ్రీ కూచి గార్కి ధన్యవాదాలు.

*కథ మిమ్మల్ని తొందరగా ప్రభావితం చేస్తుంది. అవి సంక్షిప్తతతో ముడిపడి, మరణం అంటే భయం లేకుండా చేస్తాయి. అవి ఎంత కఠినమైన సత్యాల్ని అందిస్తాయో, అంత ఆనందాన్ని కూడా ఇస్తాయి.*

*– ఆలి స్మిత్ (Ali Smith)*

# గోరింట పూచింది

డా. ఆర్. అనంత పద్మనాభరావు



"కుడి కాలితో ఆ బియ్యం కలశాన్ని తన్ని, ఇంట్లోకి కుడికాలు ముందు పెట్టి ప్రవేశించు!" అని పురోహితుడు కొత్త కోడలికి చెబుతున్నాడు.

"ఇద్దరూ పేర్లు చెప్పి లోపలికెళ్లాలి!" అని ముత్తైదువలు కొంగుముడి వేసుకున్న కొత్త దంపతుల్ని బలవంత పెడుతున్నారు.

కాళ్లకు పారాణి, గొలుసులు, పట్టుచీర, నడుంకి బంగారు వొడ్డాణం, భుజాలకు వొంకీలు, మ్యాచింగ్ బ్లౌజ్, మెరిసిపోతున్న నెక్లెస్, పచ్చతాడులో మెరిసే మాంగల్యాలు, పాపిడిబిళ్ల, బుగ్గ చుక్కతో పెళ్లికూతురు రాధ చూడ ముచ్చటగా వుంది.

'మా అన్నయ్య పేరు చెప్పు!' అని ఆడపడచులు నిలదీశారు.

'అల్లుడుగారు.. అమ్మాయి పేరు చెప్పాలి!' అన్నారు పెళ్లికూతురి తరఫు స్త్రీలు.

'బాధ!' అన్నాడు పెళ్లికొడుకు 'రాధ' అనకుండా.

అందరూ పకాలున నవ్వారు.

పెళ్లికూతురు ముఖం చిన్న బుచ్చుకొంది.

'రాధాదేవి, నేను కలిసి వచ్చాం!' అన్నాడు పెళ్లికొడుకు.

'ఇప్పుడు వదినె వంతు' అంది ఆడబడుచు.

'వేణు.....' మాటలు గొణిగింది.

'గట్టిగా చెప్పు! నోటిముత్యాలు రాలవు!', అంది ఓ ముసలావిడ.

'వేణుగోపాలకృష్ణమూర్తి' అంది సిగ్గుగా.

పట్టుచీర అంచులు కొద్దిగా పైకి పట్టుకొంది వధువు.

కాళ్లకు పూసిన గోరింట పారాణి బాగా పండి ఎర్రగా మెరుస్తోంది.

బియ్యం కలశాన్ని తన్ని, కుడికాలు ముందు పెట్టింది వధువు.

అలా నూత్న దంపతులు రాధావేణుగోపాలకృష్ణమూర్తిలు గృహప్రవేశం చేశారు.

★★★

వేణూరాధల సంసారం.. మూడు పువ్వులు, ఆరుకాయలు రీతిలో.

సరిగ్గా సంవత్సరం తిరిగేసరికి పండంటి మగబిడ్డను ప్రసవించింది రాధ.

ఉద్యోగరీత్యా నెల్లూర్లో కాపురం పెట్టాడు వేణు. బారసాల కాగానే పుట్టింటి నుంచి మగబిడ్డతో వచ్చింది రాధ.

బాలాజీ నగర్లో ఓ ప్లాట్లో కాపురం.

కమర్షియల్‌టాక్స్ డిపార్టుమెంటులో వేణు సీనియర్ అసిస్టెంట్. బిడ్డ పుట్టిన వేళా విశేషం.. సూపరింటెండ్ ప్రమోషన్ మీద ఒంగోలు ట్రాన్స్ఫర్. ప్రమోషన్ కాబట్టి వెళ్లక తప్పలేదు.

★★★

రాధ, వేణుల సంసార నావ సాఫీగా సాగిపోతోంది. ఐదేళ్ల సంసార జీవితానికి సాక్ష్యంగా ముగ్గురు బిడ్డలు.

రెండోది ఆడపిల్ల. మగపిల్లాడి కోసం మూడోసారి ప్రయత్నం. మూడో పిల్లాడు(?) కడుపులో వుండగా సీమంతానికి రాధను తయారు చేశారు.

రాధ తనకిష్టమైన గోరింటాకును కష్టపడి రెండు చేతులకూ పెట్టుకొంది.

రాత్రివేళ పనులన్నీ పూర్తి చేసి తీరికగా కూచొంది.

"కాళ్లకు కూడా పెట్టుకోక పొయ్యావా!" అన్నాడు వేణు, గృహప్రవేశం నాటి రాధ గుర్తుకొచ్చి.

'మీ సరసం చాలు' అంది రాధ సిగ్గులొలికిస్తూ.

'ఆ రోజు గృహప్రవేశం రోజు నీ పాదాలు ఇప్పటికీ గుర్తు. ఎంత అందగా వున్నావ్' అంటూ వేణు ఆవిడ బుగ్గ మీద ముద్దెట్టాడు.

'మీరు మరీ చిన్నపిల్లాడైపోతున్నారు.'

'కాదు మరీ! నలభై లోపేగా.'

'ఇంట్లో అత్తయ్య, మామయ్య వున్నారు. '

'తొమ్మిదో నెల వచ్చిందిగా! నువ్వలా కుర్చీలో కూర్చో! నేను నీ కాళ్లకు గోరింట పెడతాను!' అంటూ కుర్చీ ముందు బాచి పట్టు వేసుక కూచొన్నాడు వేణు.

సిగ్గుల మొగ్గ అయింది రాధ.

పెద్దపిల్లాడు ప్రకాష్, ఆడపిల్ల శిరీష అమ్మ చుట్టూ చేరారు.

'నాకూ చేతికి పెట్టు' అని శిరీష, నాన్న చేత గోరింట పెట్టించుకొంది.

రాధ కుడికాలు పట్టుకొన్నాడు వేణూ.

'ఏమిటండీ మీరు మరీను!' అంటూ రాధ కాలు వెనక్కి తీసుకొంది.

'ఫర్వాలేదు లేవోయ్!' అంటూ కుడికాలికి గోరింట పూశాడు.

రాధ కుర్చీలో బెరుకు బెరుగ్గా కూచొంది.

'ఒరే! వేణూ!' అంటూ బెడ్రూంలోంచి కేకవేసింది తల్లి.

'వస్తున్నా!' అంటూ రాధ ఎడం కాలు పట్టుకున్నాడు.

'నిన్నేరా!' అంటూ బెడ్రూంలోంచి బయటికొచ్చింది జానకమ్మ.

'రామ! రామ! ఇవేం పిదప బుద్ధులురా! కోడలుపిల్ల కాలు పట్టుకోవడం' అంటూ రాగాలు తీసింది.

కుర్చీలోంచి రాధ దిగాలున లేచింది సిగ్గుగా.

'తగుదునమ్మానని తాను కూచోడం, నువ్వు దాని కాళ్లు పట్టుకోడం, గోరింట పెట్టడం, ఏం చోద్యం రా!...

మా రోజుల్లో...' అంటూ శాపనార్థాలు పెట్టింది జానకమ్మ.

కళ్ల నీళ్లు కుక్కుకుంటూ లోపలికెళ్లింది రాధాదేవి.

★★★

కాలం స్పీడుగా దొర్లిపోయింది.

కొడుకులిద్దరికీ, కూతురికీ పెళ్లి చేశాడు.

వేణూ రిటైరయ్యాడు.

పెద్దాడు ప్రకాష్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. పెళ్లయి కాపురం పెట్టాడు. శిరీషకు పెళ్లయి చెన్నయిలో వుంటోంది. చిన్నాడు దిలీప్ బెంగుళూరులో కాపురం.

ఎవరి కాపురాలు వాళ్లవి.

వేణుగోపాల్ నెల్లూరు బాలాజీనగర్లో విశ్రాంత జీవితం గడుపుతున్నాడు.

వార్ధక్యం రావడంతో తినే మందులు, తినని తిండితో బతుకుతున్నారు. రాధాదేవికి బి.పి., షుగర్ సహజంగా సంక్రమించాయి. మోకాళ్ల నొప్పులతో ఇంట్లోంచి బయటకు తిరిగే వోపిక లేదు. కొడుకు ప్రకాష్ బలవంతం మీద వేణు, రాధ హైదరాబాదు చేరారు..

కొడుకూ, కోడలూ ఇద్దరూ ఉద్యోగాలు. పిల్లలు లేరు ప్రకాష్‌కి. కోడలు, కొడుకు ఉద్యోగాలకెళితే నిర్జీవ ప్రతిమల్లా ముసలాళ్లు ఇద్దరూ టీ.వీ ముందు కూచొని రోజంతా సీరియళ్లతో కాలక్షేపం.

ఆదివారాలు పిల్లలంతా కాన్ఫరెన్స్ కాల్లో ఓ గంట మాట్లాడుకొంటారు.

శ్రావణమాసం రాగానే రాధమ్మ గోరింట పెట్టుకుంటుంది.

కాళ్లకు పెట్టుకునేందుకు నడుములు వొంగవు.

రాధ కాళ్లకు గోరింటాకు పూయాలని వేణుగోపాల్ కి సంబరం.

'మీ అమ్మ దెప్పి పొడుపులింకా గుర్తున్నాయ్!' అంటూ రాధమ్మ హెచ్చరించింది.

గృహప్రవేశం నాటి రాధ రూపం వేణు మనఃఫలకంపై స్థిరంగా వుంది.

నవవధువు కాళ్లకు పారాణితో ఆ రోజు అలా ప్రవేశించిన వేళావిశేషం శుభప్రదం.

కుటుంబం వృద్ధి చెంది అందరూ ఇళ్లూ, వాకిళ్లు సంపాయించుకొన్నారు.

తాను మంచి పేరుతో రిటైరయ్యాడు.

చివరి రోజుల్లో అమ్మనాన్నలకు సేవలు చేశాడు.

రిటైరయి అప్పుడే మూడేళ్లు.

'హైదరాబాదులో నాకేం తోచడం లేదురా? నెల్లూరు వెళ్లిపోతాం' అన్నాడు వేణు.

'అక్కడ మీ నాన్నకు ట్రంక్‌రోడ్డులో ఫ్రెండ్స్ బోల్డు మంది. సాయంకాలం నాల్గింటికి వూరి మీదకెళితే, రాత్రి తొమ్మిదింటికి గాని రారు. ఆ డొక్కు స్కూటర్ మీద వెళతారు' అంది జానకమ్మ దెప్పి పొడుస్తూ.

'మీరెక్కడికీ వెళ్లొద్దు. ఇక్కడే వుండండి' అంటూ ఆ ప్రతిపాదన ప్రకాష్ కొట్టిపారేశాడు.

ఓ మధ్యాహ్న వేళ రాధా వేణుగోపాల్‌లు భోజనానంతరం యధావిధిగా టీవీ సీరియల్ ఆన్ చేశారు.

"చిలకా గోరింక" సీరియల్ 315వ ఎపిసోడ్ నడుస్తోంది.

అందులో కథ అచ్చం తమ కథలా అనిపించింది.

సీరియల్లో వృద్ధుడికి ఇద్దరు కొడుకులు, తాను రిటైరయ్యాడు. పెద్దకొడుకు అమ్మను, చిన్నకొడుకు నాన్నను పంచుకొన్నారు.

ఒకరు ఢిల్లీలో, మరొకరు చెన్నయిలో.

ఓసారి అమ్మా, నాన్న.. ఇద్దరూ కలిసి మాట్లాడుకొని ఓ ప్రపోజల్ పెట్టారు.

'ఒరే! మేం పెద్ద వాళ్లమయ్యాం. ఇద్దరం ఒక చోట ఉంటాం. ఒక్కొక్కరి దగ్గర ఆరేసి నెలలు వుంటాం. ఒకరి కష్టసుఖాలు మరొకరు పంచుకుంటాం" అన్నాడు నాన్న.

పెద్ద కొడుకు లా పాయింట్ తీశాడు.

'అమ్మ నా దగ్గరే వుంటుంది. మీ కోడలు ఆఫీసు నుంచి లేటుగా వస్తుంది. అందుకని ఇంట్లో మనవడికి తోడుగా వుంటుంది. ఆమె అక్కడ వుంటే మాకిబ్బంది. ప్రస్తుతానికిలానే కొనసాగిద్దాం' అన్నాడు జడ్జిమెంట్ ఇచ్చినట్లు!

చిన్నవాడు మరో మాట అనేశాడు.

"కోడలికీ, అమ్మకు మాట పట్టింపులు గాబట్టి వాళ్ల యిద్దరి మధ్యా గొడవలు సర్దుబాటు నేను చేయలేను. ప్రస్తుతానికి నాన్న మీతోనే వుంటారు".

ఇలా సాగిపోతోంది సీరియల్.

"ఛీ! పాడు సీరియల్' అంటూ కట్టేసింది జానకమ్మ.

'నువ్వు మెచ్చుకున్నా, మెచ్చుకోకపోయినా.. ఈనాడు లోకం పోకడ అది' అంటూ కళ్లజోడు తీసి కనుగొలకుల్ల తడి తుడుచుకున్నాడు వేణు.

'మీరు మరీ ఫీలవుతున్నారు. ఒకరి మీద మనం ఆధారపడాల్సిన అగత్యం లేదు. బాలాజీనగర్లో సొంత ఇల్లు వుంది. మీ పెన్షన్ డబ్బులు తిండికి సరిపోతాయి. మనం వెళ్లిపోదాం' అంది రాధమ్మ.

'వయస్సు పైబడుతోంది. మనం వొకళ్ల మీద ఆధారపడాల్సిన రోజులు. వాళ్ళని కాదని స్వతంత్రించి వెళ్లడం భావ్యం కాదు. మనం హాస్పిటల్ పాలైతే వాళ్లే దిక్కు.'

ఇంట్లో ఫోన్ మోగింది.

కూతురు శిరీష ఫోన్.

'హలో! డాడీ! బాగున్నారా! అమ్మా, నువ్వు రండి డాడీ! చెన్నయికి.'

'అలానే లే అమ్మా!'

'ఆం... ఈయన యూరప్ ట్రిప్ వెళ్లారు. నెలనాళ్లు రారు, నాకు బోర్ కొడుతోంది!'

'అమ్మ కాళ్ల నొప్పులెలా ఉన్నాయి నాన్నా!' అంది శిరీష.

'ఇదిగో! నువ్వే మాట్లాడు తల్లీ!' అంటూ ఫోన్ రాధమ్మ కందించాడు.

'శిరీషా! బుజ్జిగాడు కాలేజి కెళ్లాడా?' గడగడా మాట్లాడుతోంది రాధమ్మ.

'నాకు బోర్ కొడుతోంది. నువ్వు, నాన్నా రేపు రండి. పది రోజులుండండి.'

"పది రోజులేం కర్మ! పది నెలలుండమన్నా ఉంటాం."

'ఆడపిల్ల యింట్లో వుండగూడదని మీరే అంటారుగా' శిరీష నొక్కి పలికింది.

'నిజమే! మీ అన్నయ్య దగ్గరో, తమ్ముడి దగ్గరో వుండటం ధర్మం. నెల్లూరు పోదామని మీ నాన్న వారానికోసారి అంటారు.'

'నెల్లూర్లో ఏముంది? హైదరాబాదులోనో బెంగుళూర్లోనో వుండండి.' అంది శిరీష,

'చెన్నయిలో వద్దంటావ్' ఛలోక్తి విసిరింది రాధమ్మ.

లోకాభిరామాయణం మాట్లాడి పెట్టేసింది శిరీష.

మళ్లీ టీవీ ఆన్ చేసింది రాధమ్మ.

'జీవిత కాలం వచ్చే సీరియల్స్' అంటూ తిట్టిపోస్తూ టీవీ కట్టేసింది.

★★★

"నాన్నా! నేను దిలీప్ మాట్లాడుతున్నా!"

'ఏరా! అంతా బాగున్నారా?'

'బాగున్నాం నాన్నా! నాకు అమెరికాలో సీనియర్ పొజిషన్ ఇచ్చారు.'

'కంగ్రాట్స్! ఆ భగవంతుడు మనకు అన్నీ ఇస్తున్నాడు.'

"ఈ నెల 14 నైట్ కి టిక్కెట్ బుక్ చేశా!'

'మీ అమ్మకు చెప్పు! సంతోషిస్తుంది'

'ముందు నీతో మాట్లాడాలి...'

'చెప్పరా...'

"నాకొక్కడికే వీసా వచ్చింది. మీ కోడలు, మనవడు నితీష్ ఇక్కడే వుంటారు. వాళ్లకు ఓ సంవత్సరం తర్వాత గాని వీసా రాదు."

'మీ ఉద్యోగాల్లో కష్టసుఖాలు మాకేం తెలుస్తాయి లేరా!'

'నువ్వు ఈ సంవత్సరం రోజులు ఇక్కడ బెంగుళూర్లో ఉండాలి'

'మీ అమ్మ...'

'ఆవిడకూ, కోడలికీ పడదుగా...'

'అయితే అమ్మనూ, నన్ను విడదీస్తున్నారు.'

'నేను చెప్పేది అర్థం చేసుకోండి నాన్నా!"

'మమ్మల్ని నువ్వు ఎప్పుడు అర్థం చేసుకొన్నావు గనక...'

"మీ ధోరణి మీదేగానీ..."

'మీ అమ్మతో మాట్లాడు...' ఫోన్ రాధమ్మకిచ్చి రూంలోంచి బయటికొచ్చాడు వేణు.

ఫోన్లో కొడుకు చెప్పింది వింది రాధమ్మ.

'మీ నాన్న యిష్టం. నీ యిష్టం. నేను మాత్రం రాను. నీ భార్య నిర్వాహకం నాకు తెలుసు. నేనంటే పడని వాళ్లతో ఉండాల్సిన కర్మ నాకు లేదు.' అని ఫోన్ పెట్టేసింది రాధమ్మ.

దిలీప్ అమెరికా కెళ్లిన నెలనాళ్లకు చిన్నకోడలు ఫోన్ చేసింది.

'మామయ్యా! నాకు భయంగా వుంది...' అంటూ తన కొడుకు నితీష్‌కి ఫోన్ ఇచ్చింది.

"గ్రాండ్ పాపా! ఐ వాంట్ టు సీ యూ' అని వాడు ఇంగ్లీషులో మాట్లాడి తాతయ్య మమకారాన్ని పెంచాడు.

'ఓ వారం రోజుల్లో తిరిగి వస్తానని' బెంగుళూరు బయలుదేరాడు వేణుగోపాల్.

ఏడెనిమిది నెలలు గడిచేసరికి మనవడితో చనువు పెరిగి తాతయ్య కాళ్లకు బంధాలు పడ్డాయి. తొలినాళ్లలో రోజూ రాధమ్మకు ఫోన్ చేసి ఓ అరగంట మాట్లాడేవాడు వేణుగోపాల్. తర్వాత రెండు రోజులకో, మూడు రోజులకో మాట్లాడసాగాడు. ఆ తర్వాత వారానికొకసారి మాట్లాడుతున్నాడు.

వారిద్దరూ ఫోన్లో ఒకరి ఆరోగ్యం గురించి మరొకరు వాకబు చేసేవారు.

కోడలు ప్రవర్తనను గూర్చి ముచ్చటించుకొనేవారు.

మనవడి తెలివితేటలకు మురిసిపోయేవారు.

'ఆరోగ్యం జాగ్రత్త!' అని ఉభయులూ హెచ్చరికలు చేసుకొనేవారు.

ఫోన్లోనూ చిలిపి తగాదాలు పెట్టుకొనేవారు.

గతంలో జరిగిన మాట పట్టింపులు, పడకలో పట్టింపులు గుర్తు చేసుకొనేవారు.

చిన్నప్పుడు పడ్డ డబ్బు యిబ్బందులు స్మరించుకొనేవారు.

పిల్లల అనారోగ్యాలు, ట్రాన్స్ఫర్లు, పిల్లల చదువు సంధ్యలు, పెళ్లిళ్లు వారి ఫోన్ పలకరింపుల్లో దొర్లేవి.

ఈ వయస్సులో ఒకరికొకరం దూరమయ్యామనే బాధ స్ఫురించేది.

'కోడలు బాగా చూసుకొంటోంది' అని ఒకసారి నోరు జారాడు వేణుగోపాల్.

'నేనంటేనే పడదు. వాడి దగ్గర 'మీ అమ్మ అలా అంది... ఇలా అంది' అని కారాలు మిరియాలు నూరుతుంది'

అని రాధమ్మ ఘోష వెళ్లబుచ్చింది.

★★★

ఓ తెల్లారి జామున పెద్దవాడు ప్రకాష్ ఫోను.

"డాడీ! అమ్మకు స్ట్రోక్ వచ్చింది. స్టార్ హాస్పిటల్లో చేర్చాం."

'ఏమైందిరా!' కంగారుగా అడిగాడు వేణుగోపాల్.

'రాత్రి రెండు గంటలప్పుడు గుండెల్లో నొప్పి అంది. వొళ్లంతా చెమటలు పోశాయి. వెంటనే స్టార్ హాస్పిటల్లో చేర్చాం. డా. సోమరాజ్ చెక్ చేశారు. 30 వేల రూపాయల ఇంజెక్షన్ ఇచ్చారు. 48 గంటలు ఐ.సి.యూలో ఉంచాలన్నారు.'

మాట పెగల్లేదు వేణుగోపాల్‌కు.

'మీరు బయలుదేరి రండి!' అంటూ ఫోన్ పెట్టేశాడు ప్రకాష్.

ఉదయం ఫ్లైట్ ఎక్కి హైదరాబాదులో వాలాడు వేణుగోపాల్.

రాధమ్మను ఐ.సీ.యూలో వుంచారు.

గ్లాస్‌డోర్ లోంచి దూరంగా చూసి భోరున ఏడ్చాడు వేణుగోపాల్.

'మీరు మాకు ధైర్యం చెప్పాలి నాన్నా!' అంటూ ప్రకాష్ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

ఆ రాత్రి ఐ.సీ.యూ రూం ముందే కునికిపాట్లు తీశాడు వేణుగోపాల్.

'మీరు యింటికెళ్లండి. నేనుంటా'నని ప్రకాష్ అన్నా వినలేదు.

తెలతెలవార వస్తోంది.

ఎలానైనా రాధను రూంలోకెళ్లి చూడాలి. రాధ తనతో మాట్లాడే స్థితిలో లేకపోవచ్చు. ఆవిడను ముట్టుకొని తన మనస్సులో మాట చెప్పాలి. ఎదురు చూస్తున్నాడు. ఐ.సీ.యూ ఇన్చార్జి సిస్టర్ బాత్రూం కెళ్లడం గమనించాడు.

ఇదే అదనని చెప్పులు బయట వదలి వేణు హడావిడిగా లోపలికెళ్లాడు.

చేతిలో చిన్న స్టీల్ బాక్స్ వుంది.

ఒక్క పరుగున లోపలికెళ్లాడు.

ఎప్పటి నుంచో మనసులో కోరిక!

సిస్టర్ వచ్చేలోగా పూర్తి చెయ్యాలి.

స్టీల్ బాక్స్‌లో వున్న గోరింటాకు పసరు రాధమ్మ పాదాలకు పూశాడు.

'రాధా!' అంటూ గొల్లుమన్నాడు.

రాధమ్మ కాళ్లు ఎప్పుడో చల్లబడ్డాయి.

'నా రాధ యిక లేదు' అంటూ అక్కడే కుప్పకూలాడు వేణు.

*("నవ్య" వారపత్రిక నుంచి పునర్ముద్రణ)*

*ఓ కథ చదవడం ద్వారా మీకు మీ చుట్టూ ఉన్న ప్రపంచం మీద ప్రేమ అనురాగాలు పెరుగుతాయి.*

– జార్జ్ సాపుండర్స్

**"హరివిల్లు వర్ణాల కథామంజరి – ఉగాది పచ్చడిలో తీపి, వగరు సగం సగం"**

శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది ప్రత్యేక సంచికగా ఏప్రిల్–2022 లో వెలువడిన అంతర్జాల పత్రిక, పోటీలో నెగ్గిన పదహారు కథలు (పోటీలో మొదటి మూడు స్థానాలలో నిలిచినవి, ప్రోత్సాహక బహుమతులు పొందిన పన్నెండు కథలు, అంగర సూర్యారావు గారి కథ), తొంభై పుటలతో ఈసారి ప్రత్యేకంగా రంగులతో ఆకర్షణీయమైన రీతిలో వెలువడింది. రంగులలో సంచిక మెరిసిపోయింది. (ఎప్పుడూ ఇలాగే వస్తుందా? ఉగాది స్పెషలా?)

మొదటి కథ 'తలపాగా'. నిర్వాసితులైన రైతుల మానసిక స్థితిని ప్రతిబింబించే కథ. రెండవ స్థానంలో నిలిచిన కథ 'శంభుని పెళ్ళాం'. స్త్రీ స్వాభిమానం గురించి చివరి ఒక్క మాటతో చెప్పిన కథ. ఆ చివరి మాటే లేకపోతే మరీ సాధారణ కథగా ఈ కథ మారి ఉండేది.

నిర్వాహకులు ఏ ఉద్దేశ్యంతో ఈ కథల పోటీ నిర్వహించారో ఆ ఉద్దేశ్యాన్ని స్పష్టంగా ఇమిడ్చి రాసిన కథ (ఇలాంటివి ఓ అయిదో, ఆరో అంతే!) 'బోడి మావ'. కాకపోతే ... "ఎమ్మెల్యే గారి ఇయ్యంకుడు ఇత్తనాలు, ఎరువుల షాపు పెట్టిండట.... వాడి యాపారం నడిపించడానికేనంట" అంటూ సాగిన విషయం ... ఒక ప్రభుత్వ పథకం ఒక నియోజకవర్గానికే పరిమితమవుతుందా? ఒక వేళ అయితే ఏ సందర్భాల్లో అవుతుంది... అనే పూర్వాపరాలపై రచయిత సరిగా దృష్టి పెట్టలేదేమో అనిపించింది.

లక్ష్మణరావుగా మారిన లచ్చిగాడిని అలా మార్చిన 'నారు పోసినవాడు' ఆకలి రక్కసికి బలైపోతున్న అనాథల గురించి ఎందుకు పట్టించుకోదు? అంటూ వేసిన ప్రశ్నతో కథ ఆగితే బాగుండేదేమో! అంత విశ్లేషణాత్మక ప్రశ్నకు గురైన కథకుడిని 'సబ్ కా మాలిక్ ఏక్ హై' పాట ఎందుకు హాయిని ఇచ్చినట్టు? ఏమో?

దేశభక్తిని ప్రబోధించే మాస్టారు ఆయన జీవితంలో జరిగిన విషాదం వల్ల విదేశానికి వచ్చి ఉండాల్సిన పరిస్థితి రావడం గురించి 'విలయం' చర్చిస్తుంది. ఈ కథ కూడా పోటీ ఉద్దేశ్యాన్ని ప్రతిబింబించే కథ. కాకపోతే విదేశాలకు వెళ్ళడం దేశభక్తి లేకపోవడం అవుతుందా? అనే చర్చను లేవదీస్తున్నట్టనిపిస్తోంది.

ఓటుకు నోటు తీసుకొనే ఓటర్లను గుచ్చుతూ రాసిన కథ 'ఐ వాంట్ జస్టిస్'. ఇంతకీ కథలో ఈ మాటన్నది ఎవరో తెలుసా? ఓటరు కాదు... యం.ఎల్.ఏ. దేవసేన. ఈ పాయింట్ మీద చాలా కథలు వచ్చినాయి. కానీ ఈ కోణంలో వచ్చిన కథ బహుశా – నేను చదివిన వాటిలో– ఇదే మొదటిది కావచ్చు.

లంచం, అవినీతి గురించి రాసిన కథ 'గిరీశం@గంధవరం'. పాపం, గిరీశం.. కథ చివరికి వచ్చేసరికి.. వ్యవస్థలో అంతా బాగానే ఉంది, అసలు నేరస్తుడు గిరీశమే అని తేల్చేశాడు మాస్టారు. కథ ఎటో మారినట్టయింది.

'అమ్మా! ఆశ!!' కథలో దాదాపు సమకాలీన సమస్యలన్నీ ఏక బిగువున పరిష్కరించినట్టయింది. ఇలా జరిగితే బాగుండును అనిపించే కథ. ఇందులో కథ కంటే, కాస్త వ్యాసరూపం ఎక్కువైంది అనిపించినా సమస్యలు పరిష్కారాలపై పెట్టిన దృష్టి అభినందనీయం.

సుబ్బారెడ్డి అనే పులి చేసిన హత్య ఈ దేశంలో ఎప్పటికీ తేలదు! అనే రచయిత బాధను, ఉక్రోశాన్ని వెళ్లగక్కిన కథ. నిజమే! ఈ రాజ్యంలో అటువంటి అకృత్యాలు పరిష్కరించబడవు. ఒక వేళ పరిష్కరించినా బాధితులకు ఒరిగేదేమీ ఉండదు.

ఈ సంచికలో భలేగా అనిపించిన కథ 'నూటికి నూటపది.' అతిపాత ప్లాట్. కానీ బహు చమత్కారంగా నడిపించిన కథ. ఊరగాయకు ఉక్రెయిన్ యుద్ధానికి ముడి పెట్టిన కథ. ఒకసారి చదవండి. నాకైతే శ్రీ రమణగారు గుర్తుకు వచ్చారు ఆ శైలిని చూస్తే.

ఇదే ప్లాట్‌తో వచ్చిన మరో కథ 'సహజరంగుల ప్రకాశం'. మంచి ఫ్లో తో సాగుతుంది. కథలో గున్నేరువాగు వరద వల్ల మునిగిపోబోతున్న హుమాయూన్‌ను ఒక చిత్రపటం రక్షిస్తుంది. నిజంగా పటం పట్టుకుంటే నీళ్ళల్లో తేలతారా? అని మళ్ళీ వెనక్కి వెళ్ళి చూస్తే ఆ పటం కొలతలు నాలుగు బై మూడు అడుగులు. ఓహో! ఈ కొలతలిచ్చింది ఇలా కాపాడటానికేనా! అనుకున్నాను. ఇంతకీ ఈ కొలతలతో ఉన్న టేకు ఫ్రేముతో ఉన్న పటంతో పిల్లవాడు బతుకుతాడా? గోదావరి ఒడ్డున ఉండే వాళ్ళు చెప్పాలి! ఇంకోటి. "రవి రాకతో వికసించిన కమలంలా అయిన తన మదిపై ఝుమ్మని తిరుగుతన్న చిన్నప్పటి జ్ఞాపకాల తుమ్మెదల రొదలో మునిగిపోయాడు" ఈ ఎక్స్‌ప్రెషన్ మీకేమైనా అర్థం అయిందా? నా వరకైతే సమాధానం లేదనే!

'పనిమనిషితో, పక్కింటి వాళ్ళతో సర్దుకుపోగలిగిన నువ్వు నా తల్లితో సర్దుకుపోలేక, ఈ వయసులో ఆవిడకు నన్ను దూరం చేస్తావా?" భర్త మనసును చదివిన స్వాతి తీసుకున్న నిర్ణయం 'శిశిరాన్ని వెన్నంటిన వసంతం'. ముచ్చటైన ప్లాట్. కథ నడక కూడా బాగా కుదిరింది.

'అనుదీప' కథ అరిగిపోయిన అంశమే. కానీ టైటిల్ పేరు బాగుంది. తరువాత కథ 'సునయన'. పాత్రో కూతురు 'సునయన' ఈ కథలో నాయిక. బహుశా కర్నాటకలో రాజుకున్న 'హిజాబ్' నేపథ్యంలో రాయబడిన కథేమో అనిపించింది. ఒక వేళ అదే అయితే రచయితకు హిజాబ్‌కు, బుర్ఖాకు భేదం తెలీదేమో అనుకోవాల్సి వస్తుంది. అనుభవం కలిగిన రచయిత రాసిన కథ అని తెలుస్తున్నప్పటికీ, ఈ సూక్ష్మ విషయంపై శ్రద్ధ పెట్టి ఉంటే బాగుండేది. ఎందుకంటే కథకు ఈ పాయింటే ఆయువు పట్టు మరి!

'రోడ్ డాక్టర్స్' గా హైదారాబాద్‌లో పిలువబడే గంగాధర్ తిలక్, వెంకటేశ్వరి దంపతుల గురించిన వార్త 'మిథునం' అనే కథకు ఆధారం అయి ఉంటుంది. ఆ దంపతులు సొంత కారులో రోడ్డుపై గుంతలు పూడ్చడానికి కావలసిన మెటీరీయల్‌తో ఇప్పటి వరకు 2000 పైగా గుంతలు 40 లక్షల రూపాయల ఖర్చుతో పూడ్చారట. కానీ ఇలాంటి వార్తా కథనాల ఆధారంగా కథ రాసేటప్పుడు చాలా గ్రిప్పింగ్‌తో రాయాల్సి ఉంటుంది. శ్రీరమణగారి ఫేమస్ కథ పేరు పెట్టినప్పుడు మరీనూ! ఇంతకీ టైటిల్‌లో అక్షరదోషం వచ్చింది గదా? మిథునం – మిధునం(?)

సంచికలో చివరి కథ అంగర సూర్యారావుగారి 'దగాపడిన తమ్ముళ్ళు' కథ. 1953 మొదట్లో ప్రచురించబడిన కథ. అప్పటి చిన్న ఉద్యోగస్తుల జీతాలు, జీవితాల గురించిన కథ. అప్పటి స్థితులను అంత బాగా కథలలో ఇమిడ్చిన పెద్దవాళ్ళు, మనకు చేసిన మేలు ఇంతా అంతా కాదు. వారే రాయకపోతే అప్పటి పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పటి వాళ్ళు ఊహామాత్రం కూడా అవగాహనలోకి తెచ్చుకోగలిగేవారు కాదు.

ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే మంచి కథలను చదివామని ఫీల్ ఇచ్చే కథలు కొన్ని ఈ సంచికలో ఉన్నాయి. కాకపోతే ఉగాది పోటీ కథలు కదా అని ఆరాటంతో చదివిన దరిమిలా కొంతమేరకు నిరాశ చెందాను. ఆకలి తీరింది కానీ, ఉగాది విందుభోజనం కాదు. (ఇవి వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే అని గమనించ ప్రార్థన!!)

**– రాంబో**

కథలపై విశ్లేషణ చేయండి.

మీ స్పందనే

మాకూ, కథకులకూ స్పూర్తి.

❖

మీకు తెలిసిన కథాభిమానులకు

కథామంజరిని

పరిచయం చేయండి.